fb/prajasakti, www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 37 సంచిక : 46 | విజయవాడ, శుక్రవారం 16 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

దక్షిణాఫ్రికా అధ్యక్ష పదవికి జుమా రాజీనామా

కొత్త అధ్యక్షుడుగా సిరిల్ రమ్‌ఫోసా ఎన్నిక



9

నేపాల్ కొత్త ప్రధాని ఓలి

- రాజీనామా చేసిన షేర్ బహదూర్ దేబా
- రెండు కమ్యూనిస్టు పార్టీల విలీనం క్రమం ప్రారంభం



9

వ్యూహమా... తడబాటా!

టిడిపి నేతల తలోమాట

ప్యాకేజికి హోదాకు తేడా ఏమిటి? : చంద్రబాబు

మార్చి 5నే మంత్రుల రాజీనామా : ఆదినారాయణరెడ్డి

అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం : రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోసం నరేంద్రమోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విషయంలో తెలుగుదేశం పార్టీ నేతలు తలోరకంగా మాట్లాడుతున్నారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వీరి ప్రకటనలు సాగుతున్నప్పటికీ వీటిలో కూడా స్పష్టత ఉండటం లేదు. దీంతో ఆ పార్టీ వ్యూహాత్మకంగా ఇలా వ్యవహరిస్తోందా... ప్రజానీకం నుండి వస్తున్న తీవ్ర ఒత్తిడితో తడబాటుకు గురవుతోందా అన్న సందేహం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్యాకేజికి, హోదాకు ఉన్న తేడా ఏమిటో చెప్పాలని గురువారం నాడు కూడా ప్రతిపక్షాలను ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీకి పదవులు ముఖ్యం కాదన్న ఆయన, జగన్ మాదిరి తనపై కేసులు లేవని, కేంద్రానికి భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పవన్‌కళ్యాణ్ చర్యల నుండి వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో వైసిపి, బిజెపితో పొత్తుపెట్టుకుంటుందంటూ ఒక ఆంగ్లపత్రికలో వచ్చిన వార్తను ఆయన చదివి వినిపించారు. అయితే. కేంద్ర ప్రభుత్వానికి మార్చి 5వ తేదే డెడ్‌లైన్ అన్నట్లుగా పలువురు టిడిపి నేతలు బుధవారం నాడు చేసిన ప్రకటనలను ఆయన ప్రస్తావించలేదు. అంచలంచెలుగా ఉద్యమాన్ని చేపడుతామని మాత్రమే ఆయన అన్నారు. అదే సమయంలో ఏలూరులో మాట్లాడిన మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మార్చి5న చంద్రబాబు తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. పాదయాత్రకు జనం రాకపోవడంతోనే జగన్ రాజీనామాల డ్రామాను తెరపైకి తెచ్చారని పేర్కొన్నారు. కాకినాడలో విలేకరులతో మాట్లాడిన హోంశాఖ మంత్రి నిమ్మకాలయ చినరాజప్ప కూడా మార్చి 5వ తేదిన అనూహ్య నిర్ణయం ఉంటుందని చెప్పారు. జగన్ కపట నాటకాలాడుతున్నారని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో మాట్లాడిన టిడిపి నాయకులు కూడా ఇదే విధంగా స్పందించారు. మరోవైపు మిగతా 9లో

ఎంపిలందరి చేత రాజీనామా

చంద్రబాబుకు జగన్ సవాల్ 12

అంచెలంచెలగా పోరాటం

టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు 2



దావోస్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో కలిసి ఫొటో దిగిన నీరవ్ మోడీ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

కేడీ నీరవ్ పరార్

- కుటుంబంతో సహా స్విస్‌కు..
- నెల రోజుల ముందే చెక్కేశారు
- కార్యాలయాలపై ఇడి దాడులు
- రూ.5100 కోట్ల ఆస్తుల సీజు
- దావోస్‌లో ప్రధానితో కలిసి ఫోటోలు

న్యూఢిల్లీ/ముంబయి : దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిన వజ్రాల వ్యాపారీ నీరవ్ మోడీ విదేశాలకు పరార్ అయ్యాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)కి దాదాపు రూ.11,500 కోట్ల ఎగనామం పెట్టి నీరవ్ సంచలనం సృష్టించారు. కాగా పరిస్థితులు విషమించినట్లు ముందే గమనించాడో ఏమిటో నెల రోజుల ముందే కుటుంబ సభ్యులతో కలిసి స్విట్జర్లాండ్ చెక్కేశారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ వర్గాలు ధృవీకరించాయి. నీరవ్ ఆయన సోదరుడు అయినా బెల్‌గెయిన్ పౌరుడు నిషాల్, భార్యా అమెరికా పౌరురాలు అమీ, వ్యాపార భాగస్వామీ మెహుల్ చౌక్సీతో కలిసి వెళ్లిపోయారు. వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు కావడంతో పరిశోధన ఎజెన్సీలు వారి రాకపోకలను విశ్లేషించాయి. స్కాం దెబ్బతో రెండు రోజుల్లో పిఎన్‌బి షేర్ 21 శాతం పతనమయ్యింది. దీంతో మదుపర్లు రూ.8వేల కోట్లు నష్టపోయారు. ఈ కుంభకోణంలోని బాధ్యులను ఉపేక్షించబోమని పిఎన్‌బి సిఇఒ సునీల్ మెహతా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఆర్‌బిఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వర్గాలు రంగంలోకి దిగాయి. నీరవ్‌కు చెందిన ఆస్తులను ఇడి జప్తు చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకూ 18మంది అధికారులను మిగతా9లో



కాల్పుల్లో గాయపడిన విద్యార్థి

ఫ్లోరిడా స్కూల్లో కాల్పులు

19 మంది విద్యార్థులు మృతి

- మరో 14 మందికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం
- నిందితుడు మాజీ విద్యార్థే

వాషింగ్టన్ : అమెరికా రాష్ట్రమైన ఫ్లోరిడాలోని ఒక హైస్కూల్లో బుధవారం మాజీ విద్యార్థి (19) విచక్షణారహి తంగా జరిపిన కాల్పుల్లో 19మంది మరణించారని, పలువురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. కాల్పులు జరిగిన వెంటనే ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నామని, నికొలస్ క్రజ్‌గా గుర్తించామని చెప్పారు. క్రజ్ ఆ స్కూలు నుండి బహిష్కృతుడైన విద్యార్థే. అతని వద్ద నుండి ఎఆర్-15 సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్రొవార్డ్ కౌంటీ షరీఫ్ ఇజ్రాయిల్ విలేకర్లతో మాట్లాడుతూ, ఈ కాల్పుల్లో స్కూలు భవనంలోనే 12మంది మరణించగా, ఇద్దరు స్కూలుకు వెలుపల చనిపోయారని, సమీపంలోని రోడ్డుపై ఒకరిని కాల్చి చంపాడని తెలిపారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో చనిపోయారు. మృతులం దరినీ గుర్తించామని చెప్పారు. మరో 14మంది గాయపడ్డారని, వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా వుందని మిగతా9లో

ఏమీ తేలలేదు

- రాష్ట్రాల మంకుపట్టు
- కృష్ణా, గోదావరి బోర్డు సమావేశంలో కొలిక్కి రాని సమస్యలు
- బోర్డు పరిధిని నోటిఫై చేయాలి: దేవినేని ఉమా
- అసంతృప్తిగా ముగిసింది: హరీష్ రావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా, గోదావరి నదీ జలాల యాజమాన్య బోర్డు సమావేశంలో ఏమీ తేలలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వారివారి వాదనలు వినిపించాయి. గతంలోనే చెప్పిన వాదనలే మళ్లీ తెలిపాయి. అంతేతప్ప ఈ సమావేశంలో కొత్తగా ఏమీ చర్చకు రాలేదు. వాటాలపై అదే మంకుపట్టు ఇరు రాష్ట్రాలు ప్రదర్శించాయి. గురువారం నాడిక్కడ సిడబ్ల్యుసిలో కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యుపి సింగ్ నేతృత్వంలో కృష్ణా నదీ జలాల యాజమాన్య బోర్డు(కెఆర్ఎంబి), గోదావరి నదీ జాలాల యాజమాన్య బోర్డు(జిఆర్ఎంబి)ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపి జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, తెలంగాణ జలవనరుల శాఖ కార్యదర్శి ఎస్.కె జోషి, ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీదర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల్లో ఉండే ప్రాజెక్టులు, నీటి వాడకం వంటి అంశాలపై చర్చ జరిగింది. గోదావరి వృథా నీటిని పట్టిసీమ ద్వారా కృష్ణాకు తరలించడంతో కృష్ణా జలాల్లో 45 టిఎంసిలు నీటిని తెలంగాణ వాటా అడుగుతుందని, కానీ ఏపి ప్రభుత్వం గోదావరి వృథా నీటిని మాత్రమే తెచ్చుకొని వాడుకుంటుందని, అలాంటప్పుడు నీటిని ఎలా ఇస్తామని ఏపి ప్రభుత్వం తమ వాదన వినిపించింది. మైనర్ నీటిపారుదల ద్వారా ఏపికి 20 టిఎంసిలు, తెలంగాణకు 89 టిఎంసిలు కేటాయించగా తెలంగాణ తమ 89 టిఎంసిలు వాడుకొని, తిరిగి ఏపికి కేటాయించిన 20 టిఎంసిల్లో వాటా కావాలని అంటుందని ఏపి తెలిపింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఏపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు కేటాయించగా వాటిలో సరైన వాటా లేదని, వాటిని తేల్చాలని తెలంగాణ వాదనలు వినిపించింది. కృష్ణా నదీ కింద ఉండే రాజోలిబండ, పోతిరెడ్డిపాడు, శ్రీశైలం, నాగార్జున మిగతా 9లో

మార్చి 6న దేశవ్యాప్త ఆందోళన

- ఎంవి యాక్ట్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి
- పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి
- రవాణా కార్మికులకు రూ.24వేల కనీస వేతనం ఇవ్వాలి
- రోడ్డు రవాణా కార్మిక సంఘాల జాతీయ సదస్సు నిర్ణయం



సదస్సుకు హాజరైన వివిధ కార్మికుల సంఘాల నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ సర్కార్ పార్లమెంట్ ప్రవేశపెట్టబోయే మోటార్ వెహికల్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని మార్చి 6న దేశవ్యాప్త ఆందోళనకు మోటార్ రవాణా కార్మికుల జాతీయ సదస్సు తీర్మానించింది. గురువారం నాడిక్కడ కాన్సుట్యూషన్ క్లబ్‌లోని మవలంకర్ హాల్‌లో మోటార్ వెహికల్ చట్ట సవరణ బిల్లుపై జాతీయ కన్వెన్షన్ జరిగింది. ఈ కన్వెన్షన్ డిక్లరేషన్‌ను, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ఏకగ్రీవంగా ఆమోదించింది. రోడ్డు రవాణా కార్మికులు జాతీయ సమ్మెకు సిద్ధంగా ఉండాలని కన్వెన్షన్ కోరింది. దేశవ్యాప్తంగా మార్చి 6న ఆందోళనలు చేపట్టాలని, అన్ని రాష్ట్రాల గవర్నర్లకు వినతి పత్రాలు సమర్పించాలని సదస్సు నిర్ణయించింది. మార్చి 20 లోపు అన్ని రాష్ట్రాల్లో కన్వెన్షన్లు నిర్వహించాలని, కరపత్రాలు పంపిణీ, జాతాలతో విస్తృత ప్రచారం చేయాలని జాతీయ కన్వెన్షన్ నిర్ణయించింది. ఈ సదస్సులో సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, ఎల్‌పిఎఫ్, ఎఐసిసిటియు, యుటియుసి, టియుసిసి, ఎఐయుటియుసి సంఘాల అనుబంధ రోడ్డు రవాణా కార్మిక సంఘాలు, ఇతర స్వతంత్ర రోడ్డు రవాణా అనుబంధ రాష్ట్ర స్థాయి సంఘాలు, ప్రైవేటు బస్సు, మినీ బస్సు, ఆటో, టాక్సీ, లైట్ మిగతా 9లో

ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిన యుపిఎ



ప్రధాని మోడీ ఆరోపణలు

8

షెడ్యూల్ ప్రకారమే టెట్

మంత్రి గంటా శ్రీనివాసరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టెట్ పరీక్ష తొలుత ప్రకటించిన షెడ్యూలు ప్రకారమే ఈ నెల 21 నుంచి మార్చి 3 వరకు కొనసాగుతుందని మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులో అభ్యంతరాలున్న అభ్యర్థులు మరోమారు ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశం కల్పించామని, శుక్రవారం సాయంత్రం వరకూ ఈ అవకాశం ఉంటుందన్నారు. రెండోసారి ఆప్షన్‌లు ఇచ్చిన అభ్యర్థులకు మార్చి 2న మిగతా 9లో

స్వరాగాల ఝురి.. వీణా కచేరి

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

శ్రీసుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నెలవారి కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో గురువారం 'కచ్ఛపీ అఖండ మహోత్సవం' జరిగింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్విరామంగా 12 గంటల పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 50 మంది వైణిక విద్వాంసులు చేసిన వీణావాయిద్య విన్యాస కచేరి సంగీత సాగరంలో ఓలలాడించింది. కార్యక్రమానికి సీనియర్ ఐఎఎస్ అధికారి పూనం మాలకొండయ్య హాజరై సంగీతాన్ని ఆస్వాదించారు.



కచేరి

విజయవాడలో గురువారం ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో వీణా వాయిద్య కచేరి చేస్తున్న సంగీత విద్వాంసులు

ప్రపంచానికి తెలిసేలా భాగస్వామ్య సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా సత్వరం అనుమతులు ఇస్తున్న విధానాన్ని, మౌలిక వసతులు కల్పిస్తున్న తీరును ప్రపంచానికి తెలిసేలా విశాఖ భాగస్వామ్య సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారులకు సూచించారు. కియా కార్లు నుంచి ఫాక్స్‌కాన్ సెల్‌ఫోన్లు వరకు రాష్ట్రంలో తయారవుతున్న వివిధ ఉత్పత్తుల్ని ఈసారి సదస్సులో ప్రదర్శించాలన్నారు. ఈ నెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే సిఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై గురువారం సచివాలయంలోని సిఎం సమీక్షించారు. ఆటోమైబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల నమూనా ప్రదర్శన ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. స్మార్ట్ పవర్ గ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, డిజరప్టివ్ టెక్నాలజీ, సోలార్ స్టోరేజ్ రంగాలకు చెందిన వారిని సదస్సులో భాగస్వాముల్ని చేయాలన్నారు. మన వంటలు, ఆహార పదార్థాలు, అరకు కాఫీని ప్రమోట్ చేసుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. సదస్సుకు విచ్చేసే అతిథులకు నేచురల్ ఫార్మింగ్ ఫుడ్ అందించడం ద్వారా రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలన్నారు. 'పెట్టుబడి లేని సహజ వ్యవసాయం' గురించే దావోస్‌లో అంతా మాట్లాడారని, విశాఖ భాగస్వామ్య సదస్సు గురించి అలానే చెప్పుకోవాలన్నారు. మన కూచిపూడి నృత్యంతో ఆకట్టుకోవాలన్నారు. ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు చేతులమీదుగా సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం కానుందని, మొత్తం జరిగే తొమ్మిది ప్లీనరీ సెషన్లకు కేంద్రమంత్రులు, అధికారులు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్, కెనడా, జపాన్, జోర్డాన్, మయన్మార్, మారిషస్, మొరాకో, సింగపూర్, శ్రీలంక, టాంజానియా, థాయిల్యాండ్, యూఏఈ, జాంబియా దేశాలకు చెందిన మంత్రులు పాల్గొంటారని, 36 దేశాలకు చెందిన పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులు సదస్సుకు హాజరవుతారని తెలిపారు.



పాక్షిక మేఘావృతం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

కోస్తా, రాయలసీమల్లో నాలుగు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. పగటి పూట వేడి, ఉక్కపోత క్రమంగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో చలి ప్రభావం చూపిస్తుందన్నారు. గురువారం మధ్యాహ్నం కోస్తాలో ఆకాశం పాక్షిక మేఘావృతం కావడంతో వాతావరణం చల్లగా మారిపోయింది. అరేబియా, బంగాళాఖాతంలోని అల్పపీడన ద్రోణులు తొలగిపోవడంతో ఆకాశం నిర్మలంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రజ్ఞ

1. భారత్-రష్యా వ్యవసాయ రంగంలో 70 ఏళ్ల అనుబంధం ఉత్సవాలను ఎక్కడ నిర్వహించారు?
2. థియేటర్ ఒలింపిక్స్ 2018కు ఏ నగరం ఆతిథ్యం ఇస్తుంది?
3. సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షులు?
4. ఇటీవల మరణించిన ముజఫర్ హుస్సేన్ ఏ రంగానికి చెందినవారు?
5. భారత్‌లో తొలి ఆన్‌లైన్ రేడియో స్టేషన్?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అంచెలంచెల ఉద్యమం

టిడిపి సమన్వయ కమిటీలో చంద్రబాబు
పార్టీ శ్రేణులకు సూచన
బిజెపి నేతలు చెబుతున్నవన్నీ పేపర్‌మీద ఉన్నవే
పవన్ మంచిపనే చేస్తున్నాడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, ప్యాకేజీ ఒకటేనని కేంద్రం చెప్పాకే ముందుకెళ్లామని, ప్యాకేజీని అమలు చేయకపోతే అంచెలంచెలుగా ఉద్యమాన్ని చేయడం తప్ప మరోమార్గం లేదని, ఈ విషయాన్ని పార్టీ శ్రేణులకూ చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. గురువారం జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 2016 సెప్టెంబర్ 8న కేంద్రమంతి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటన ఆధారంగా తాము ప్యాకేజీకి అంగీకరించామన్నారు. ప్యాకేజీకి, హోదాకు తేడా ఏమిటో చెప్పాలన్నారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి తదితర అంశాల్లో పూర్తి మద్దతు ఇచ్చామని, ఎప్పుడూ కేంద్రాన్ని ఇబ్బంది పెట్టలేదని అన్నారు. నరేగా నిధుల వినియోగాన్ని బట్టి కేంద్రం విడుదల చేస్తుందన్నారు. మూడున్నరేళ్లుగా నిధుల కోసం కేంద్రం చుట్టూ తిరుగుతూనే ఉన్నామని, మాట్లాడ లేదనడం సరికాదని పేర్కొన్నారు. పార్లమెంటు తొలి సమావేశంలోనే ముంపు మండలాల్ని ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతూ ఆర్డినెన్స్ తీసుకొచ్చామన్నారు. పోలవరం నిధులనూ తెప్పించుకున్నామన్నారు. తెలుగుదేశం పార్టీకి పదవులు ముఖ్యం కాదన్నారు. ఇప్పటికే ఎంపిలు ఆందోళనలు చేశారన్నారు. కేంద్రానికి భయపడుతున్నానని ప్రచారం చేస్తున్నారని, దేనికీ తాను భయపడనని, తనపై కేసులేమీ లేవని చంద్రబాబు అన్నారు. జగన్మోహన్‌రెడ్డిపై కేసులు స్పీడవుతున్నాయని, అందువల్లే రాజీనామా అంశాన్ని ముందుకు తెచ్చి నానా ఆందోళన పడుతున్నాడని అన్నారు. కేంద్ర బడ్జెట్ బాగుందని చెప్పిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు మాట్లాడుతుందని చెప్పారు. బాగోలేదన్న మంత్రులపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ పంపిన



నివేదిక వల్ల రాష్ట్రానికి రావాల్సిన 16 లక్షల ఇళ్లు రాలేదన్నారు. రాజకీయం అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజలు కోరింది చేయాలని సూచించారు. పారదర్శక పాలన అందిస్తున్నామని, రాష్ట్రం మొత్తం ఏకరీతిలో సంక్షేమ పథకాల్ని అమలు చేసినా కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలహీనంగా ఉందన్నారు. అక్కడ నాయకత్వ లోపమే కారణ మన్నారు. అజాగ్రత్తగా, ఉదాసీనంగా ఉండటం మంచిది కాదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండగా బాగా పనిచేసిన నాయకులు అధికారంలోకి రాగానే మొండిబారిపోయారన్నారు. కొంతమంది పైపైన పనిచేస్తున్నారని, మరికొంతమంది అసలు నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. కాపు రిజర్వేషన్ విషయంలో అన్ని సాంకేతిక అంశాల్ని పరిగణనలోకి తీసుకున్నామన్నారు. అయినా కేంద్రం నుండి అభ్యంతరం రావడం దురదృష్టకరమన్నారు. వీటన్నిటినీ ప్రజలకు వివరించాలని చెప్పారు. దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమాన్ని మొక్కుబడిగా జరపొద్దన్నారు. ఏప్రిల్ 14, 20 తేదీల్లో జరిగే అంబేద్కర్ ఆశయం, చంద్రన్న ఆచరణ కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. మైనార్టీలు, గిరిజనుల సదస్సులు కూడా నిర్వహించాలని సూచించారు. పవన్ కళ్యాణ్ జాయింట్ ఫైండింగ్ కమిటీపై మాట్లాడుతూ ఆయన ఒక పద్ధతిలో వెళుతున్నాడని, రాష్ట్రానికి మేలు జరగాలన్నదే అతని ఉద్దేశమని చెప్పారు. రాష్ట్రానికి సంబంధించి అన్ని అంశాలూ వెబ్‌సైట్లో ఉన్నాయని, ప్రత్యేకంగా శ్వేతపత్రం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇస్తే బిజెపి నేతలు ఇవ్వాలని పేర్కొన్నారు. బిజెపి నేతలు విడుదల చేసిన 27 పేజీల పుస్తకంలో అంకెలన్నీ పేపర్‌పై ప్రకటనలే తప్ప నిధులు కావని అన్నారు. మంజూరు వేరు. కేటాయింపులు వేరు, విడుదల వేరు అనే అంశాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలన్నారు. ఎడిఆర్ రిపోర్టుపై వ్యాఖ్యానిస్తూ తాను వ్యాపారం చేయడం లేదని, కుటుంబం చేస్తోందని, నివేదిక తప్పు అని అన్నారు. తనకు ఒక్క షేర్ కూడా లేదని వివరించారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు, మంత్రులు నారాయణ, లోకేష్, అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు జయనాగేశ్వరరెడ్డి, వర్ల రామయ్య, టిడి జనార్ధన్, చినరాజప్ప, కె.ఈ.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ అకాడమీలో ఐఐటి రామయ్య మోడల్ ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైదరాబాద్ శ్రీశ్రీ అకాడమీ ఆధ్వర్యంలో ఐఐటి రామయ్య మోడల్ ప్రశ్నాపత్రాల్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు శ్రీశ్రీ అకాడమీ డైరెక్టర్ సింహప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో ప్రవేశ పరీక్ష రాసే పదో తరగతి విద్యార్థులకు, ఐఐటి-జెఇఇ పరీక్ష రాసే విద్యార్థులకు ఈ ప్రశ్నాపత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇంగ్లీషు మీడియంలో లభించే ఈ పేపర్లను విద్యార్థులు లేదా తల్లిదండ్రులు ఉచితంగా పొందచ్చని తెలిపారు. స్వయంగా వచ్చిగానీ, రూ.6 స్టాంపులంటించిన స్వీయ చిరునామా ఉన్న కవరును శ్రీశ్రీ అకాడమీ, రోడ్ నెం.3, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, హైదరాబాద్-500085 చిరునామాకు పంపి పొందవచ్చని పేర్కొన్నారు. www.srisriacademy.com నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 9985072333, 040-23156744 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్రంలో ఫస్ట్ అమెరికా కార్యకలాపాలు

మంత్రి లోకేశ్‌తో కంపెనీ ప్రతినిధుల భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫస్ట్ అమెరికా (ఇండియా) కంపెనీ రాష్ట్రంలో తన కార్యకలాపాల్ని ప్రారంభించనుంది. సచివాలయంలో గురువారం కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రఘు, సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు ఐటి శాఖ మంత్రి లోకేశ్‌ని కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్ వారికి ల్యాండ్ రికార్డుల్ని డిజిటైజ్ చేస్తున్నామని తెలిపారు. టేంపరింగ్ చేసే అవకాశం లేకుండా ల్యాండ్ రికార్డుల్ని బ్లాక్‌చైన్ టెక్నాలజీ వేదికపైకి తీసుకొస్తున్నామన్నారు. దీని వల్ల రైతులకు తక్కువ సమయంలో టైటిల్ ఇన్సూరెన్స్, రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఫైబర్‌గ్రిడ్‌ను ఏర్పాటు చేసి రూ.149కే వైఫై, ఇంటర్నెట్, టెలివిజన్ అందిస్తున్నామన్నారు. సర్టిఫికెట్ లెస్ గవర్నమెంట్ తీసుకొస్తున్నామన్నారు. ల్యాండ్ రికార్డులు డిజిటైజేషన్ చేయడం ద్వారా 20 శాతం



వృద్ధి సాధించే అవకాశాలున్నాయన్నారు. ఫైబర్‌గ్రిడ్ వినియోగించుకొని గ్రామాల్లో యువతీ యువకులకు వారి ఇంటి నుంచే పనిచేసుకునేలా మోడల్ అభివృద్ధి చేయాలని వారికి సూచించారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఫైబర్‌గ్రిడ్ ఉపయోగించుకుని వర్క్ ఫ్రమ్ హోమ్ పైలెట్ ప్రాజెక్టు కొన్ని గ్రామాల్లో చేపడతామన్నారు. దీని వల్ల గ్రామాల్లో మహిళలు, యువత ఇంటి నుంచే పనిచేసుకుని ఆదాయం పొందవచ్చన్నారు. త్వరలోనే విజయవాడలో కంపెనీ ఏర్పాటు చేసి కార్యకలాపాల్ని విస్తరిస్తామన్నారు. ఇంటి నుంచి పనిచేస్తూ ల్యాండ్ రికార్డ్ డిజిటైజ్ చేసే కార్యక్రమం విజయవంతమైతే ఇతర రాష్ట్రాల, దేశాల ల్యాండ్ రికార్డ్స్ ఏపీ నుంచే చేసే అవకాశం వస్తుందన్నారు. దీని వల్ల యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.

అమరావతిలో జూ ఏర్పాటుకు డిపిఆర్ సిద్ధం చేయండి : మంత్రి సిద్ధా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో ప్రపంచస్థాయి జంతు ప్రదర్శనశాల(జూ)ను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని ఎంపిక చేసి, డిపిఆర్ సిద్ధం చేయాలని పర్యావరణ, అటవీ శాఖా మంత్రి సిద్ధా రాఘవరావు పిసిసిఎఫ్ మల్లిఖార్జునరావును ఆదేశించారు. అటవీశాఖపై గురువారం సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. పదో విడత ఎర్రచందనం అమ్మకాలకు ఏప్రిల్‌లో టెండర్లు పిలుస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. త్వరలో జూ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ నెలాఖరులో నెల్లూరులో అటవీశాఖ రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. అటవీశాఖ అతిథి గృహాల ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. అటవీ విస్తీర్ణంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడంపై పిసిసిఎఫ్‌ను మంత్రి అభినందించారు. తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల్లో అటవీ విస్తీర్ణానికి కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని గోడౌన్లలో ఎర్రచందనం నిల్వల్ని తిరుపతి గోడౌన్‌కు తరలించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'మా ఇంటి మాలక్ష్మి'కి బడ్జెట్ ఇవ్వండి

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆడపిల్లలున్న కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ప్రవేశపెట్టిన 'మా ఇంటి మాలక్ష్మి' పథకానికి ఈ ఏడాది బడ్జెట్ కేటాయించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. గురువారం సచివాలయంలో ఆర్థిక మంత్రి యనమల ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులపై సమావేశం జరిగింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీతతోపాటు ఆ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ శాఖలో వివిధ కార్యక్రమాలు, పథకాలకు బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. బాలింతలు, గర్భిణిలకు అదనపు పోషణ కార్యక్రమమైన 'అన్న అమృత హస్తం' కోసం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని ప్రతిపాదించారు. అలాగే ఒకే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది వికలాంగులున్నా ప్రస్తుతం ఒక్కరికే పెన్షన్ ఇస్తున్నారు. అయితే ఇక నుంచి కుటుంబంలో ఎంతమంది వికలాంగులుంటే అంతమందికి ప్రతి నెలా పెన్షన్ ఇచ్చేలా బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

జూనియర్ కళాశాలలుగా ఎస్సీ గురుకులాలు అప్‌గ్రేడ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా పెదపాడు, తూర్పు గోదావరి జిల్లా పి వెంకటాపురం, పి గన్నవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పెదపాడు, పి వెంకటాపురం గురుకులాల్లో ఎంపిసి, బైపిసి, పి గన్నవరం గురుకులంలో ఎంఇసి, సిఇసి గ్రూపులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి తేనున్నట్టు పేర్కొన్నారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డు ఎవరికోసం ?

ప్రయివేటు సంస్థల కోసమే మరోసారి భూ సమీకరణ
నాలుగేళ్లయినా ఖరారు కాని డిజైన్లు
సిపిఎం రాజధాని ప్రాంత కన్వీనర్ సిహెచ్. బాబూరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఆర్‌డిఎ పరిధిలో కొత్తగా 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ప్రభుత్వం భూ సమీకరణ చేయాలని నిర్ణయించిందని సిపిఎం రాజధాని ప్రాంత కన్వీనర్ సిహెచ్. బాబూరావు అన్నారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు వదిలేసి ఇప్పుడు కొత్తగా ఇన్నర్ రింగ్ రోడ్డును ఎవరికోసం ప్రతి పాదించారన్నారు. గురువారం విజయవాడ శ్రీశ్రీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లయినా రాజధాని అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాలకు, సచివాలయానికీ డిజైన్లు ఖరారు చేయలేదన్నారు. రాజధాని కోసం భూ సమీకరణ ద్వారా ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరిం చిందన్నారు. ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన భూమే తప్ప ప్రభుత్వ సంస్థల నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదని విమర్శించారు. ఇప్పటికే సమీకరించిన భూమి కాకుండా ఇన్నర్ రింగ్‌రోడ్డుకు 1253 ఎకరాలు సరిపోతుందని, అదనంగా 8 వేల



ఎకరాల్ని సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ వంకతో ప్రభుత్వమే అదనంగా భూమిని తీసుకుని వారికే అమ్మేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో భూ సమీకరణ విఫలమయ్యిందన్నారు. రాజధాని డిజైన్లే ఇంకా ఖరారు కాలేదన్నారు. విజయవాడ బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ విస్తరణ, దుర్గగుడి ఫ్లైఓవర్, కొత్తగా కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తామని ప్రకటించారే తప్ప అవి ఎప్పటికి పూర్తవుతా యో తెలియడంలేదన్నారు. ప్రభుత్వం దగ్గర నిధులు లేనప్పటికీ రైతుల నుంచి భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి ద్రోహం చేసిందన్నారు. రాజధాని కోసం రూ.58 వేల కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా, కేంద్రం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ఈ బడ్జెట్‌లో మెట్రో రైలుకు అసలు కేటాయింపులు లేవన్నారు. రాజధాని నిర్మాణంపై ఇప్పటికైనా ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శాస్త్రీయ పద్ధతిలోనే కాపులకు రిజర్వేషన్

మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పూర్తి శాస్త్రీయంగానే కాపులను బీసీల్లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిందని బిసి సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బిసి కమిషన్ ఏర్పాటు చేశామని, వారిచ్చిన నివేదిక ప్రకారం చట్టాన్ని రూపొందించామన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కాపులు బిసిలుగా ఉండటం కూడా ఒక అంశమేనన్నారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రక్రియలో శాస్త్రీయత లేదనే వాదనల్ని తప్పుబట్టారు. కాపులను తప్పుదోవ పట్టించేందుకు కొందరు రాజకీయ నిరుద్యోగులు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాపులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రంతో చర్చించి 9వ షెడ్యూల్లో చేర్చి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తామన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడితో చర్చించడం తనకు బాధ కలిగించిందన్నారు. రాష్ట్రం ఈ పరిస్థితిలో ఉండటానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని, అటువంటి పార్టీ నాయకులను ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరడం సరైంది కాదన్నారు. హోదా ఇవ్వలేమని కేంద్రం చెప్పిందని, హోదాకు సమానంగా నిధులు కేటాయిస్తామని చెప్పడంతోనే ప్యాకేజీకి అంగీకరించామన్నారు.

ప్రత్యేకం

వైజాగ్ పోర్టు నుంచి నేపాల్‌కు నిలిచిన కార్గో!

500 కంటైనర్ల నిలుపుదలపై నేపాల్ పత్రిక కథనం
నేడు కొల్‌కత్తా నుంచి నేపాల్ కాన్సులేట్ జనరల్ రాక

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

గతేడాది నేపాల్‌తో కార్గో వ్యాపారం కోసం వైజాగ్ పోర్టు ప్రారంభించిన కసరత్తు ఏడాదిలోపే తుస్సుమందా? నేపాల్‌తో కార్గో హేండ్లింగ్‌ను అభివృద్ధి చేస్తున్నామంటూ వైజాగ్ పోర్టు అధికారులు చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన లేకుండా పోయిందా? కార్గో హేండ్లింగ్‌లో వైజాగ్ పోర్టు సత్తా చతికిలపడిందా? అంటే నేపాల్ దేశానికి చెందిన హిమాలయ న్యూస్ సర్వీస్ పత్రిక తాజాగా వెలువరించిన కథనం అవుననే చెబుతోంది. నేపాల్ రాజధాని ఖాట్మండ్ నుంచి గురువారం వెలువరించిన కథనం 'వైజాగ్ నుంచి 500 కంటైనర్లు డిసెంబరు నుంచి నిలిచాయంటూ వచ్చిన అంశంపై పోర్టు అధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదు. ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషనల్‌లో వైజాగ్ పోర్టు అధికారులు సరైన రీతిలో ప్రయత్నాలు చేయనందున గతేడాది డిసెంబరు నుంచి 2018 ఫిబ్రవరి వరకూ సుమారు 500 కంటైనర్లు రవాణా రావాల్సింది ఆగిపోయిందంటూ ఈ కథనం వెల్లడిచేసింది. ఈ విషయాన్ని నేపాల్ ఫారెన్ ట్రేడ్ అసోసియేషన్ (ఎన్ఎఫ్‌టిఎ) అధికార ప్రతినిధి మదన్ మిట్టల్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని నేపాల్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ నేపాల్) రాయబార కార్యాలయం నుంచి ఈ సమాచారం లీక్ అయినట్లు తెలుస్తోంది. వైజాగ్ పోర్టు అధికారులకు డాక్యుమెంట్లను ఈ కార్యాలయ అధికారులు సకాలంలో సమర్పించలేదా? ట్రేడర్లకు పోర్టు అధికారుల నుంచి సమన్వయం లేదా? అన్న ప్రశ్నలతో కథనం వెలువడడం విశేషం. నేపాల్-ఇండియా వ్యాపార ఒప్పందం ప్రకారం నేపాల్ ఉన్నతాధికార రాయబార కార్యాలయ బృందాలు ఇండియాలోగల నేపాలీ మిషన్ ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాల్సి ఉంది. కోల్‌కతా మాదిరిగా



విశాఖ పోర్టు

వైజాగ్‌లో కాన్సుల్ జనరల్ స్థాయి అధికారి లేనందున కార్గో హేండ్లింగ్ నిలిచిపోయినట్లు భోగట్టా. విశాఖ పోర్టులో గతేడాదే నేపాల్ ఎగుమతుల కోసం నూతన బెర్త్‌ను ఒకటి ఏర్పాటు చేసుకుంది. వైజాగ్ పోర్టు నుంచి నేపాల్‌కు మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన సరకు రవాణా చేపట్టాలన్నది ఒప్పందం. కానీ కార్గో హేండ్లింగ్ నేపాల్‌కు ఆగిపోయినందున చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు తీవ్రస్థాయిలో దెబ్బ తగులుతుందని వైజాగ్‌లాంటి ఆధునిక సౌకర్యాలు కలిగిన పోర్టులో కాన్సుల్ జనరల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని నేపాల్ ఫ్రైయిట్ ఫార్వార్డర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాజన్ శర్మ ఈ సందర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు. ట్రేడ్ ఫెసిలిటేషన్ పురోగమనానికి డాక్యుమెంట్ల సమర్ప ణకు సరైన ఏజెన్సీ లేనందున ఈ పరిస్థితులు తలెత్తాయన్నది స్పష్టమవుతోంది.

ఈ సంక్షోభ పరిస్థితులపై సమీక్షించేందుకు శుక్రవారం విశాఖ పోర్టును సందర్శించేందుకు కోల్‌కతా నుంచి నేపాల్ కాన్సులేట్ జనరల్ రానున్నారు. ఇప్పటికే జరిగిన నష్టాన్ని ఎలా భర్తీచేస్తారన్నది చూడాల్సిందే. ఈ విషయంపై పోర్టు అధికారిని ప్రజాశక్తి వివరణ కోరగా... నేపాల్‌కు కార్గో ఆగలేదని, నేపాల్ కాన్సులేట్ పర్యటన మాత్రం ఉందని వెల్లడించారు.

సంక్షిప్తం

జిజిహెచ్ ఘటనపై విచారణ : మంత్రి కామినేని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో సెల్ ఫోన్ వెలుగులో ఆపరేషన్ చేసిన ఘటనపై డిఎమ్ఇని వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ విచారణకు ఆదేశించారు. ఘటనపై సమగ్రంగా విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు గురువారం ప్రకటనలో ఆయన తెలిపారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు లేకపోవడంతో సెల్‌ఫోన్ లైటు వెలుగులో పూర్తి చేయడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రిని మంత్రి కామినేని పరిశీలిస్తారు.

నేటి నుంచిహైదరాబాద్‌లో జెఎఫ్‌సి సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలులో జరుగుతున్న జాప్యం, వాస్తవాల్ని ప్రజలకు వివరించడానికి ఏర్పడిన 'జాయింట్ ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీ' (జెఎఫ్‌సి) తొలి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమవుతోంది. దసపల్లా హోటల్‌లో రెండు రోజుల పాటు ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశానికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, సిపిఎం కార్యదర్శి పి మధు, సిపిఐ కార్యదర్శి కె రామకృష్ణ, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, లోకసత్తా నేత జయప్రకాశ్ నారాయణ్, మాజీ ఎంపిలు ఉండవల్లి అరుణ్‌కుమార్, కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, పిసిసి కార్యదర్శి జంగా గౌతమ్, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు పాల్గొంటారు.

ఆర్టీసి పేరుతో బోగస్ నియామకాలు : ఇడి

ఎపిఎస్ ఆర్టీసి నియామకాలు చేపడుతున్నట్లు గుర్తు తెలియని వ్యక్తులు బోగస్ నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని ఆర్టీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఎ వెంకటేశ్వరరావు గురువారం మీడియాకు తెలిపారు. ఈ బోగస్ నియామ కాలు నిజమైనవి కాదని చెప్పారు.

చిత్తూరులో అరవింద్ టెక్స్‌టైల్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లాల్లో 150 ఎకరాల్లో రూ.400 కోట్ల పెట్టుబడులతో అరవింద్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంటింగ్ యూనిట్‌ను నెలకొల్పనున్నారు. ఈ మేరకు సచివాలయంలో గురువారం నిర్వహించిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపిబి) సమావేశంలో నిర్ణయించారు. ఈ పరిశ్రమ ద్వారా ఏటా రూ.1000 కోట్ల మేర ఎగుమతి చేయగలమని అంచనా వేస్తున్నారు. గార్మెంట్ పరిశ్రమలో 8 వేల మందికి, టెక్స్‌టైల్స్‌లో 7 వేల మందకి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. అనంతపురం జిల్లా పాలసముద్రంలో రెండు ఎకరాల్లో రూ.20 కోట్లతో సాయి దివ్య అపెరల్స్ అండ్ ఫ్యాషన్స్ పరిశ్రమను ఏర్పాటు చేసి ఈ ఏడాది మార్చి నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించనున్నారు. రెండు వేల మందికి ప్రత్యక్షంగా, 600 మందికి పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో నాచు కార్పొరేషన్ స్టీల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ డిఐ పైప్ తయారీ పరిశ్రమను నెలకొల్పాలని నిర్ణయించారు. రూ.1033.22 కోట్ల పెట్టుబడులతో 161.16 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. 800 మందికి ప్రత్యక్షంగా, 1200 మందికి పరోక్షంగా ఉపాధి కల్పించగలమని అంచనా వేశారు. 30 మాసాల్లోపు వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాలని నిర్ణయించారు.

టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.కోటి విరాళం

ప్రజాశక్తి తిరుమల:
తమిళనాడు మధురైకు చెందిన టివిఎస్ శ్రీచక్రా టైర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శోభనారామచంద్రా టిటిడి బర్డ్ ట్రస్టుకు కోటి రూపాయలను విరాళంగా అందించారు. గురువారం ఉదయం తిరుమల జేఈవోకు సంబంధించిన డిడిని అందజేశారు. ఈ సందర్భంగా దాతకు టిటిడి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన జేఈవో దాతలకు అందాల్సిన దర్శనం, బస ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను జేఈవో ఆదేశించారు.



తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని వెలుగుబందలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురజాడ సమగ్ర సాహిత్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

మహా కవి-మహా పురుషుడు గురజాడ

అంతర్జాతీయ సదస్సులో విసి ముత్యాలు నాయుడు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం
'మహాకవి-మహాపురుషుడు' గురజాడ అని శెట్టి ఈశ్వరరావు చెప్పిన మాటలు అక్షర సత్యాలని, తెలుగు సాహిత్యంలో గురజాడ చెరగని ముద్రవేశారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని వెలుగుబందలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, గురజాడ ఫౌండేషన్-అమెరికా వారి సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును విసి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిధులుగా విసి ముర్రు ముత్యాలునాయుడు, అరుణ గురజాడ (ఫౌండేషన్ వ్యవస్థాపకులు), జి.అరుణ కుమారి (కేంద్రియ విశ్వవిద్యాలయం), డాక్టర్ ఎల్.వి.కె.రెడ్డి (డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం) హాజరయ్యారు. 'గురజాడ సమగ్ర సాహిత్యం-సంఘ సంస్కరణ కృషి' అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో 800 పేజీలు గల గురజాడ సమగ్ర సాహిత్య సంకలనం 'ప్రకాశిక' అనే పేరుతో ముద్రించిన రెండు పుస్తకాలను విసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ.. 19వ శతాబ్దంలో తెలుగు సాహిత్య ఔన్నత్యం వెలుగులోకి వచ్చిందన్నారు. సాహిత్యానికి ఎల్లలు లేవనే నిరుపించిన వ్యక్తి గురజాడ అని దానికి నిదర్శణం గురజాడ దేశభక్తి గేయమని చెప్పారు. అరుణ గురజాడ మాట్లాడుతూ.. విద్యార్థులంతా దేశభక్తి గేయాన్ని ఆలపించాలన్నది తన తాతయ్య ఆశ అని, దాని ప్రకారమే ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. సభలో జి.అరుణకుమారి, డాక్టర్ ఎల్.వి.కె.రెడ్డి మాట్లాడుతూ గురజాడ సాహిత్య గేయాలను ఎరుగని తెలుగు వారు ఉండరని, అంతటి గొప్ప సాహిత్య మూర్తి గురజాడ అని ప్రశంసించారు.

'గుట్టు' చప్పుడు కాకుండా మూత!

- రైల్వే కన్‌స్ట్రక్షన్ అకౌంట్స్ కార్యాలయం తరలింపు
- ఇకపై సికింద్రాబాద్‌లోనే కాంట్రాక్టర్లకు బిల్లులు
- వ్యతిరేకిస్తున్న ఉద్యోగ కార్మిక సంఘాలు


తిరుపతి రైల్వేస్టేషన్‌లో మూతబడిన రైల్వే కన్‌స్ట్రక్షన్ అకౌంట్స్ కార్యాలయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్
తిరుపతిలో ఉన్న రైల్వే కన్‌స్ట్రక్షన్ అకౌంట్స్ కార్యాలయానికి తాళాలేసేశారు. గుట్టుచప్పుడు కాకుండా తెలంగాణా రాష్ట్రంలోని సికింద్రాబాద్‌లో ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యాలయాన్ని అక్రమంగా తరలించే ప్రక్రియను రైల్వే ఉద్యోగులు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇకపై ఎటువంటి బిల్లులకైనా రైల్వే కాంట్రాక్టర్లు సికింద్రాబాద్ చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిందే.

తిరుపతి - పాకాల - కాట్పాడి బ్రాడ్‌గేజ్ కన్వర్షన్ పనుల కోసం 1999లో తిరుపతి రైల్వే రిజర్వేషన్ కార్యాలయం వద్ద అకౌంట్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 300 కిలోమీటర్ల వరకు కొత్త రైల్వే ట్రాక్‌ను వేశారు. అప్పట్లో ఇక్కడి నుండే కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లించేవారు. చిత్తూరు జిల్లాతోపాటు కడప జిల్లాకు చెందిన రైల్వే కాంట్రాక్టర్లు కూడా ఇక్కడకు వచ్చేవారు. దీనికి సీనియర్ సెక్షన్ అకౌంట్స్ (ఎఎస్ఒ) అధికారులు ఇద్దరు, అసిస్టెంట్ అధికారులు (ఎఎఒ) మరో ఇద్దరు ఉండేవారు. వీరితోపాటు ఆఫీసుకు అటెండర్‌ను నియమించారు. సీనియర్ అసిస్టెంట్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ అజమాయిషీ చేసేవారు. రైల్వే కనస్ట్రక్షన్ కింద ప్రతి పనికీ సంబంధించిన నిధులను, బిల్లులను మంజూరు చేసే అధికారం ఈ అధికారికి ఉండేది. 2016లో ఆ అధికారి ఉద్యోగ విరమణ చేశారు. తరువాత రేణిగుంట సిఆర్ఎస్‌లో పనిచేస్తున్న వర్క్‌షాపు అకౌంట్స్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌ను ఈ కార్యాలయానికి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన ఈ ఏడాది జనవరి 31కి ఉద్యోగ విరమణ చేశారు. దీంతో రేణిగుంట సిఆర్ఎస్‌కు, తిరుపతిలోని కనస్ట్రక్షన్ అకౌంట్స్ కార్యాలయానికి బిల్లులు మంజూరు చేసే అధికారి లేకపోవడంతో అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు.

సిఆర్ఎస్‌కు రెగ్యులర్ అధికారిని నియమించకుండా విజయవాడ రాయనపాడు వర్క్‌షాపు నుంచి సీనియర్ అకౌంట్స్ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. తిరుపతి కనస్ట్రక్షన్ అకౌంట్స్ కార్యాలయంలో రోజురోజుకూ బిల్లులు పేరుకుపోతుండడంతో అకౌంట్ అధికారిని నియమించాలని తిరుపతి రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు సికింద్రాబాద్‌లోని ఎఫ్ఎ అండ్ సిఎఒ కార్యాలయానికి పలుమార్లు వినతులు ఇచ్చారు. అధికారిని త్వరలోనే నియమిస్తామని చెబుతూనే, తిరుపతిలో పనిచేస్తున్న సిబ్బంది ఐదుగురిని క్రమక్రమంగా బదిలీ చేసి కార్యాలయాన్ని మూసేశారు. ఇటీవల సికింద్రాబాద్ నుంచి వచ్చిన ఓ అధికారి తిరుపతి కార్యాలయాన్ని మూసేస్తున్నామని ఉన్న గణాంకాలను పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ సమాచారం విన్నప్పటి నుంచి ఉద్యోగుల్లోనూ, కాంట్రాక్టర్లలోనూ ఆందోళన మొదలయ్యింది. ఇకపై ప్రతి పనికీ సికింద్రాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందని, ఈ ప్రాంతంలో ఉన్న కార్యాలయాన్ని తెలంగాణాకు ఎలా తరలిస్తారని ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

బిల్లులు కావాలంటే సికింద్రాబాద్‌కు వెళాల్సిందే

చిత్తూరు జిల్లా రైల్వేపరంగా చాలావరకు అభివృద్ధి చెందాల్సి ఉంది. దశాబ్దాలుగా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. 2018-19 రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు కేవలం చాలా తక్కువ నిధులను కేటాయించారు. కడప-మదనపల్లి-బెంగుళూరు మధ్య 255.4 కిలోమీటర్లు కొత్త రైలు మార్గానికి రూ 175 కోట్లు కేటాయించారు. శ్రీకాళహస్తి - నడికుడి కొత్త రైల్వే మార్గంలో 309 కిలోమీటర్లు వేసేందుకు రూ.420 కోట్లు, నంద్యాల- ఎర్రగుంట్ల కొత్తలైనుకు 124కిలోమీటర్లు వేసేందుకు రూ 20కోట్లు మంజూరయ్యింది. అలాగే చిన్నిచిన్న పనులు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తిరుపతి రైల్వే కన్‌స్ట్రక్షన్ కార్యాలయం పరిధిలో జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే బిల్లుల కోసం కాంట్రాక్టర్లు సికింద్రాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దీనివల్ల వారికి ఎంతో నష్టం జరుగుతుంది.

తిరుపతిలోనే ఉండాలి

తిరుపతిలోని రైల్వే కనస్ట్రక్షన్ అకౌంట్స్ కార్యాలయాన్ని తెలంగాణకు తరలిస్తే చూస్తూ ఊరుకోబోమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రైల్లే కార్మిక సంఘాల నేతలు అంటున్నారు. తిరుపతికి కేటాయించిన ఈ కార్యాలయాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ వదులుకునేందుకు సిద్ధంగా లేమని, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

- కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

'పాడె' కడుతున్నారు


ఎపి డెయిరీ అనంతపురం

నష్టాల బాటలో ఎపిడిడిసిఎఫ్ఎల్

బలవంతంగా ప్రయివేటు డెయిరీల వైపు మళ్లింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఎపిడిడిసిఎఫ్ఎల్)కు పాడె కట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ సంస్థ రోజురోజుకూ నష్టాల ఊబిలో కూరుకుపోతోంది. ప్రభుత్వం పాల సేకరణను పూర్తిగా తగ్గించి వేసింది. ధర కూడా ప్రయివేటు డెయిరీల కంటే తక్కువగా ఇస్తుండటంతో పాడి రైతులు అటువైపుగా బలవంతంగా వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం దీన్ని బతికించే చర్యలు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఎపిడిడిసిఎఫ్ఎల్ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాలు అనంతపురం, చిత్తూరు, కడప కలసి ఉండేవి. ఇక్కడ సేకరించిన పాలన్నీ ఎక్కువగా హైదరాబాద్‌లో మార్కెటింగ్ జరిగేవి. రాష్ట్ర విభజనతోపాటు ఈ కో-ఆపరేటివ్ డెయిరీ కూడా విడిపోయింది. దీంతో ఉమ్మడి ఆస్తుల పంపకాలు జరగక అప్పటివరకు సాగిన లావాదేవీల్లో రూ.20 కోట్ల వరకు సీజ్ చేశారు. ఈ జిల్లాల నుంచి పాలను తీసుకోవడం అక్కడి ప్రభుత్వం నిలిపి వేయడంతో రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలో నిలిచి పోయాయి. పాల ధరనూ తగ్గించి లీటరు రూ.21కు కుదించారు. బహిరంగ మార్కెట్‌లో ప్రయివేటు డెయిరీలు అవే పాలను లీటరుకు రూ.25కు సేకరిస్తున్నారు. దీంతో రైతులు ప్రయివేటు డెయిరీల వైపు మళ్లాల్సిన పరిస్థి తులు నెలకొన్నాయి.

85 వేల లీటర్ల నుంచి 12 వేల లీటర్లకు తగ్గుదల అనంతపురం జిల్లాలో ఒక్కటే 2008 వరకు 890 గ్రామాల నుంచి ఎపి డెయిరీ రోజుకు 85 వేల లీటర్ల పాలను సేకరించేది. రాయలసీమ మొత్తంగా 1.24 లక్షల లీటర్ల వరకు పాల సేకరణ జరిగేది. అనంతపురం జిల్లాలో ప్రస్తుతం రోజుకు 12 వేల లీటర్లు మాత్రమే సేకరణ చేయగలుగుతున్నారు.

మూడు నెలలైనా పాల డబ్బులివ్వలేదు..



పాలు రోజూ సేకరిస్తున్నప్పటికీ డిసెంబరు నెల బిల్లులు ఇప్పటివరకు రైతులకు చెల్లించలేదు. రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తామని చెబుతున్నారు. వాస్తవానికి ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలి. గతంలో చెల్లించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అదే ప్రయివేటు డెయిరీలు ఖచ్చితంగా 16వ రోజు రైతుల ఖాతాల్లోకి పాల డబ్బులు వేస్తున్నారు, అదీగాక ధర అక్కడ లీటరుకు రూ.25 వరకు ఉంటోంది. దీంతో అనివార్యంగా ప్రభుత్వ డెయిరీని కాదని ప్రయివేటు వైపు పోవాల్సి వస్తోంది.

- ఆదినారాయణ, పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు అనంతపురం

ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలి



సహకార రంగంలోని సంస్థల విభజన సమస్యలను తక్షణం పరిష్కరించాలి. సీజ్ చేసిన రూ.20 కోట్ల డబ్బులు ఎపి డెయిరీ ఫెడరేషన్‌కు ఇప్పించగలిగితే ఈ కష్టాలన్నీ తొలగిపోతాయి. లేదా ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వమైనా ఎపి డెయిరీకి నిధులు కేటాయించి ఆదుకోవాలి. ప్రభుత్వ రంగంలో బాగా నడుస్తున్న సంస్థను ఈ విధంగా దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సరైంది కాదు. ప్రభుత్వం తక్షణం దీనిపై స్పందించి సంస్థను నిలెబట్టే చర్యలు చేపట్టాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎపి రైతు సంఘం

అధికార లాంఛనాలతో

బుల్లిరామయ్య అంత్యక్రియలు

ప్రజాశక్తి - పి.గన్నవరం, మామిడికుదురు (తూర్పుగోదావరి)
కేంద్ర మాజీమంత్రి, టిడిపి సీనియర్ నేత బోళ్ల బుల్లిరామయ్య అంత్యక్రియలను అధికార లాంఛనాలతో తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి శ్మశానవాటికలో గురువారం నిర్వహించారు. తొలుత తణుకు నుంచి ఆయన పార్థివదేహాన్ని తీసుకొచ్చి డొక్కా సీతమ్మ అక్విడెక్ట్ నుంచి ఆయన స్వగ్రామమైన మామిడికుదురు మండలం పెదపట్నం వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అంతిమయాత్రను జరిపారు. అక్కడి నుంచి బంధువులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో మానేపల్లి శ్మశానవాటికకు తరలించారు. మంత్రులు కామినేని శ్రీనివాస్, కెఎస్ జవహర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం దహన సంస్కారాలను దగ్గరుండి జరిపించారు. బుల్లిరామయ్య కుమారుడు రమేష్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి వందనం చేశారు.


గాల్లోకి కాల్పులు జరిపి వందనం చేస్తున్న పోలీసులు

అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తగా, రాజకీయ నాయకుడిగా బుల్లిరామయ్య ఉభయగోదావరి జిల్లాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

అంతిమయాత్రలో పి.గన్నవరం ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి, రాష్ట్ర తెలుగు మహిళా సంఘం చైర్మన్ ఎన్.రాజకుమారి, తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు అయ్యాజీవేమా, పాముల రాజేశ్వరిదేవి, బండారు సత్యానందం, తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ, పశ్చిమగోదావరి జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, అమలాపురం డిఎస్‌పి ప్రసన్నకుమార్, ఆర్‌డిఒ బి.వెంకటరమణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లును వ్యతిరేకించండి

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు బి.ఎస్ రామయ్య



సదస్సులో మాట్లాడుతున్న బి.ఎస్ రామయ్య

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి
కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల నేడు బ్యాంకింగ్ రంగం, ప్రభుత్వ రంగ సంస్థలు ఆపదలో ఉన్నాయని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల జాతీయ నాయకులు బి.ఎస్ రామయ్య అన్నారు. గురువారం కర్నూలులో 'కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎఫ్ఆర్‌డిఐ బిల్లు, దాచుకున్న ప్రజల డబ్బుకు రక్షణ ఉందా..? లేదా..? అనే అంశంపై సదస్సు' జరిగింది. కర్నూలు సివిల్ ఫోరం కన్వీనర్ ప్రసాద్‌శర్మ అధ్యక్షతన జరిగిన సదస్సుకు బిఎస్.రామయ్య ముఖ్యోపన్యాసం చేశారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు అనుగుణంగా పాలించాలని అన్నారు. అలా పాలించని పక్షంలో వ్యతిరేక విధానాలు పుట్టుకువస్తాయన్నారు. అలా వచ్చిందే ఎఫ్ఆర్‌డిఐ (ఫైనాన్షియల్ రిసొల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) బిల్లు అని అన్నారు. ఈ బిల్లును అందరూ వ్యతిరేకించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బిల్లు అవసరం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అనేక ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేసిందని విమర్శించారు. అందులో పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి, 3. ఎఫ్ఆర్‌డిఐ తదితర అంశాలు ఉన్నాయన్నారు. నేడు ప్రజల వద్ద గానీ బ్యాంకుల్లో గానీ ప్రభుత్వం వద్దగాని డబ్బు లేదన్నారు. అంబానీ వద్దే ఉందన్నారు. ప్రస్తుతం ఎఫ్ఆర్‌డిఐ బిల్లు తెచ్చి చిన్న మొత్తాలను దాచుకునే వారిని దోచుకోవడం సహించరానిది అన్నారు. ఖాతాదారుల అనుమతి లేనిదే మనీ లిక్విడేషన్ చేయరాదని, దీనిపై అందరూ ఆలోచించాలన్నారు. రాబోయే రోజుల్లో బ్యాంకుల్లో దాచుకున్న డబ్బుకు రక్షణ ఉందా..? లేదా..? అనేదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై అందరూ ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు

రూ.4 కోట్లు విలువైన దుంగలు, బొమ్మలు స్వాధీనం

ప్రజాశక్తి-కడప అర్బన్
అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అశోక్‌కుమార్ అగర్వాల్‌ను అరెస్టు చేశామని ఎస్‌పి బాబూజీ అట్టాట తెలిపారు. కడప జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. రాజస్థాన్‌లోని సర్నా దుంగర్ ప్రాంతంలో కడప జిల్లా పోలీసులు నిర్వహించిన దాడుల్లో అశోక్‌కుమార్‌ను అరెస్టు చేశామని చెప్పారు. అతని గోడౌన్ నుంచి 3288.5 కిలోల (3 టన్నుల) బరువున్న 164 ఎర్రచందనం దుంగలు, 44 ఎర్రచందనం బొమ్మలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాటి విలువ రూ.4 కోట్లు ఉంటుందని చెప్పారు. ఇప్పటి వరకు వెయ్యి టన్నుల ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. అరెస్టు అయిన స్మగ్లర్ అశోక్‌కుమార్ ఇండోనేషియాకు చెందిన అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అలీభాయ్‌కి ప్రధాన అనుచరుడుగా గుర్తించామన్నారు. అశోక్‌కుమార్‌కు కర్నాటక, తమిళనాడు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు అంతర్ రాష్ట్ర, అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నాయన్నారు.


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం బొమ్మలతో ఎస్‌పి బాబూజీ అట్టాడ

ప్రత్యేకం

ఉత్తరాంధ్ర ప్యాకేజీలోనూ అన్యాయమే

- రూ.600 కోట్లకు గాను రూ.403 కోట్లే
- వాటి వినియోగంలోనూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం



ఉత్తరాంధ్ర మ్యాప్

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి
విభజన సమయంలో కేంద్రం ప్రకటించిన ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజి కూడా సక్రమంగా విడుదల చేయలేదు. అవసరం కొండంత.. ఇచ్చింది గోరంత అన్న చంద్రంగా ఉంది. విడుదల చేసిన నిధులనూ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేకపోయింది. ఆ పెట్టిన ఖర్చును ఉత్పాదక రంగానికి కాకుండా అధికార పార్టీ కార్యకర్తల కాంట్రాక్టుల కోసం సిసి రోడ్లు, భవనాలకు మళ్లించింది. దీంతో నాలుగేళ్లు గడిచినా ఉత్తరాంధ్రలో అభివృద్ధికి పునాదులే పడలేదు.

వెనుకబడిన ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు రూ.15 వేల కోట్లు కేంద్రం మంజూరు చేస్తే.. వ్యవసాయం, నీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య, ఉపాధి రంగాలు అభివృద్ధి అయివుండేవి. ప్రజలకు ఆదాయం పెరగడంతోపాటు, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించేవి. బుందేల్‌ఖండ్ తరహాలో ఉత్తరాంధ్ర, రాయలసీమకు దాదాపుగా రూ.26 వేల కోట్లు మంజూరు చేస్తామని ఆనాటి యుపిఎ ప్రభుత్వం ప్రకటించింది. మోడీ ప్రభుత్వం ఏడాదికి జిల్లాకు రూ.50 కోట్లు చొప్పున విడుదల చేస్తామని ప్రకటించింది. నాలుగేళ్ల కాలంలో ఒక్కో జిల్లాకు రూ.200 కోట్లు చొప్పున విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు రూ.600 కోట్లు విడుదల కావాలి. వాస్తవ లెక్కలను పరిశీలిస్తే మూడు జిల్లాలకు నాలుగేళ్లలో రూ. 403.19 కోట్లే కేంద్రం విడుదల చేసింది. ఇందులో మూడు జిల్లాల అధికారులు ఖర్చు చేసింది రూ.340.23 కోట్లు మాత్రమే.

విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో శంకుస్థాపన చేసిన ఐఐఎం భవనాల నిర్మాణానికి రూ.1300 కోట్లు అవసరం కాగా చివరి ఏడాది రూ.42 కోట్లు ప్రకటించింది. ఇలా అయితే ఐఐఎం నిర్మాణం పూర్తిగావడానికి ఎన్ని ఏళ్లు పడుతుందో వేరే చెప్పనక్కరలేదు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో ప్రకటించిన గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.10 కోట్లు, విశాఖ జిల్లా సబ్బవరం మండలంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియంకు రూ.32 కోట్లు బడ్జెట్‌లో చూపించారు. వీటన్నింటికీ వందల వేల కోట్లు కేటాయిస్తే తప్ప ఆ సంస్థలు పూర్తిగా వినియోగంలోకి వచ్చే అవకాశం లేదు. వీటితోపాటు గ్రామీణులు ఆర్థికంగా బలపడాలంటే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధార వంటి నీటి ప్రాజెక్టులు పూర్తి కావాలి. అందుకోసం రూ.15 వేల కోట్లు అవసరమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కేటాయింపులు ఆ స్థాయిలో లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు.

4 ఏళ్లలో ఉత్తరాంధ్ర ప్యాకేజీ విడుదల, ఖర్చు (కోట్లలో)

జిల్లా	ఇవ్వాల్సింది	ఇచ్చింది	ఖర్చు
విశాఖ	200	136.42	120.95
విజయనగరం	200	116.77	111.04
శ్రీకాకుళం	200	150.00	108.24
మొత్తం	**600**	**403.19**	**340.23**

సంక్షిప్తం

రైలు కింద పడి ప్రేమికుల ఆత్మహత్య

ప్రజాశక్తి-వేటపాలెం
మండల పరిధిలోని శ్రీకనకనాగవరపమ్మ దేవస్థానం సమీపంలో రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం వెలుగు చూచింది. చీరాల మండలం బోయినవారిపాలేనికి చెందిన చిరు వ్యాపారి చీపురాల సాయిరాం(24) ఎనిమిదేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన రమ్య(24) ఇద్దరు ప్రేమించుకున్నారు. అకస్మాత్తుగా రమ్యకు జాండ్రపేటకు చెందిన మరో యువకునితో వివాహం జరిగింది. వారికి ఐదేళ్ల బాలుడు, రెండున్నరేళ్ల పాప ఉన్నారు. వారి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రేమికులు ఇద్దరు స్థానిక నాగవరపమ్మ దేవస్థానం సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై విఘత జీవులై పడి ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

టిడిపి అవినీతి వల్లే టెండర్లు రద్దు : వైసిపి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం టెండర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు అవినీతే వల్లే రద్దయ్యాయని వైసిపి జిల్లా సమన్వకర్త మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 22 అంతర్జాతీయ విమాన సంస్థలను నడుపుతున్న ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా(ఎఎఐ)ను కాదని భోగాపురం విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రైవేటు సంస్థకు అప్పగించడంలో చంద్రబాబునాయుడుకు, అశోక్‌గజపతిరాజుకు ముడుపులు అందడమే కారణమని ఆరోపించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో ఎఎఐకు సామర్థ్యం లేదని చెబుతున్న కేంద్రమంత్రికి 22 విమానాశ్రయాలు నడుపుతున్న సంస్థ సామర్థ్యం ఆ శాఖ మంత్రికి తెలియదానని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం అశోక్‌గజపతికి తెలియాదా అని ప్రశ్నించారు.

సంపాదకీయం

మరో విధ్వంసక యాత్ర

1990 దశకంలో దేశవ్యాప్తంగా మతోన్మాద మంటలు రగిలించి, బాబ్రీమసీదు విధ్వంసానికి కారణమైన రథయాత్రను సంఘ్ పరివార్ మళ్లీ తెరపైకి తీసుకురావడం ఆందోళన కలిగిస్తోంది. రాజకీయాలతో ప్రమేయం లేకుండా హిందువుల్లో రామ మందిర నిర్మాణ సంకల్పాన్ని ధృడపరిచేందుకే రామ్ రాజ్య రథయాత్రను చేపట్టినట్లు సంఘ్ పరివార్ చేస్తున్న ప్రచారం చూస్తుంటే మళ్లీ అది దేశ వ్యాపితంగా మత ఘర్షణలు రెచ్చగొట్టడానికే నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో పాటు కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల గుండా రథయాత్రను కొనసాగించి మార్చి 25న రామనవమి సందర్భంగా తమిళనాడులోని రామేశ్వరంలో ముగించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అదే రోజున అయోధ్యలో మహా రామ మందిరానికి శ్రీకారం చుట్టాలన్నది వారి ఉద్దేశం. 28 ఏళ్ల కిందట బిజెపి సీనియర్ నేత ఎల్‌కె అద్వానీ చేపట్టిన రథయాత్ర దేశమంతటా రక్తపుటేరులు పారించింది. ఘర్షణల్లో వేల మంది చనిపోయారు. బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత దానికి ప్రతీకారం పేరుతో బొంబాయి బాంబు పేలుళ్లల్లో అనేక మంది అమాయక ప్రజలు బలైపోయారు. అనాటి పరిస్థితినే మళ్లీ సృష్టించి తద్వారా హిందూ ఓటు బ్యాంకును కూడదీసుకునే దుర్మార్గపు ఎజెండానే ప్రస్తుత యాత్ర వెనుక కూడా ఉందన్న దాన్లో ఎవరికీ సందేహం ఉండనక్కరలేదు. మహారాష్ట్రలోని శ్రీరాం దాస్ మిషన్ యూనివర్సల్ సొసైటీ అనే ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఈ యాత్రకు నేతృత్వం వహిస్తోందని ప్రచారం చేస్తున్నా దిశానిర్దేశం చేస్తున్నది మాత్రం కాషాయ పరివారమేనని యాత్ర నడుస్తున్న తీరు ప్రస్ఫుటం చేస్తోంది. ఈ యాత్రను ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నుంచి విహెచ్‌పి అధినాయకత్వమే ప్రారంభించడం, దాని బిజెపి నేతలు, సంఘ్ పరివార్, దాని అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరవ్వడమే దీనికి నిదర్శనం. నాడు అద్వానీ చేపట్టిన రథయాత్ర ఒక బలమైన రాజకీయ పార్టీగా బిజెపి ఎదగడానికి దోహదం చేసిందనేది వాస్తవం. అత్యధిక మెజార్టీతో కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న ప్రస్తుత బిజెపికి మళ్లీ మందిర నినాదం ఎత్తుకోవడానికి ప్రధానకారణం దేశవ్యాప్తంగా కాషాయ పార్టీ పట్ల ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తే.

కుంభకోణాల ఊబిలో కూరుకుపోయిన కాంగ్రెస్‌ను ప్రజలు చీదరించుకుంటున్న నేపథ్యాన్ని 'అచ్చేదిన్' నినాదాలతో అనుకూలంగా మలుచుకొని గద్దెనెక్కిన బిజెపి అనతికాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలపై నీళ్లు కుమ్మరించింది. పచ్చి అబద్ధపు వాగ్బాణాలు, జనరంజక నినాదాలతో కాలం వెళ్లదీయొచ్చు అనుకున్న కాషాయ కూటమిని ప్రజలు ఛీకొట్టేందుకు కూడా ఎక్కువ సమయం పట్టలేదు. నోట్ల రద్దు, జిఎస్‌టి వంటి చర్యలతో, కార్మిక, కర్షక విధానాలతో సామాన్య ప్రజలపై ఎనలేని భారాలు మోపిన ఆ పార్టీని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోనే కన్నులొట్టబోయేలా ప్రజలు ఇచ్చిన తీర్పు సామాన్యమైనది కాదు. దేశవ్యాప్తంగా ముఖ్యంగా బిజెపి పాలిస్తున్న రాష్ట్రాల్లో బిజెపి పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహానికి ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఉపఎన్నికల తీర్పే నిదర్శనం. వినాశకర విధానాలతో ఆర్థిక రంగం ప్రధానంగా బ్యాకింగ్ రంగం అస్తవ్యస్థంగా మారిపోయిందంటే అది బిజెపి చలువే. రఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం, విజయ మాల్యా బాగోతం, అదానీ, అమిత్ షా అక్రమాలు, ఇప్పుడు పంజాబ్ నేషనల్ బ్యాంకు అక్రమ లావాదేవీలు..ఇలా బిజెపి పాలనలో కుంభకోణాలూ లెక్కకు మిక్కిలిగా పెరిగిపోయాయి. మరోవైపు అధికార అండ చూసుకొని కాషాయ మూకల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. దళితులు, మైనార్టీలపై యదేశ్చగా దాడులు చేయడం, హేతువాద రచయితలు, పాత్రికేయుల గొంతు నులిమేస్తూ అరాచక దాడులకు తెగబడటం, విశ్వవిద్యాలయాల్లోనూ, పరిశోధక సంస్థల్లో అభ్యుదయ శక్తులపై దాడులు చేయడం పరిపాటి అయిపోయింది. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి కుంభకోణాలు, కాషాయ మూకల దౌర్జన్యాలపై దేశ వ్యాపితంగా పెరుతున్న వ్యతిరేకత అనేక రూపాల్లో వ్యక్తమవుతోంది. దేశవ్యాపితంగా కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం అయ్యాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున రైతులు, కార్మికులు ఉద్యమిస్తున్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో కాషాయ నేతలు ప్రజల దృష్టిని వారి వైఫల్యాలనుండి మళ్లించేందుకే ఈ రకమైన రథయాత్ర విన్యాసాలకు శ్రీకారం చుట్టారని స్పష్టమవుతోంది. ప్రజలను మతాలవారీ చీల్చి, వారి మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల పబ్బం గడుపుకోడానికి సంఘ్ పరివారం చేస్తున్న ఈ కుట్రలను ప్రజాతంత్ర లౌకికవాదులు ముక్త కంఠంతో ఖండించాలి. కాషాయ పరివారపు మరోనరమేధానికి అడ్డుకట్ట వేయాలి.

ఇదీ విషయం



తాడో పేడో ఇక
తేలనుంది త్వరలో...
సూటి పోటి చురకలతో
ఇమడలేరు ఒక ఒరలో!

యుద్ధం అనివార్యమైతే
విసరాలిక కరవాలం...
పరదాలో ప్రగల్భాలు
పనిచేయవు కలకాలం!


- కొల్లూరు వెంకట్

మనుషుల్లో ధైర్యం నింపండి..!

విశ్లేషణ



దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న బలవన్మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా నేర ప్రవృత్తి విపరీతంగా విస్తరిస్తోంది. పాఠశాలకు సెలవు కోసం, పరీక్ష వాయిదా వేయించడం కోసం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మందలించారని, పరీక్ష తప్పినందుకు విద్యార్థులు ప్రాణం తీసుకుంటుంటే.. కూర బాగాలేదని, భార్య పుట్టింటికి వెళ్లిందని, నగలు కొనిపెట్టలేదని, సినిమాకు తీసుకెళ్లలేదని.. ఇలా చిన్నచిన్న కారణాలతోనే తమ నూరేళ్ల జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నవారెందరో. మనుషుల్లో మానసిక సమర్థత ఎందుకింతగా లోపిస్తున్నదో అంతుపట్టడంలేదు. కష్టసుఖాల సమ్మిళతమే జీవితం. మరి, అలాంటి అమూల్యమైన జీవితాన్ని ఎంతో ఆనందంగా సాగించకుండా ఇలాంటి చిన్నచిన్న సమస్యలకే కుంగిపోయి ప్రాణాలు తీసుకొనే తీవ్రమైన నిర్ణయాలకు వచ్చేయడం సరికాదు. పిరికితనం మనిషిని నిర్వీర్యం చేస్తుంది. దానికి ఆత్మవిశ్వాసమే విరుగుడు. ఆత్మవిశ్వాసం ఉంటే మనిషి విజయపథం వైపు అడుగులు వేస్తాడనే విషయాన్ని గుర్తించాలి.



చుక్కా రామయ్య

సాంకేతికతను అందిపుచ్చుకొని పారిశ్రామిక ఉత్పత్తిని పెంచుకుంటూ జీడీపీని పెంచుకోవడం కన్నా జీడీపీని పెంచే మనుషుల శ్రమను బతికించుకోవడమే ఈ రోజు ప్రధానం. ఇలాంటి సామాజిక రుగ్మతలను తరిమికొట్టినప్పుడే దృఢమైన సమాజం నిర్మితమవుతుందని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి. ఈ శతాబ్దంలో మానవ వనరులే దేశానికి వరం. ఈ రోజు చిన్నచిన్న కుటుంబ తగాదాలు, చిన్నపాటి సమస్యలతో ప్రాణాలు తీసుకుంటున్నవారు కొందరైతే.. అహర్నిశలు శ్రమించి సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర రాక, ప్రభుత్వాల నుంచి సరైన సాయం అందక దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇది అత్యంత బాధాకరమైన విషయం.

సాంకేతికతను అందిపుచ్చుకొని పారిశ్రామిక ఉత్పత్తిని పెంచుకుంటూ జీడీపీని పెంచుకోవడం కన్నా జీడీపీని పెంచే మనుషుల శ్రమను బతికించుకోవడమే ఈ రోజు ప్రధానం. ఇలాంటి సామాజిక రుగ్మతలను తరిమికొట్టినప్పుడే దృఢమైన సమాజం నిర్మితమవుతుందని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి. ఈ శతాబ్దంలో మానవ వనరులే దేశానికి వరం.

మరో వైపు చేనేత కార్మికులు, చదువుకు తగిన ఉద్యోగాలు దొరక్క యువత తమ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం వీరందరికీ చేయూతనివ్వాలి. మనుషులు స్వేచ్ఛగా, ఆనందంగా జీవించే వాతావరణం సృష్టించాలి. జీడీపీని పెంచే ముందు దాన్ని సృష్టించే మానవ వనరులను బతికించుకోవడం నేటి ప్రభుత్వాలకు ఓ సవాల్. పెద్దపెద్ద కాంట్రాక్టర్లు, బడా బాబులకు అడిగిందే తడవుగా రూ.కోట్ల మొత్తంలో రుణాలు ఇస్తున్న బ్యాంకులు దేశానికి అన్నం పెట్టే రైతుకు, ఏదైనా ఉపాధి కోసం రుణం అడిగే యువకుడికి మాత్రం మొండిచేయి చూపుతున్నాయి. తద్వారా తమ సామాజిక బాధ్యత విస్మరిస్తూ అమానవీయంగా వ్యవహరిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వాలు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండటం బాధాకరం. బ్యాంకులను నిలదీసి ప్రజలకు మేలు చేయాల్సిన ప్రభుత్వాలే ఈ ధోరణిలో వ్యవహరిస్తుంటే ఇక వారిని పట్టించుకొనేదెవరు? బ్యాంకులకు రూ.వేల కోట్లు బకాయిపడిన వారంతా దర్జాగా తిరుగుతుంటే ఏమీ చేయలేని బ్యాంకులు, కేవలం రూ.వేల మొత్తంలో రుణం తీసుకొని కట్టలేని పరిస్థితుల్లో ఉన్న సామాన్య జనంపై తమ జులుం ప్రదర్శిస్తున్నాయి. అప్పుల వసూళ్ల కోసం వారిని నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. స్వాతంత్ర్యం సాధించుకున్న తొలి రోజుల్లో 80 శాతంగా ఉన్న వ్యవసాయం ఈ రోజు సుమారు 45 శాతానికి పడిపోయింది. పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడానికి తోడు దళారీల మాయాజాలంలో చిక్కుకున్న రైతన్న కుదేలయ్యాడు. ఉద్యోగాలు రాక యువత తీవ్ర ఆందోళనకు గురవుతోంది. సమాజంలో మహిళలకు భద్రత కరువైంది.

కష్టానికి తగిన ఫలితం రాక బతుకు భారమై బలవన్మరణాలకు పాల్పడుతున్నవారు కొందరైతే.. చిన్నపాటి సమస్యలకే ప్రాణాలు తీసుకుంటుండటం నేడు షరా మామూలైంది. ఇది సామాజిక అశాంతికి దారి తీసే పరిణామం. నిత్యకృత్యంగా మారుతున్న ఇలాంటి తీవ్రమైన సమస్యపై ప్రభుత్వం తక్షణమే దృష్టిసారించాలి. దానికి కారణాలు అన్వేషించాలి. పరిష్కార మార్గాలను సూచించాలి. ఎలాంటి సమస్యలు వచ్చినా నిలదొక్కుకొని మానసిక స్థైర్యాన్నిచ్చే విధంగా కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి. వారిలో మానసిక వికాసాన్ని పెంపొందించాలి. సమస్య ఉత్పన్నమైనప్పుడు పోలీసులను రంగప్రవేశం చేయించి దానిపై విచారణ చేయించడం మామూలే. కానీ మనుషుల్లో ఈ మానసిక అస్థిరతకు కారణాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. కేవలం గణాంకాలు చెప్పడం, కేసులు విచారణ చేసి అరెస్టులు చేయడంతో ఒరిగేదేమీ ఉండదు. సమస్య మూలాల్లోకి వెళ్లి ఆ రుగ్మతలను నియంత్రించే ప్రయత్నాలు చేస్తే సమాజానికి మేలు జరుగుతుంది. ఎందుకిలా జరుగుతోంది? ఏయే రంగాల్లో ఆత్మహత్యలు జరుగుతున్నాయి? ఏయే కారణాల వల్ల జరుగుతున్నాయో అన్వేషిస్తే చక్కటి పరిష్కారాలు దొరుకుతాయి. మనిషి ప్రాణాల హననానికి దారితీస్తున్న సమస్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. దేశ ప్రజలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఏ చిన్నపాటి సమస్యలు వచ్చినా ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్య పరిష్కారం కాదు. ప్రతి మనిషి జీవితంలో విజయం, అపజయం రెండూ ఉంటాయి. అపజయాన్ని కూడా స్వీకరించే పరిస్థితిలో ఉంటేనే జయానికి సిద్ధంగా ఉంటాం. మనుషుల సంరక్షణపై ప్రభుత్వాలు పట్టనట్టుగా వ్యవహరించడం వల్లే ఇలాంటి సామాజిక అశాంతికి కారణమనే ఆరోపణల్ని తోసిపుచ్చలేం. నిత్యం ఎన్నికల్లో గెలుపొందడమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వాలు మనుషుల్ని కేవలం ఓటు వేసే యంత్రాలుగానే చేస్తుండటం దురదృష్టకరం. మనుషుల్ని దేశంలో ఓ అమూల్య సంపదగా గుర్తించండి. మానవ సంబంధాలను బలోపేతం చేసే విధానాలను అనుసరించండి. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్..' అని మహాకవి గురజాడ చెప్పిన మాటల్ని గుర్తుచేసుకోండి.

(రచయిత ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు)

సోషల్ మీడియా

ఉత్తరాంధ్ర జనఘోష




ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు...

- ఉత్తరాంధ్ర, రాయలసీమకు బుందేల్‌ఖండ్, బొలంగీర్– కలహండి– కోరాపుట్ తరహా ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలి.
- ఉత్తరాంధ్ర, రాయలసీమకు ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న విధంగా స్వయం ప్రతిపత్తి గల అభివృద్ధి మండలిని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.
- ఉత్తరాంధ్రకు రూ.15 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం తక్షణం ప్రకటించాలి.
- ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం పన్నుల రాయితీతో కూడిన ప్రత్యేక హోదాను మంజూరు చేయాలి.
- పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.
- విశాఖపట్నంలో రైల్వేజోన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి.
- గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఉత్తరాంధ్రలో వెంటనే ప్రారంభించాలి.
- ఎయిమ్స్ ఆస్పత్రిని విశాఖపట్నంలో ప్రారంభించాలి.
- విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కాప్టిన్ మైన్స్‌ను కేటాయించాలి.
- హైకోర్టు బెంచ్‌ను విశాఖపట్నంలో పెట్టాలి.
- విశాఖపట్నంలో మెట్రో రైలు పనులు వెంటనే ప్రారంభించాలి.
- ఉత్తరాంధ్ర మరో భోపాల్‌గా మారకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలి.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలి.
- గోదావరితో–మహానదిని అనుసంధానం చేయాలి. న్యాయమైన నీటి వాటాను కేటాయించాలి.
- 24 లక్షల ఎకరాలకు కనీసం ఒక పంటకైనా సాగు నీరు సదుపాయం కల్పించాలి.
- ఒరిస్సాతో ఉత్తరాంధ్ర సాగు నీటి ప్రాజెక్టులకు ఉన్న జల వివాదాలను వెంటనే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో 15 నుంచి 20 శాతం ఉత్తరాంధ్రకు కేటాయించాలి.
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణ ప్రతిపాదనను ఉపసంహరించు కోవాలి.
- పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను విశాఖలో నిర్మించాలి.
- విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను వెంటనే ప్రారంభించాలి.
- విశాఖ పోర్టుకు అనుబంధంగా శాటిలైట్ పోర్టును నిర్మించాలి.

ఉత్తరాంధ్ర చర్చా వేదిక

రూ.99 సంగతేంటి?



అమిత్ షా తన ప్రసంగంలో ఇలా చెప్పున్నాడు..

ఒక వ్యక్తి తన ముగ్గురు కొడుకులకు తలా 100 రూపాయలు ఇచ్చి ఈ డబ్బుతో ఇల్లు పూర్తిగా నిండిపోయే వస్తువు తెమ్మని చెప్పాడు.

మొదటివాడు గడ్డి తెచ్చి పరిచాడు ఇల్లు నిండలేదు.

రెండవ వాడు దూది తెచ్చి పరిచాడు ఇల్లు నిండలేదు.

మూడవ వాడు ఒక రూపాయితో ఒక కొవ్వొత్తి తెచ్చి వెలిగించాడు. ఇల్లు మొత్తం వెలుతురుతో నిండిపోయింది.

అమిత్ షా అన్నాడు

మన ప్రధానమంత్రి ఆ మూడవ కొడుకు లాంటివాడు.

ఏ రోజయితే రాజకీయాల్లోకి వచ్చాడో ఆ రోజు నుంచి దేశం వెలుగుతో కళకళలాడి పోతోంది...

అప్పుడే ....

వెనక నుంచి ఒక మాట వినిపించింది.

అన్నా.. అంతా బాగానే ఉంది కాని మిగతా రూ.99 ఎక్కడున్నాయి...? అని అడిగితే...

అమిత్ షా అన్నాడు..

'ప్రశ్నిస్తున్న ఆ దేశ ద్రోహిని కొట్టండి.....'

- విరియాల గౌతమ్

జన వాక్యం

గెలుపు కోసమే 'దళిత తేజం'

ఓట్ల బ్యాంకుల ఏర్పాట్లలో భాగంగా, నియోజక వర్గాల వారీగా టిడిపి, నెల రోజుల నుండి 'దళిత తేజం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే 'ఎవరైనా ఎస్సీలుగా' పుట్టాలనుకుంటారా? అని దళితులను కించపరుస్తూ ఇటీవల సాక్షాత్తూ ముఖ్యమంత్రే బహిరంగ వ్యాఖ్యలు చేశారు. మరి ఈ విషయాన్ని దళిత వర్గాలు అంత సులువుగా మర్చిపోతాయా! దళితుల ఓట్లకే ఈ మాయ మాటలు చెప్పిస్తున్నారు. బతికినన్నాళ్ళూ తానే ముఖ్యమంత్రి లేదంటే, రాజకీయ ఓనమాలు కూడా రాని లోకేష్‌కు పట్టం కట్టడమే మన ముఖ్యమంత్రిగారి ముందున్న లక్ష్యాలు. ఇక తాజాగా ప్రారంభించిన 'దళిత తేజమైనా.., గడపగడపకూ తెలుగు తేజమైనా, చెట్టూ–నీరు అయినా' అన్నీ కుల బల పరీక్షలకే గానీ దళితులపై ప్రేమ కాదని ఇప్పటికైనా తెలుసుకోవాలి. ఈ గారడీ మాటలకు తలొగ్గకుండా దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామంటేనే ఆ పార్టీకి ఓటేస్తామని డిమాండ్ చేయాలి.

చాకలకొండ శారద, కావలి.

చెంపపెట్టు


శాశ్వత ఉద్యోగాలతోనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ప్రపంచ బ్యాంకు ఎస్‌సిడి నివేదికలో తేల్చి చెప్పింది. దీంతో పకోడీ ఉద్యోగాల సలహా దార్లకీ, ప్రభుత్వ ఉద్యోగాల్ని ఊడగొడుతున్న కార్పొరేట్ వీరభక్త బాబులకూ ప్రపంచ బ్యాంకు మొట్టికాయలు వేసినట్లైంది. అయితే వరుసపెట్టి ప్రభుత్వ రంగాలను ప్రయివేటు పరం చేస్తోన్న, కార్పొరేట్ల కార్పెట్లను శుభ్రపరచడమే ధ్యేయంగా పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నివేదికతోనే మారిపోతాయని భ్రమించనవసరం లేదు. కానీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం ప్రమత్తులై ఉన్నా ఈ మతతత్వ, పెట్టుబడిదారీ తొత్తులుగా పని చేస్తున్న, ప్రభుత్వ శ్రామిక వ్యతిరేక విధానాలు, కట్టు తెగిన ఏరులౌతాయి. ఇప్పటికే ఆర్థిక నిచ్చెన అడుగు మెట్టు మీద ఉన్న పేద ప్రజానీకం అథఃపాతాళానికి చేరుతోంది. పోరాటాలు చేయడం, చైతన్యపరచడం ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచాలి.

తాండ్ర రమణ, ఒంగోలు.

రంగులు మారుతున్న రాష్ట్ర రాజకీయం

దృష్టి





వి శంకరయ్య

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం రోజుకొక తీరుగా అనూహ్య మార్పులకు లోనౌతోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్ర తెలుగుదేశ ప్రభుత్వం ఆడుతున్న కపట నాటకంతో ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి కూడా తన వంతు పాత్ర పోషిస్తూ రాజకీయ మార్పులు జరిగేందుకు దోహదం చేస్తోంది. ఈ నాటకంలో రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఈ రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలకు పణంగా పెడుతున్నాయి. వామపక్షాలను మినహాయిస్తే మిగిలిన పార్టీలన్నీ ఈ రావణ కాష్టానికి తమ వంతు సమిధలను సమర్పిస్తున్నాయి. బిజెపి, టిడిపి, వైసిపి పార్టీలు రాజకీయాధికారం దృష్టిలో పెట్టుకొని వ్యూహ ప్రతివ్యూహాలను అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలను బలిపీఠం ఎక్కిస్తున్నాయి. తొలి నుండి కూడా వామపక్షాలు, కొన్ని గ్రూపులు, వ్యక్తులు, విభజన సందర్భంగా చట్టసభలో ఇచ్చిన హామీలు, చట్టబద్ధంగా రావలసిన నిధులు, రాయితీల కోసం పోరాడుతున్నాయి. 2014 ఎన్నికల్లో బిజెపి, టిడిపి అభ్యర్థులను గెలిపించమని కోరిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిల్లి మొగ్గలతో సరిపెడుతున్నారు.

మూడేళ్ల కాలం ప్రతి బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేస్తూ తోక కోసి సున్నం పెడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు గులాంగిరితో సరిపెట్టారు. ప్రత్యేక హోదాతో సమానంగా ప్రత్యేక ప్యాకేజి ఇస్తున్నప్పుడు కేంద్రానికి వ్యతిరేకంగా ఎందుకు పోరాడాలని ప్రతిపక్షాలనే గాక రాష్ట్ర ప్రజలపై కూడా ముఖ్యమంత్రి ఎదురు దాడి చేశారు. ఆనాడు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలనే రాష్ట్ర బిజెపి నేతలు అస్త్రాలుగా మలచుకొని రాష్ట్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీపై ప్రయోగిస్తున్నారు. ఒకనాడు కేంద్రాన్ని ప్రశంసలతో ముంచెత్తిన ముఖ్యమంత్రి ప్రస్తుతం విమర్శలు చేయడంలోని ఆంతర్యమేంటని బిజెపి నేతలు నిలదీస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి తన పార్టీ నేతల చేత ప్రత్యారోపణలు చేయిస్తూ తను మాత్రం బహిరంగంగా కేంద్రానికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేని దురవస్థలో వున్నారు. ముందు ఈ మౌనం తనకు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారేమో? మూడేళ్లు మిన్నకుండి ఇప్పుడే ఇంత రచ్చ చేయడానికిగల అసలు కారణాన్ని రాష్ట్ర బిజెపి నేతలే బహిర్గతం చేసి తెలుగుదేశం పార్టీ పరువు తీశారు. కేంద్రం శాసన సభ స్థానాలను పెంచి వుంటే ముఖ్యమంత్రి ఇంత రచ్చకు దిగేవారు కాదని ఎమ్మెల్సీ సోము వీర్రాజే కాకుండా రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు హరిబాబు కూడా ఢిల్లీలో బహిర్గతం చేశారు. బేతాళ మాంత్రికుని ప్రాణం సప్త సముద్రాల అవతల పగడాల దీవిలో మంత్రాల మర్రి కొమ్మపై గల చిలకలో వున్నట్లు 2019 ఎన్నికల్లో శాసన సభ స్థానాలు పెరగకపోతే ముఖ్యమంత్రి ఎదురుదెబ్బలు తినే అవకాశముందని బిజెపి నేతల ప్రకటనలు బహిర్గతం చేశాయి.

ఒకటి కాదు రెండు కాదు పలు బలహీనతలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో ముఖ్యమంత్రి కాపురం చేయలేకున్నారు. విడాకులు ఇవ్వలేకున్నారు. పార్టీ పరంగా కొన్ని ఇబ్బందులు వుంటే ప్రభుత్వ పరంగా వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలుగా భావించబడిన రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు (ఇప్పటికే చతికిల పడ్డాయి) పూర్తి అయ్యే అవకాశాలు ఏమాత్రం కన్పించనందున కేంద్రంపై ఈ నెపం నెట్టేందుకు పార్లమెంటు ఉభయ సభల్లో తెలుగు దేశం సభ్యులు ఆందోళనకు దిగారు. మార్చి 5వ తేదీన తిరిగి ఉభయ సభలు సమావేశమయ్యే వరకు గడువు ఇచ్చారు. అయితే పరిస్థితులు మరోలా పరిణమించాయి. కేంద్రం ఏ మాత్రం దిగి రాకుండా సమావేశాలు ముగియగానే రాష్ట్ర బిజెపి అధ్యక్షులు హరిబాబుతో ప్రకటన చేయించి కేంద్రం చేసిన సాయాన్ని ప్రకటించారు. ఇది వరలో కేంద్రం లోని ఏ ప్రభుత్వమూ రాష్ట్రానికి చేయనంత సాయాన్ని ప్రస్తుతం కేంద్రం చేసిందని ముఖ్యమంత్రికే సవాలు విసిరారు. ఈ ప్రకటనతో కేంద్రం మెత్తపడుతుందనే ఆశలపై చన్నీళ్లు చల్లినట్లైంది. అందుకే ముఖ్యమంత్రి అంచలంచల పోరాటానికి సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. తొలుత కేంద్రంలోని మంత్రులను వెనక్కి తీయడం తుదిగా ఎన్డీఏతో సంబంధాలు తెంచుకోవడం అంచలంచల పోరాటంగా భావిస్తున్న పూర్వరంగంలో ఈ లోపు మరో రెండు పరిణామాలు సంభవించి రాజకీయ వర్గాలనే ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఈ నెల 11వ తేదీ ఆదివారం ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఇద్దరు ఎంపీలు మాత్రమే వచ్చారు. అందుబాటులో కొంతమంది వున్నా స్పందించలేదనే ప్రచారం ఊపందుకొంది. దీనికి తోడు వచ్చే ఎన్నికల్లో టికెట్లు లభించవని భావిస్తున్న తెలుగుదేశం ఎమ్మెల్యేలు దాదాపు పది మంది గోడ దూకే సన్నాహాల్లో వున్నట్లు కూడా తెలుగు దేశం వర్గాల్లోనే ప్రచారం ప్రారంభమైంది.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధానమైన బలమేమంటే మీడియా మేనేజ్‌మెంట్. రాష్ట్రంలోని పాపులర్ మీడియా అండదండలున్నాయి. పార్టీలో అసంతృప్తి, లుకలుకలు ప్రజలకు చేరే అవకాశం ఏ మాత్రం లేదు. ఫలితంగా పార్టీ అంతర్గత విషయాలు, కుమ్ములాటలతో పాటు ప్రభుత్వ వ్యతిరేకత కూడా ప్రజల్లోకి సమగ్రంగా వెళ్లడం లేదు. మరో బలమేమంటే పారిశ్రామికవేత్తలు. ప్రపంచ ప్రఖ్యాత గాంచిన బిల్‌గేట్స్ లాంటి వారితో సంబంధాలు, వారిచ్చే పొగడ్తలు కొంత మేరకు కాపాడుకొస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబాని ముఖ్యమంత్రిని కలుసుకొన్నారు. ఇది రెండవ పరిణామం. ఈ సమావేశంపై పలు ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. కోడిగుడ్డుపై ఈకలు పీకేందుకు ప్రయత్నించే ఒక రకం మీడియాలో ఇలాంటి ఊహాగానాలు వస్తాయని కూడా ఎవరూ ఆశించలేరు. ముఖేష్ అంబానీ ముఖ్యమంత్రిని ఎందుకు కలిసారో, ఏం మాట్లాడుకొన్నారో పక్కనబెడితే తదుపరి జరిగిన సంఘటనలు ఆసక్తికరంగా వున్నాయి.

ప్రతి రాజకీయ పార్టీ ఢిల్లీలో ఏం జరుగుతుందో క్షణాల్లో తెలుసుకొనే అవకాశాలు ఎప్పుడూ రిజర్వులో వుంచుకొంటాయి. ముఖేష్ అంబాని ముఖ్యమంత్రిని కలిసిన సమయంలోనే వైసిపి నేత జగన్ పార్లమెంటు సభ్యుల రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించారు. టిడిపి, బిజెపి మధ్య సంధి కుదురుతుందని గ్రహించిన తర్వాతనే జగన్ రాజీనామా అస్త్రం ప్రయోగించినట్లు భావించాల్సి వుంది. ఆరోజు వరకు బిజెపిపై కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్న తెలుగుదేశం నేతల గొంతు జీరబోయింది. ఇందుకు ముఖేష్ అంబానీ రాక కారణం కావచ్చనే అనుమానం రాజకీయ వర్గాల్లో ఏర్పడింది. పైగా విపక్షనేత జగన్ ప్రకటన తదుపరి... ఒక్క తెలుగుదేశం నేత కూడా... కేంద్రంపై విమర్శలు చేయకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ జగన్ పైననే అస్త్రాలు సంధించారు. వాస్తవం చెప్పాలంటే కేంద్ర నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా మంత్రులతో రాజీనామాలు చేయించాలని భావిస్తున్న ముఖ్యమంత్రి రాజకీయాలు పక్కనబెడితే కేంద్రం నుండి నిధులు, రాయితీలు పొందేందుకు కేంద్రాన్ని లొంగదీసుకొనేందుకు రాష్ట్రం మొత్తం మీద ప్రజలు పోరాడుతున్నారనే సంకేతాన్ని పంపేందుకు ముఖ్యమంత్రి వుపయోగించుకొని వుండాలి. వామపక్షాలు ఇచ్చిన బంద్‌కు పరోక్షంగా సహకరించి కేంద్రానికి సంకేతాలు పంపినట్లే...జగన్ రాజీనామాల అస్త్రాన్ని కూడా ఉపయోగించుకొనేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా లేరు.

ముఖ్యమంత్రి ప్రతిపక్షాలను మెయిన్ స్ట్రీమ్ లోనికి తీసుకురావడం ఇష్టపడకపోవడం ఒక కారణమైతే కేంద్రంతో ఇంకా సంధికి అవకాశాలు మిగుల్చుకోవడం రెండవ అంశంగా భావించాలి. ఈ గండికోట రహస్యం కూడా కొద్ది రోజుల్లోనే వెలుగు చూడక తప్పదు. అంబాని తనను కలిసి వెళ్లిన తదుపరి కేంద్రం ప్రత్యేక ప్యాకేజి నెరవేరుస్తుందన్న నమ్మకం తనకు వుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. తమ పార్టీ నేతలందరిని కేంద్రానికి వ్యతిరేకంగా కాకుండా వైసిపిపై విమర్శలకు పురికొల్పారు. ఒకవేళ కేంద్రం కూడా ఆర్థిక సంబంధమైన అంశాలను పక్కనబెట్టి నియోజక వర్గాల పెంపుదల చేయవచ్చునేమో. ఇదే జరిగితే రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ముఖ్యమంత్రి ఫణంగా పెట్టినవారౌతారు. తాము ఆడుతున్న కపట నాటకానికి విపక్ష నేత జగన్ రాజీనామాల ప్రకటన గండి కొట్టిందని భావించిన తెలుగు దేశం నేతలు బిజెపిని వదలి వైసిపిపై విమర్శలు సాగిస్తున్నారనేందుకు ఆస్కారం ఏర్పడింది. వాస్తవంలో విపక్ష నేత జగన్ రాజీనామాల అస్త్రం అంబులపొది నుండి బయటికి తీసిన తొలి రోజుల్లోనే ప్రయోగించి వుంటే ఈ పాటికి కేంద్రం దిగి వచ్చేది. బిజెపి, టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు వీటి నేతలు ఎవరి రాజకీయ ప్రయోజనాలను వారు దృష్టిలో పెట్టుకొని వ్యవహరిస్తున్నందున అంతిమంగా రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోంది. కారు చీకటిలో కాంతి రేఖలాగా వీరందరి మెడలు వంచాలంటే వామపక్షాలు, ప్రజాతంత్రవాదులు, గ్రూపులు, వ్యక్తులు సమైక్య పోరాటం సాగించడం ఒక్కటే శరణ్యం.

(రచయిత విశ్రాంత పాత్రికేయుడు, సెల్ : 9848394013)



పెద్దల బాలశిక్ష

జీవితంలో ప్రతి క్షణం ఒత్తిళ్లే. ఇంట్లో మహిళలూ ఇంతకన్నా పెద్ద ఎత్తున హింసను ఎదుర్కొంటున్నారు. భర్త, అత్తమామల నుంచి ఎదురయ్యే శారీరక, మానసిక హింస కారణంగా తీవ్ర ఆవేదనకు లోనవుతున్న వారి సంఖ్యా ఎక్కువే.

ఒత్తిళ్లతోనే పిల్లలపై హింస

ఇలాంటివారే.. తమ కోపాన్నంతా తమ పిల్లలపై చూపిస్తున్నారు. కంటికి రెప్పలై కాపాడాల్సిన తల్లిదండ్రులు హింసాప్రవృత్తితో పిల్లల్ని శారీరకంగా హింసిస్తున్నారు. అందుకే ప్రస్తుతం ఇంట్లోనూ పిల్లలకు రక్షణ లేకుండా పోతోందని పలు సర్వేలు చెబుతున్నాయి. పిల్లలు చదువులో రాణించలేక పోతున్నారనో, అల్లరి చేస్తున్నారనో, అందంగా లేరనో, ఆడపిల్లలనో ఇలా వివిధ నెపాలు మోపుతూ పిల్లలపై హింసకు పాల్పడుతున్నారని సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి.

రకరకాల కారణాలు

గతేడాది డిసెంబర్‌లో బెంగళూరులో స్వయంగా తల్లే తన ఎనిమిదేళ్ల కూతుర్ని సిగరెట్లతో కాలుస్తుండడాన్ని అక్కడి మానసికవైద్యులు తమ దగ్గరికి వచ్చిన కేసులో గుర్తించారు. ఎందుకిలా చేస్తున్నారని సైక్రియాట్రిస్టులు ఆమెను ప్రశ్నిస్తే?! ఆమె చెప్పిన సమాధానం ఏంటో తెలుసా....."మాకు తెల్లగా ఉన్న అబ్బాయి పుడతాడని అనుకున్నాం. అయితే అమ్మాయి పుట్టింది, అది కూడా నల్లగా ఉంది" అని చెప్పింది.

చట్టాలున్నా అమలెక్కడ?

చిన్నపిల్లల్ని హింసిస్తే.. విదేశాల్లో కఠిన చట్టాలు అమలు చేస్తారు. మనదేశంలోనూ కొన్ని చట్టాలున్నా.. తల్లిదండ్రులు పిల్లల్ని కొట్టడం తమ హక్కనుకుంటే, మరికొంతమంది కొట్టకపోతే మాట వినరంటూ వితండవాదన చేస్తూ.. పిల్లలపై హింసను ప్రోత్సహిస్తున్నారు. స్కూళ్లల్లో అయితే రైట్ ఆఫ్ చిల్డ్రన్ టు ఫ్రీ అండ్ కంపల్సరీ ఎడ్యుకేషన్ (ఆర్టీఈ) యాక్ట్ 2009 ప్రకారం పిల్లలను శారీరకంగా శిక్షించడం, మానసికంగా వేధించడం శిక్షార్హం. అలా ప్రవర్తించిన వారికి సెక్షన్ 17(2) ప్రకారం శిక్ష పడుతుంది. కేవలం శారీరక హింస మాత్రమే కాదు మానసిక హింస, వివక్షా శిక్షార్హమైనవని చట్టంలో పేర్కొన్నారు. కానీ ఇలాంటి చట్టాలు అమలవుతున్న సందర్భాలు చాలా తక్కువే.

విచారించిన వైద్యులు ఆమె వైవాహిక జీవితం సరిగా లేదని, భర్త, అత్తమామల నుంచి ఎదుర్కొంటున్న హింస కారణంగానే ఆమె అలా మారిందని తేల్చారు.

కొన్ని నెలల కిందట జేపీనగర్ ప్రాంతంలో ఉన్న ఓ బెంగాలీ మహిళ అపార్ట్‌మెంట్ నుంచి తన ఏడేళ్ల కూతురుని తోసి చంపేసింది. అందుకు ఆ తల్లి చెప్పిన కారణం... ఆ పాప




ఏడేళ్లొచ్చినా సరిగ్గా మాట్లాడలేకపోతోందనే విసుగుతోనే అలా చేసిందట! ఈ కేసును పరిశీలించిన మానసిక శాస్త్రవేత్తలు... నిందితురాలి కుటుంబ సంబంధాలు సరిగా లేకపోవడంతో ఆమె తీవ్ర ఒత్తిడికి లోనైందనీ, ఆ ఆక్రోశంతో తన బిడ్డనే చంపుకుందనీ విశ్లేషించారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో కారణంతో తమ పిల్లలపైనే శారీరక, మానసిక హింసకు పాల్పడుతున్న సంఘటనలు దేశవ్యాప్తంగా ఉంటున్నాయి.

పనిష్మెంట్ పేరెంటింగ్

గత కొంతకాలంగా పనిష్మెంట్ పేరెంటింగ్ పెరిగిపోతోంది. ఆఫీసులో, ఇంట్లో తమకు ఎదురవుతున్న ఒత్తిళ్ల, ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలు.. ఇలా తమ ఒత్తిడి ఏదైనా సరే ఆ ఆక్రోశాన్నంతా పిల్లలపై చూపుతున్నారు. అంతేకాదు వారిని కొట్టడం చాలా మామూలుగా భావిస్తున్నారు. పిల్లలను కర్ర లేదా బెల్ట్‌లతో ఎక్కువగా కొట్టడం, చీకటిగదుల్లో బంధించడం వంటి శిక్షలు వేస్తున్నారు.

బెంగళూరులో ఒక తల్లి తన ఏడేళ్ల కూతురిని ఇంకా సరిగా మాట్లాడ్డం రాలేదని పైఅంతస్తు నుంచి తోసేసింది. ఒక తండ్రి యూకేజీ చదివే తన కొడుక్కి క్లాస్ ఫస్ట్ రాలేదని సిగరెట్‌తో వాతలు పెట్టాడు. ఇంకో తల్లి తన కొడుకు అల్లరి చేస్తున్నాడని మరుగుతున్న మైనాన్ని మోకాళ్లపై పోసేసింది. ఒక స్కూల్లో సరిగా అక్షరాలు పలకడం రాలేదని ఎల్‌కెజీ చదివే అమ్మాయికి టీచర్ వాతలు పెట్టింది.. ఇలా చెప్పుకుంటూపోతే.. పిల్లలపై పెట్రేగుతున్న పెద్దల హింస చాంతాడంత లిస్టు అవుతుంది. ఇలా చేసేది ఎవరో.. దోబూచునో.. అపరచితమైన వ్యక్తులోకాదు. స్వయంగా పిల్లలగన్న తల్లిదండ్రులు, టీచర్లే. పసిమొగ్గలపై ఇలాంటి దాష్టీకాలకు కారణాలేమిటి? వీటిని నిరోధించే చట్టాలు ఏం చెబుతున్నాయి? తదితర అంశాలపై 'జీవన' ఫోకస్.



దీనివల్ల చిన్నారులు శారీరక, మానసిక హింసకు గురవుతున్నారు. ఇలాంటి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ను ఇవ్వాలనీ.. లేదంటే ప్రవర్తన మరింత విపరీతంగా మారుతుందనీ మానసిక వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ తీవ్రమైన హింసను తట్టుకోలేక చిన్నారులు మానసిక రుగ్మతలకూ లోనవుతున్నారు.

స్కూళ్లల్లోనూ హింసే

విద్యావ్యవస్థ కార్పొరేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో.. ఫీజుల వసూళ్లు, ర్యాంకుల సంపాదనే లక్ష్యంగా చదువులు సాగుతున్నాయి. పిల్లల మానసిక, శారీరక వికాసంపై ఎలాంటి అవగాహనా లేనివాళ్లు ఉపాధ్యాయులుగా ప్రైవేట్ స్కూళ్లల్లో ఉన్నారు. వీరు పిల్లలకు అర్థమయ్యేలా విద్యాబోధన ఎలా చేయాలో తెలియక విద్యార్థులను హింసిస్తు న్నారు. అలా చదువు చెప్పడమే సరైన బోధనగా భావిస్తున్నారు. ఇటీవల స్కూల్స్‌లో పిల్లల్ని దారుణంగా కొట్టడం, తిట్టడం వంటి సంఘటనలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. చిన్నపిల్లలపై జరుగుతున్న ఈ హింస వారిని శారీరకంగా, మానసికంగా కుంగదీస్తోంది. దీంతో కొందరు పిల్లలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి, మానసికంగా దెబ్బతింటున్నారు. మరికొందరు పిల్లలు ఏకంగా ఆత్మహత్యలకే పాల్పడుతున్నారు.

అమానుష ధోరణి

స్కూల్లో అటెండెన్స్‌ను సరిగ్గా పలకలేదని ఒక ఏడేళ్ల అబ్బాయిని మూడు నిమిషాల వ్యవధిలో 40 సార్లు దారుణంగా కొట్టిన వీడియో ఒకటి కొన్ని వారాల కిందట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మాటలూ సరిగారాని ఏడేళ్ల పిల్లవాడ్ని అత్యంత అమానవీయంగా కొట్టడం చూపరుల్ని కలిచివేసింది. పిల్లలను ఆ విధంగా హింసించి, ఆనందం పొందే మానసిక రోగులను టీచర్లుగా నియమించిన స్కూల్ యాజమాన్యం ఇందులో మొదటి ముద్దాయి. తమిళనాడులో ఓ ప్రభుత్వ పాఠశాలలో 13 ఏళ్ల బాలికను రుతుక్రమంలో డ్రెస్‌కు మరకలు పడ్డాయని ఓ టీచర్ పిల్లలందరి ముందూ అవమానించింది. అబ్బాయిలు ముందు టీచర్ ఆవిధంగా ప్రవర్తించడం వల్ల ఆ అమ్మాయి మానసికంగా కుంగిపోయి, ఆత్మహత్య చేసుకుంది. ఇలాంటి ఘటనలు రోజూ ఎక్కడో అక్కడ జరుగుతూనే ఉన్నాయి. ఘటన జరిగిన తర్వాత రెండు రోజులు ఈ విషయంపై మాట్లాడుకోవడం.. తర్వాత దాని గురించి మర్చిపోవడం జరుగుతోంది. ఇలాంటి రాక్షస ప్రవృత్తితో ప్రవర్తిస్తున్న టీచర్లపై కఠినచర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనల సమయంలో సంబంధిత టీచర్లకు కౌన్సెలింగ్ ఇప్పించడం అవసరం. ఇలాంటి దారుణాలపై పోరాడాల్సిన తల్లిదండ్రులు తామే ఇళ్లల్లో పిల్లల్ని హింసాత్మక చర్యలకు గురిచేస్తున్నారు. ఈ పరిస్థితి మారాలంటే సరైన మానవ సంబంధాలు అవసరం. కుటుంబంలో తల్లిదండ్రులు తగిన అవగాహనతో పరస్పర ప్రేమాభిమానాలతో జీవనం సాగించాలి. తాము ఎదుర్కొనే ఏ సమస్యకీ తమ పిల్లలు కారణం కాదనే విజ్ఞతతో వ్యవహరించాలి. బాలల హక్కుల కోసం, వారిపై హింసని నిరోధించడం కోసం ఉన్న చట్టాల్ని పటిష్టంగా అమలుచేయాలి.

- బెందాళం కృష్ణారావు

హింస.. సృజనని చంపేస్తుంది



పిల్లల్లో నేర్చుకోవాలన్న ఆసక్తిని, సృజనాత్మకతని హింస దెబ్బతీస్తోంది. నిత్యం హింసను ఎదుర్కోవడం వల్ల పిల్లలు పెద్దయ్యాక మానవసంబంధాలపై తేలికభావాన్ని పెంపొందించుకుంటారు. వారిలో నేర మనస్తత్వం పెరగడానికి బాల్యంలో ఎదుర్కొన్న హింసే కారణమౌతుంది. ప్రైవేట్ విద్యావ్యవస్థ వచ్చిన తర్వాత పిల్లలపై మార్కుల ఒత్తిడి బాగా పెరిగింది. వారిలో కొత్త విషయం తెలుసుకోవాలనే తపనని చంపేసి, కేవలం మార్కుల కోసమే వారి మెదళ్లల్లో రకరకాల విషయాలు కూరేస్తున్నారు. వాటిని నేర్చుకోవడంలో వారు వెనకబడితే విచక్షణారహితంగా హింసిస్తున్నారు. ఇది పిల్లల మనసుల్ని కలుషితం చేయడమే. తల్లిదండ్రులు, టీచర్లు పిల్లల మనసెరిగి సవ్యంగా ప్రవర్తించడంతోనే ఇలాంటి హింసను దూరం చెయ్యొచ్చు. వారి మనోభావాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే భవిష్యత్ సమాజం ఆరోగ్యంగా, ఆదర్శవంతంగా ఉంటుంది.

- డాక్టర్ జె అమర్‌నాథ్,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, హైదరాబాద్

తినాల్సినవి.. తినకూడనివి



ఆఫీస్ సమయాలలో హ్యాపీగా, ఎనర్జిటిక్‌గా పనిచేయాలని మనసులో అనుకుంటే సరిపోదు. అందుకోసం మంచి నిద్ర, ప్రతిరోజూ కొద్దిసేపు వ్యాయామంతోపాటు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే సరి. పనిచేయడానికి అధికశక్తి రావడమే కాదు. ప్రొడక్టివిటీ పెరుగుతుంది. ఆ ఆహారసూత్రాలేంటో తెలుసుకుందాం!!

జంక్‌ఫుడ్‌కి దూరంగా

ఆఫీస్ చుట్టూ ఎన్నోరకాల స్నాక్స్, ఫుడ్స్ నోరూరిస్తూ ఉంటాయి. అయినా మనం జిహ్వాచాపల్యానికి అడ్డుకట్ట వేయాలి. ఎందుకంటే జంక్‌ఫుడ్ తినడం వల్ల పనిపట్ల అప్రమత్తంగా ఉండలేకపోతాం. తీపి పదార్థాలు తొందరగా శక్తినిస్తాయి. కానీ అంతే తొందరగా హానీ కలిగిస్తాయి. కాబట్టి పోషకాహారం తీసుకోవడం మంచిది.

అల్పాహారం తప్పనిసరి

చాలామంది ఉదయం ఏం తినకుండా ఉంటారు. కానీ ఇది ఆరోగ్యానికి హానికరమే కాదు మన ఆఫీస్ పనికి ఆటంకం కూడా. కాబట్టి తప్పనిసరిగా అల్పాహారం తీసుకోవాలి. అయితే తినమన్నారు కదా అని ఏది పడితే అది తినేయకుండా ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి. గ్లాసు ఫ్రూట్ జ్యూస్, ప్రొటీన్ షేక్, ఏవైనా ఫ్రూట్స్ ముక్కలు తీసుకుంటే మంచిది.

కొద్దికొద్దిగా.. మీల్స్

రక్తంలో గ్లూకోజ్ స్థాయి స్థిరంగా ఉండాలంటే కొద్ది కొద్ది ఆహారాన్ని ఎక్కువసార్లు తీసుకోవాలి. అలా కాకుండా ఆహారం తినకుండా ఉంటే షుగర్ లెవల్స్ పడిపోతాయి. మరీ ఎక్కువగా తింటే పెరిగే అవకాశమూ ఉంది.

పరిగడుపున ఓ పండు

పండ్లు ఏవైనా రోజంతా శక్తినిస్తాయి. ఫ్రూట్స్‌లో ఉండే ఫైబర్, కాంప్లెక్స్ షుగర్స్ సులభంగా జీర్ణమవుతాయి. కాబట్టి ఉదయమే పాలు, కోడిగుడ్డు వంటి వాటికంటే ఏదైనా పండు తినడం ఆరోగ్యానికి మంచిది.

తృణధాన్యాలు

గోధుమలు, జొన్నలు, మొక్కజొన్నలు, సజ్జలు, రాగులు ఆహారంలో చేర్చుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల ఎక్కువ సమయం ఎనర్జిటిక్‌గా ఉండగలుగుతాం.

మాంసం తగ్గించండి

మాంసంలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రొటీన్స్ కూడా అధికంగా ఉంటాయి. జీర్ణమవ్వడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. అయితే మాంసం మంచిదే అయినా ఎక్కువమొత్తంలో తీసుకోవడం వల్ల సోమరిగా తయారవుతారు. మాంసం తినడాన్ని తగ్గించాలి.

నీరు

సరిపడా నీళ్లు తాగడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాదు.. శక్తినిచ్చే పోషకాలు శరీరమంతటా విస్తరించడానికీ నీరు ఉపయోగపడుతుంది. నీరు సరిగ్గా తాగకపోవడం వల్ల రక్తం చిక్కగా మారుతుంది. చివరకు గుండె నుంచి రక్త సరఫరా కష్టమవుతుంది. ★

పసిపిల్లలకు.. ఇవి పెట్టొద్దు!

మూడు నెలల నుంచి సంవత్సరం లోపు పసిపాపలకు ఇచ్చే ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలని పిల్లల ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. సంవత్సరంలోపు చిన్నారులు రోజులో ఎక్కువ సమయం నిద్రకు పరిమితం కావడంతో వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. జాగ్రత్తలు పాటించకుండా ఆహారం ఇస్తే అజీర్ణ సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. పిల్లలు వాంతులు చేసుకోవడం, ఊపిరి సరిగ్గా తీసుకోకపోవడం జరుగుతాయి.

ఎగ్ వైట్ : పసిపిల్లలకు (సంవత్సరంలోపు) ఎగ్ వైట్ ఇవ్వకూడదు. ఇది పిల్లల్లో పొట్ట సమస్యలకు లేదా ఎగ్జిమాకు గురిచేస్తుంది.

చాక్లెట్ : చాక్లెట్‌లో ఎక్కువ కెఫిన్ ఉండటం వల్ల ఇది పసిపిల్లలకు అంత మంచిది కాదు. సంవత్సరం లోపు చిన్నారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చాక్లెట్లు అలవాటు చేయకూడదు.

గోధుమలతో చేసిన ఆహారపదార్థాలు : గోధుమలతో తయారుచేసిన ఏ ఆహారాన్నైనా పిల్లలకు పెట్టకూడదు. గోధుమల్లో ఎక్కువగా ఉండే గ్లూటిన్ అనే పదార్థం తేలికగా అరగదు. పిల్లల్లో ఇది జీర్ణం కాకపోగా, మలబద్ధకం సమస్యకు కారణమవుతుంది. చిన్నారులకు గోధుమలతో చేసిన ఆహార పదార్థాలు పెట్టకూడదు.

పుల్లని ద్రాక్ష : ఇవి పుల్లగా ఉండటంతో చిన్నారుల్లో గొంతు సమస్యలు వస్తాయి. అంతేకాదు, డయేరియాకు దారితీస్తాయి.

చీజ్ : చిన్నపిల్లలకు ఛీజ్ జీర్ణం చేసుకునే శక్తి ఉండదు. ఛీజ్ సరిగ్గా జీర్ణం కాకపోవడంతో ఫుడ్ పాయిజన్‌గా మారుతుంది.

స్ట్రాబెర్రీ : విటమిన్-సి ఎక్కువగా ఉండే స్ట్రాబెర్రీలు పసిపిల్లలకు పెట్టకపోవడం మంచిది. ఇది పిల్లలకు ఒక అసిడిక్‌ఫుడ్ కాబట్టి ఎట్టిపరిస్థితుల్లో పసిపిల్లలకు వీటిని అందివ్వకుండా ఉంటే మంచిది. ★




న్యాయ సూత్రం

మా బాబాయికి సంతానం లేరు. చిన్నప్పుడే మరొక బాబాయి కొడుకును చేరదీసి పెంచి పెద్దవాడిని చేశాడు. భార్య గతించింది. తన ఆస్థిని తను పెంచిన పిల్లాడికి రిజిష్టర్ వీలునామాగా కట్టబెట్టాడు. ఇప్పుడు కొందరు బంధువులు అది చెల్లదని, కోర్టులో వేస్తామని బెదిరిస్తున్నారు. అలాంటిది సాధ్యమేనా? నాకు వరుసకు తమ్ముడైన అతను భయపడుతున్నాడు. ఇప్పుడు మైనార్టీ కూడా తీరిపోయింది. దయచేసి సలహా చెప్పగలరు.

- జనార్ధన్, ఒంగోలు.

దత్తతగా వచ్చినవారికి హక్కుండదా?




సంతానం లేనివాళ్లు చట్టప్రకారం దత్తత చేసుకొనే వీలుంది. ఇచ్చేవాళ్లు పుచ్చుకునేవాళ్లు దత్తపత్రాలు పూర్తి వివరాలతో రాసుకుని, రిజిస్టరు చేసుకోవాలి. సాక్షులూ ఉండాలి. మతాచారాలను బట్టి సంబంధిత కార్యక్రమాలను చేసుకోవచ్చు.

ఇక ఆస్థి విషయానికి వస్తే, స్వార్జిత ఆస్తి మీద వారికే పూర్తి హక్కులుంటాయి. దత్తతకి వచ్చే మునుపే అతని పేర్న ఆస్థి ఉంటే, అది అతనికే చెందుతుంది. దత్తత తండ్రి వీలునామాలో స్పష్టంగా దత్తత తీసుకున్నట్లు, సదరు పిల్లవాడు తనకు వారసుడనీ రాయాలి. అప్పుడు ఎలాంటి సందేహాలు, సమస్యలూ ఉండవు.

బంధువుల బెదిరింపుల్ని పట్టించుకోనవసరం లేదు. వాళ్లేమీ చెయ్యలేరు. కాబట్టి, మీ బాబాయి కుమారుడు యథేచ్ఛగా, నిర్భయంగా ఆస్థిని అనుభవించవచ్చు.

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం :8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com



జీవన సౌరభం

స్త్రీలకు విద్య, సాధికారతతోనే అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

మీ కోసం



కోడిగుడ్డు పెంకులు మొక్కలకు మంచి ఎరువు. ఇంట్లో ఉంచితే బొద్దింకలు, బల్లులు పరార్!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

కృత్రిమంగా రక్తం వడపోయడాన్ని ఏమంటారు?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, గుంటూరు
సెల్ : 9985288150

విసర్జక వ్యవస్థ (ఎక్రీటరీ సిస్టమ్)

✧ విసర్జక వ్యవస్థ అధ్యయనాన్ని **- యూరాలజీ** అంటారు.
✧ శరీరంలో తయారైన నత్రజని, నత్రజనికాని వ్యర్థ పదార్థాలను బయటకు పంపించడాన్ని **'విసర్జన' (ఎక్సీషన్)** అంటారు.
✧ ఈ క్రియను నిర్వర్తించే భాగాలు 'విసర్జక అవయవాలు'.
✧ ఈ వ్యర్థాలు ప్రోటీన్స్, అమైనో ఆమ్లాలు, కేంద్రకామ్లాలు, ఆల్కలాయిడ్స్ జీవక్రియలలో ఏర్పడతాయి.

వ్యర్థాలు

1. నైట్రోజన్ సంబంధిత వ్యర్థాలు **- అమ్మోనియా, యూరియా, యూరిక్ ఆమ్లం, క్రియాటిన్, హిప్పూరిక్ ఆమ్లం.**
2. నైట్రోజన్ కాని వ్యర్థాలు **- ఆక్సాలిక్ ఆమ్లం, లాక్టిక్ ఆమ్లం.**
3. రసాయన వ్యర్థాలు **– Na, Ca, Mg, Cl^-, I, Harmones, Vitamines etc…**
4. పైత్యరస వర్ణకాలు **- బైలిరూబిన్, బైలివర్డిన్, యూరోక్రోమ్**
5. CO_2
6. ఎక్కువగా ఉన్న నీరు (H_2O)

నోట్ : విసర్జన ముఖ్య ఉద్దేశం - శరీర ద్రవాలను, అయాన్లను సమతుల్యపరచడం.

వ్యర్థపదార్థం	నీటిలభ్యత	జీవి రకం	జంతువులు
1) యూరియా	సాధారణ	యూరియోటెలిక్	వానపాము, సత్త, రొయ్య, మృదులాస్థి చేపలు, కప్ప, క్షీరదాలు etc.
2) యూరిక్ ఆమ్లం (తెలుపు వర్ణం)	నీటికొరత	యూరికోటెలిక్	కీటకాలు, క్రస్టేషియా, పక్షులు, బల్లులు పాములు etc.
3) అమ్మోనియా (విషతత్వం ఎక్కువ)	అధికం	అమ్మోనోటెలిక్	నీటిలోని అమీబా, క్రస్టేషియా, మొలస్కా అస్థిచేపలు, ఉభయచర చేపలు etc.
4) గ్వానిన్	నీటికొరత	గ్వానోటెలిక్	సాలెపురుగు

నోట్ : అధిక ప్రోటీన్ ఆహారం తీసుకుంటే అధిక యూరియా విసర్జన జరుగుతుంది. కారణం కాలేయంలో 'డీ అమైనేషన్' ప్రక్రియ జరుగుతుంది.

విసర్జక అవయవాలు	జంతువులు
1) సంకోచ రిక్తికలు (Contractile Vacuoles)	అమీబా, పేరామీషియం
2) జ్వాలాకణాలు (Flame Cells)	ప్లనేరియా, బద్దెపురుగు (Tape Worm)
3) నెఫ్రీడియా (or) వృక్కాలు	వానపాము, జలగ
4) హరిత గ్రంథులు (Green glands)	రొయ్యలు , పీతలు
5) మాల్ఫీజియన్ నాళికలు	కీటకాలు (బొద్దింక)
6) మూత్రపిండాలు (Kidneys)	చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు

నోట్ : 1. ప్రత్యేక విసర్జక అవయవాలు లోపించిన జీవుల సమూహం - 'ప్రోటోజోవా, పోరిఫెరా, సిలెంటిరేటా, ఇకైనోడర్మేటా.

2. లెపిస్మా (సిల్వర్ ఫిష్) అనే జీవి పాత కాలెండర్స్, ఫొటో ఫ్రేమ్‌ల కింద నివసించి, జీవితాంతం నీరు తాగని కీటకం.

✧ రక్తకేశనాళికలపై ఉండే సూక్ష్మరంధ్రాల ద్వారా మలినాలు కలిగిన నీరు రక్తం నుంచి భౌమన్ గుళికలలోకి వడపోయడాన్ని 'సూక్ష్మగాలనం' (అల్ట్రాఫిల్టరేషన్) అంటారు.
✧ నిమిషానికి సూక్ష్మగాలనం జరిగే నీటి పరిమాణం - **125 ఎంఎల్/మినిట్**
✧ రోజుకి సూక్ష్మగాలనం జరిగే నీటి పరిమాణం **- 175 లీటర్లు**
✧ రోజుకి బయటకు విసర్జించే మూత్రం **- 1.5 లీటర్లు**
✧ రోజుకి పున:శోషణకు గురయ్యే నీరు **- 175 - 1.5 లీటర్లు - 173.5 లీటర్లు**


మానవ విసర్జక వ్యవస్థ

1. జత మూత్రపిండాలు
2. జత మూత్రనాళాలు
3. మూత్రాశయం
4. ప్రశేకం అనే భాగాలు కలవు

✧ మూత్రాశయం పక్షులలో ఉండదు.

1. మూత్రపిండాలు : వీటి అధ్యయనం నెఫ్రాలజీ.

✧ పరిమాణం **: 150 - 170 గ్రా**
✧ పొడవు **: 10 సె.మీ (సెంటీమీటర్లు),** వెడల్పు **: 5-6 సె.మీ,** మందం **: 4 సె.మీ**
✧ ఉదర కుహరంలో చిక్కుడు గింజ ఆకారంలో శరీరకుడ్యానికి అతుక్కొని వెన్నెముకకు ఇరువైపులా అమరి ఉంటాయి.
✧ మూత్రపిండం వెలుపల కుంభాకారంగానూ, లోపలివైపు పుటాకారంగా ఉంటుంది.
✧ కుడి మూత్రపిండం ఎడమ కంటే కొంచెం కిందికి ఉంటుంది. కారణం కాలేయానికి స్థలాన్ని కల్పించడానికి.



✧ మూత్రపిండం వెలుపల భాగం ముదురు గోధుమవర్ణ వల్కలం, లోపలి భాగం లేతవర్ణం దవ్వ కలిగి ఉంటుంది.
✧ మూత్రపిండం పుటాకార భాగంలో పల్లపు ప్రాంతం, (నొక్కు) హైలస్ అంటారు. దీనిద్వారా వృక్కధమని లోనికి ప్రవేశిస్తుంది. వృక్కసిర, మూత్రనాళం వెలుపలికి వస్తాయి.
✧ శరీరంలోని వ్యర్థాలు ఆమ్లజని సహిత రక్తంతో కూడిన వృక్కధమని ద్వారా మూత్రపిండాన్ని చేరతాయి. ఆమ్లజని రహిత రక్తాన్ని వృక్కసిర సేకరిస్తుంది.
✧ మూత్రపిండం ద్రవ్య 9–12 వృక్క పిరమిడ్‌లు ఉంటాయి.
✧ ప్రతి మూత్ర పిండంలో సుమారు 1.3 నుంచి 1.8 మిలియన్ల (13 లేక 18 లక్షల) సూక్ష్మ వృక్కనాళాలు / నెఫ్రాన్స్ ఉంటాయి.
✧ విసర్జక వ్యవస్థలో నిర్మాణాత్మక క్రియాత్మక ప్రమాణాలు **- నెఫ్రాన్‌లు/ మూత్రనాళికలు**

1. మూత్రనాళిక : ప్రతి నెఫ్రాన్‌లో.. 1. మాల్ఫీజియన్ దేహం, 2. వృక్క నాళిక అనే భాగాలుంటాయి.
✧ మాల్ఫీజియన్ దేహంలో 1. భౌమన్ గుళిక, 2. గ్లోమరులస్/ రక్తకేశ నాళికగుచ్ఛం
✧ భౌమన్ గుళిక గిన్నె ఆకారంలో ఉండి, రెండు పలచని పొరలు కలిగి ఉంటాయి. వృక్క ధమని అనేక శాఖలుగా విడిపోయి, రక్తకేశ నాళిక గుచ్ఛం ఏర్పడుతుంది.

భౌమన్ గుళిక + గ్లోమరూలస్ = మాల్ఫీజియన్ గుళిక

✧ వృక్క నాళికలో మూడు భాగాలు 1. సమీపస్థ సంవళితనాళం (పిసిటి), 2. హెన్లీశిఖ్యం (యు ఆకారం), 3. దూరస్థ సంవళితనాళం ఉంటాయి.
✧ దూరస్థ సంవళిత నాళం, సంగ్రహణ నాళంలోనికి తెరుచుకుంటుంది.
✧ సంగ్రహణ నాళాలు పిరమిడ్‌లు, కెలిసెస్‌గా ఏర్పడి, ద్రోణి చివర మూత్రనాళంలోకి తెరుచుకుంటాయి.
✧ భౌమన్ గుళిక, గ్లోమరూలస్ సముద్ర చేపలలో, ఎడారి ఉభయజీవులలో ఉంటాయి.


2. మూత్రనాళాలు : హైలస్ నుంచి ఒక జత తెల్లని కండర మూతయైన సన్నని మూత్రనాళాలు బయటకు వస్తాయి.
✧ వాటి పొడవు 30 సెంటీమీటర్లు. అనేక సంగ్రహణ నాళాలు కలసి, రెండు మూత్రనాళాలు మూత్రాన్ని మూత్రాశయంలోకి పంపుతాయి.

3. మూత్రాశయం : బేరిపండు ఆకారంలో 300 – 800 మి.లీ మూత్రాన్ని నిల్వ చేసే సంచిలాంటి నిర్మాణం.

ప్రసేకం : ప్రసేకం మూత్రాన్ని బయటకి విసర్జించే నాళం.
✧ ప్రసేకం స్త్రీలలో నాలుగు సెంటీమీటర్లు పొడవు ఉంటుంది. దానిని ఆళిందం అంటారు.
✧ పురుషులలో 20 సెంటీమీటర్లు పొడవు ఉంటుంది. మూత్ర జననేంద్రియనాళంగా పిలువబడుతుంది.

మూత్ర రవాణా : భౌమన్ గుళిక → సమీప సంవలిత నాళం → 'యు' ఆకారపు హెన్లీ శిక్యం → దూరస్థ సంవలితనాళం → సంగ్రహణ నాళం → మూత్రనాళం → మూత్రాశయం → ప్రసేకం ద్వారా బయటికి.

మూత్రం (యురిన్) : నీటిలో కరిగిన మలినాలగల పదార్థం **'మూత్రం'**
✧ ఇది యూరోక్రోమ్ అనే వర్ణద్రవ్యం కలిగి ఉండటం వల్ల లేత పసుపు రంగులో ఉంటుంది.
✧ ఇది ఆమ్లస్థితిలో ఉంటుంది. (పిహెచ్ –4.8–7.5)
✧ దీనిలో నీటి శాతం 96%, మిగిలిన 4% వ్యర్థపదార్థాలు ఉంటాయి. వాటిలో 2% యూరియా, మిగిలిన 2% యూరిక్ ఆమ్లం, క్రియాటిన్, CO_2, నీటి ఆవిరి, లవణాలు ఉంటాయి.



✧ మూత్రంలో ఉండే పిండిపదార్థం **- గ్లూకోజ్**
✧ మూత్రం శరీరంలో ఎక్కువకాలం నిల్వ ఉంటే దానిలోని యూరియా అమ్మోనియా అనే విషపదార్థంగా మారుతుంది.

నోట్ : మూత్రవిసర్జన తర్వాత వాసనకు కారణం అమ్మోనియా
✧ టీ, కాఫీ, ఆల్కహాల్ ఎక్కువగా తాగినప్పుడు, తినే ఆహారం, వాతావరణ పరిస్థితులను బట్టి మూత్ర విసర్జన జరుగుతుంది.
✧ **ఇది గాఢతను బట్టి రెండు రకాలు..**

1. అధిక గాఢ మూత్రం (హైపర్‌టోనిక్)
2. అల్ప గాఢ మూత్రం (హైపోటోనిక్)

✧ క్షీరదాలు అధికగాఢ మూత్రాన్ని, పక్షులు, సరీసృపాలు అల్పగాఢతగల మూత్రం విసర్జిస్తాయి. (ఒంటెలో అధికగాఢత మూత్రం)

నోట్ : 1. సాలె పురుగు (స్పైడర్) విసర్జక పదార్థం **- గ్వానిన్**
2. సముద్రపక్షుల విసర్జక పదార్థం **- గ్వానా**
3. సముద్ర టీలియాస్టి చేపల విసర్జక పదార్థం **- ట్రైమిథైల్ ఎమైన్ ఆక్సైడ్ (టి.ఎం.ఓ)**
4. మృదులాస్థి చేపలు, ఇలాస్మోబ్రాంఖై చేపలు అధిక యూరియాను నిల్వచేసి, ద్రవాభిసరణను నియంత్రిస్తాయి.

మూత్రపిండాలలో రాళ్లు

✧ క్యాల్షియం పాస్ఫేట్, క్యాల్షియం ఆక్జలేట్, యూరిక్ ఆమ్లస్ఫటికలను **'కిడ్నీ స్టోన్స్'** అంటారు.
✧ వీటివల్ల మూత్రపిండాలలోని సున్నితమైన నెఫ్రాన్స్ నశిస్తాయి.
✧ 40 సంవత్సరాలు దాటిన తర్వాత ప్రతి సంవత్సరం 10% నెఫ్రాన్స్ నశిస్తాయి.

మూత్రం - ప్రత్యేక లక్షణాలు

1. అల్బుమిన్యూరియా **: మూత్రం ద్వారా ప్రోటీన్ల నష్టం**
2. హెమటూరియా **: మూత్రం ద్వారా రక్తం నష్టం**
3. కాల్‌కులి **: మూత్రం ద్వారా రాళ్లు నష్టం**
4. గ్లూకోసూరియా **: మూత్రం ద్వారా గ్లూకోజ్ నష్టం (డయాబెటిస్ మెల్లిటస్)**
5. పాలీయూరియా **: అధికమూత్ర ఉత్పత్తి**
6. డైయూరియా **: అధికమూత్ర విసర్జన (డయాబెటిస్ ఇన్సిపిడస్)**
7. ఎన్యూరియా **: మూత్రం ఉత్పత్తి జరగకపోవడం**
8. హెచ్.సి.సి /గ్రావిడెక్స్ పరీక్ష **: (హ్యూమన్ కార్యోనిక్ గొనాడోట్రోపిక్ హార్మోన్) ఇది స్త్రీల మూత్రంలో కనిపిస్తే వారిని ప్రెగ్నెంట్‌గా నిర్ధారించవచ్చు.**
9. ఆల్కాప్టోన్యూరియా **: మూత్రం విసర్జిస్తుండగా O_2 తో కలిసి నల్లగా మారడం. ఇది జన్యుసంబంధ వ్యాధి (జెనిటికల్ డిసీజ్)**

కృత్రిమ మూత్రపిండం (ఆర్టిఫీషియల్ కిడ్నీ) / డయాలసిస్

✧ దీన్ని మొదటగా తయారుచేసింది **- విలియం కోల్ఫ్ (1943, నెదర్లాండ్)**
✧ ఇది వ్యాపనం, సూక్ష్మ వడకట్టు పద్ధతి (ఆల్ట్రాఫిల్ట్రేషన్) సూత్రంపైన పనిచేస్తుంది.
✧ మూత్రపిండం పనిచేయని వ్యక్తులలో రక్తాన్ని డయలైజర్ యంత్రంలోని సెల్లోఫేన్ టేప్‌లోకి పంపించి లవణాలను, వ్యర్థపదార్థాలను వేరుచేస్తారు.
✧ నెఫ్రాన్స్ నశించడం వల్ల కలిగే వ్యాధి **- నెఫ్రైటిస్**

నోట్ : 1. జీవితాంతం నీటిని తాగని కీటకం **- లెపిస్మా (సిల్వర్ ఫిష్)**
2. మూత్రపిండాలు పూర్తిగా పనిచేయకపోయే లక్షణం **- ఎండ్ స్టేజ్ రీనల్ డిసీజ్ (ఇఎస్ఆర్‌డి)**
3. మూత్రపిండాలు నీరు, వ్యర్థాలతో నిండిపోవడం **- యూరేమియా**
4. కృత్రిమంగా రక్తం వడపోయడాన్ని **'హీమోడయాలసిస్'** అంటారు. దీనిలో ధమనిని **'సెల్లోఫేన్'**తో ఏర్పడిన 'డయలైజర్' అనే యంత్రంలోకి పంపి, రక్తంలోని వ్యర్థాలను వేరుచేస్తారు.
5. డయాలసిస్‌కు పట్టేకాలం **: 3 నుంచి 6 గంటలు**
6. ప్రపంచంలో మొదట **'మూత్రపిండ మార్పిడి'** చేసిన వ్యక్తి **- చార్లెస్ హాఫ్‌గనెల్ (1954 వాషింగ్టన్)** ★

పదార్థం	పిహెచ్	పదార్థం	పిహెచ్
మూత్రం	4.8–7.5	జీర్ణాశయం HCl	2.0
లాలాజలం	6.8–7.4	బత్తాయి	3.5
పైత్యరసం	6.8	సోడా	5.5
రక్తం	7.4	ద్రాక్ష	3.2
ఆమ్లవర్షాలు	2.4	నిమ్మ	2–3.0
మంచినీరు	7.0	ఎసిటిక్ ఆమ్లం	3.0
సముద్రనీరు	7.8		
వర్షపునీరు	5.6		

నీరవ్ మోడీపై ప్రియాంక దావా

- బాధ్యులను ఎవరినీ వదలం
- పిఎన్‌బి సిఇఒ సునీల్ మెహతా
- భారీగా పడిపోయిన పిఎన్‌బి షేర్లు
- అభరణాల కంపెనీల సూచీలు పతనం

న్యూఢిల్లీ : ప్రముఖ వజ్రాల వ్యాపారీ, పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)కి కుచ్చుటోపి పెట్టిన నీరవ్ మోడీపై బాలీవుడ్ నటీ ప్రియాంక చోప్రా కేసు పెట్టింది. తాను ఆ కంపెనీ ప్రకటనల కోసం నటించిన దానికి పరితోషికం చెల్లించలేదని ఈ దావాల్లో ఆమె పేర్కొంది. నీరవ్‌కు చెందిన డైమండ్ బ్రాండ్‌కు ప్రియాంక చోప్రా బ్రాండ్ అంబాసీడర్‌గా వ్యవహరిస్తోంది. కొన్ని మాసాల క్రితమే బాలీవుడ్ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ప్రియాంక ఆ కంపెనీ ప్రకటనల్లో నటించింది. కాగా ఈ ప్రకటనలో భాగంగా నీరవ్ తనకు ఇవ్వాల్సిన పారితోషికం ఎగ్గొట్టాడని చోప్రా ఆరోపించింది. సిద్ధార్థ్‌కి కూడా నీరవ్ బాకీ ఉన్నట్లు బాలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రియాంక చోప్రా గత జనవరిలో నీరవ్ డైమాండ్ బ్రాండ్‌కు ప్రచారం చేస్తూ నీరవ్‌తో కలిసి పనిచేస్తుంటే తమ ఇద్దరి ఆలోచనలు కలిసి నట్లుగా ఉందని పేర్కొంది. నీరవ్ డిజైన్ చేసే వజ్రాభ రణాలు అద్భుతంగా ఉంటాయని ప్రశంసించింది. నీరవ్ కుంభకోణం భయటపడటంతో ప్రస్తుతం పరిస్థితి తారుమారైనట్లు కనిపిస్తోంది.

రూ.8,100 కోట్లు ఆవిరి..

కేవలం రెండు సెషన్లలోనే పిఎన్‌బి మదుపర్లు రూ.8100 కోట్ల విలువ కోల్పోయారు. ఈ బ్యాంకులో నీరవ్ మోడీ రూ.11,300 కోట్ల పైగా అక్రమ లావాదేవీలకు పాల్పడటం, ఆ తర్వాత జరుగుతున్న పరిణామాల వల్ల గురువారం కూడా షేర్ అమాంతం పడిపోయింది.

రెండో రోజు బిఎస్ఇలో పిఎన్‌బి షేర్ 11.97 శాతం పతనమై రూ.128.35కు దిగజారింది. ఇంతక్రితం సెషన్‌లో కూడా 9 శాతం నష్టపోయింది. రెండు రోజుల్లో 21 శాతం పడిపో యింది. పిఎన్‌బిలో ప్రభుత్వానికి 57 శాతం, ఎల్ఐసికి 14 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి.

అభరణాల సూచీలపై ఒత్తిడి

GITANJALI
TRUST FOREVER

పిఎన్‌బి కుంభకోణంలో ఇతర అభరణాల కంపెనీలకు కూడా భాగస్వామ్యం ఉండచ్చొన్న ఊహాగానాల్లో ఆ రంగం సూచీలు తీవ్రంగా నష్టపోయాయి. ముఖ్యంగా నీరవ్ మోడీ భారత భాగస్వామి గీతాంజలి జెమ్స్ స్టాక్స్ ఏకంగా 19 శాతం పతనమయ్యాయి. పిసి జ్యువెల్లర్స్ 4.65 శాతం తగ్గి రూ.358.60 వద్ద ముగిసింది. ఓ దశలో ఈ సూచీ 19 శాతం క్షీణించి రూ.302కు పడిపోయింది. త్రిబోవన్‌దాస్ బీమ్‌జీ జవేరీ సూచీ 2.43 శాతం తగ్గి రూ.112.55 వద్ద ముగిసింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఈ సూచీ రూ.110కు పడిపోయింది. రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ 2.08 శాతం తగ్గి రూ.802.20కు దిగజారింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఈ సూచీ కూ.798 వద్ద నమోదయ్యింది. గీతాంజలి జ్యువెల్లర్స్ సూచీ 18.94 శాతం పతనమై రూ.47.50 వద్ద ముగిసింది. ఇంట్రాట్రే డింగ్‌లో రూ.46.80– రూ.52.80 మధ్య కదలాడింది.

అత్యంత విలువైన కంపెనీ 'ఆపిల్'



న్యూయార్క్ : ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ ఆపిల్ నిలిచింది. న్యూయార్క్ పోస్టు రిపోర్ట్ ప్రకారం దీని మార్కెట్ విలువ 849.2 బిలియన్ డాలర్లు ఉంది. ఇక రెండో స్థానంలో గూగుల్ మాతసంస్థ అల్ఫాబెట్ 745.1 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కలిగి ఉంది. ఇక అమెజాన్ 702.5 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో నిలిచింది. గతంలో మూడో స్థానంలో ఉన్న మైక్రోసాఫ్ట్ నాలుగో స్థానానికి పడిపోయింది. ఆ కంపెనీ మార్కెట్ విలువ రూ.699.2 బిలియన్ డాలర్లుగా ఉంది. కాగా ఫేస్‌బుక్ 521.5 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచింది.

తొలిసారిగా మైక్రోసాఫ్ట్ కంపెనీని ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ అధిగమించింది.

పెరిగిన వాణిజ్య లోటు



న్యూఢిల్లీ : భారత వాణిజ్య లోటు క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది జనవరిలో ఈ లోటు 16.30 బిలియన్ డాలర్లగా నమోదయ్యింది. గతేడాది ఇదే మాసంలో ఈ లోటు 9.9 బిలి యన్ డాలర్లుగా ఉంది. 2017 డిసెంబర్‌లో వాణిజ్య లోటు 14.88 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. గత జనవరి ఎగుమతుల్లో 9 శాతం పెరుగుదల ఉంది. గతేడాది ఆగస్టు నుంచి ఎగుమతులు కొంత సానుకూలంగా పెరుగుతున్నాయి. 2017–18 ఏప్రిల్ నుంచి జనవరి కాలంలో మొత్తం ఎగుమతులు 11.75 శాతం పెరిగి 247.89 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ ఎగుమతులు 221.82 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. గత పది నెలల కాలంలో భారత దిగుమతులు 22.21 శాతం పెరిగి 379 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో ఈ కాలంలో వాణిజ్య లోటు 131.15 బిలియన్ డాలర్లకు ఎగిసింది.

జిజిహెచ్ వద్ద వైసిపి ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

గుంటూరు జిజిహెచ్‌లో కనీసం సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రిలో అధికారులు, వైద్యుల నిర్లక్ష్యంతో ప్రతిష్ట మసకబారుతోందని ఆరోపించారు. తూర్పు నియోజకవర్గంలో వైసిపి గెలవడంతో కనీస వసతులు కూడా కల్పించడం లేదని చెప్పారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్లలో బల్బులు ఏర్పాటు చేయలేని ప్రభుత్వం ఎందుకుందని ప్రశ్నించారు. అతి ముఖ్యమైన ఆపరేషన్ థియేటర్‌లో సౌకర్యాలు కల్పించలేని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజునాయుడుపై అసహనం వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో ఆపరేషన్ చేయాల్సిన దుస్థితి పట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని తెలిపారు.



ధర్నా

రైల్వేలో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద గురువారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ప్రపంచ బ్యాంకు తొత్తులుగా ప్రభుత్వాలు

ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. రైల్వేలో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద గురువారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమానుద్దేశించి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో కోట్లాది మంది నిరుద్యోగులున్నారని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఎన్నికలకు ముందు యువతకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కాయన్నారు. విభజన చట్టంలో పేర్కొన్నట్లు రైల్వే జోన్ ప్రకటించకుండా నాలుగేళ్లుగా ఊరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు పాల్గొని మాట్లాడారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల ధర్నా

ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైమ్ కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద ఉద్యోగులు చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్‌లో క్రాఫ్ట్, డ్రాయింగ్, ఒకేషనల్, మ్యూజిక్, పిఇటి తదితర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ పేరుకి పార్ట్‌టైమ్ అని చెబుతూ ఫుల్ టైమ్ పని చేయిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతులను తక్షణమే రద్దు చేసి రెగ్యులర్ చేయాలన్నారు.

ప్రజాశక్తి విలేకరిపై విహెచ్‌పి కార్యకర్తల దాడి

ప్రజాశక్తి - పోలవరం

పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం పట్టిసీమలో గురువారం నాడు కొందరు విహెచ్‌పి కార్యకర్తలు ప్రజాశక్తి విలేకరి ఆదిశేషుపై దాడి చేశారు. పట్టిసీమ ఫెర్రీ రేవులోని రామకష్ణ గీతాశ్రమం కొంతకాలంగా వివాదాల్లో ఉంది. ఈ ఆశ్రమాన్ని విహెచ్‌పి కార్యకర్తలు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీనిపై ఆశ్రమ నిర్వాహకురాలు నందుల స్వరాజ్యలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. అయితే గురువారం విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యకర్తలు, స్థానికులు విజయవాడ నుంచి వచ్చిన స్వామీజీలతో ఆశ్రమంలో శాంతిహోమం నిర్వహించారు. ఆ కార్యక్రమం అనంతరం నిర్వాహకురాలు స్వరాజ్యలక్ష్మిని ఆశ్రమం విడిచివెళ్లాలని, ఈ ఆశ్రమం విశ్వహిందూ పరిషత్‌కు రిజిస్టర్ అయిందని విహెచ్‌పి కార్యకర్తలు వాగ్వివాదానికి దిగారు. ఈ సంఘటనను ఫొటోలు తీస్తున్న ప్రజాశక్తి విలేకరి ఆదిశేషుపై కొందరు విహెచ్‌పి కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఫోన్ లాక్కుని పగలగొట్టారు. సహచర విలేకరుల జోక్యంతో విహెచ్‌పి కార్యకర్తలు అక్కడ నుంచి జారుకున్నారు. ప్రజాశక్తి విలేకరిపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక విలేకరులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఎస్‌పి దృష్టికి తీసుకెళ్తామని స్థానిక ప్రెస్‌క్లబ్ నాయకులు తెలిపారు.

దళితుల భూమిని వారికే అప్పగించాలి

సిపిఎం, వ్యకాస ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణా)

దళితుల భూములను స్వాధీనం చేసుకోవాలని, భూస్వాములు అనేక విధాలుగా కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌సిపి.రెడ్డి అన్నారు. గురువారం కృష్ణాజిల్లా గుడివాడ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇలపర్రు సొసైటీ భూములను దళితులకు అప్పగించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నందివాడ మండలం ఇలపర్రులో దళితులు, పేదల భూములంటే చులకనగా మారాయని, వాటిని ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్న వారి ఆటలు ఇక సాగవన్నారు. దళితులు, సొసైటీ సభ్యులు ఆందోళనతో 70 ఎకరాల వివాదాస్పద చెరువును ఎండగట్టారన్నారు. భూమి దళితులకు చెందుతుందని రికార్డులన్నీ స్పష్టం చేస్తున్నా రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి రెవెన్యూ యంత్రాంగం కిమ్మనకుండా ఉండిపోతున్నారని విమర్శించారు.

ట్రాక్టర్ బోల్తా..

కడప: కడప జిల్లాలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వేంపల్లి మండలం నందిపల్లి గ్రామం వద్ద ట్రాక్టర్ ను ఆర్టీసి బస్సు ఢీకొన్నది. ట్రాక్టర్‌ను ఆర్టీసి బస్సు వెనుకవైపు నుంచి ఢీకొట్టడంతో ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

దళితుల శిరోముండనం కేసు తారుమారుకు యత్నం

- బాధితుల కులమతాల మార్పునకు యత్నాలు?
- కేసు నిర్వీర్యం చేసేందుకు యత్నాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రోహిత్ వేముల మృతి కేసులో కులాన్ని మార్చేసి నీరుగార్చిన ఘటన తరహాలో మరో సంఘటనను పునరావృతం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో దళిత యువకులకు శిరోముండనం చేసిన కేసును కూడా ఆ తరహాలోనే తారుమారు చేసేందుకు కుట్ర జరుగుతోంది. బాధితుల కులమతాలను మార్చేసి శిరోముండనం కేసును కూడా తప్పుదోవ పట్టించేందుకు నిందితులు, అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం వెంకటాయపాలెంలో 1996లో దళితులను శిరోముండనం చేసిన ఘటన సంచలనం కలిగించింది. దళిత యువకులను అప్పటి రామచంద్రపురం ఎంఎల్‌ఎ తోట త్రిమూర్తులు శిరోముండనం చేయించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో 87 రోజులపాటు ఆయన రిమాండ్‌లో ఉన్నారు. అప్పటినుంచీ ఈ కేసు విచారణలోనే ఉంది. నేటికి 22 ఏళ్లు గడుస్తున్నా బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వారికి న్యాయం దక్కలేదు సరికదా ఇప్పుడు కొత్తగా బాధితుల కులమతాల వివాదం సృష్టించారు. రోహిత్ వేముల మృతి ఘటనలో కులాన్ని మార్చేసినట్లుగానే శిరోముండనం కేసులో కూడా బాధితుల కులమతాలను తారుమారు చేసేందుకు కుతంత్రాలు చేస్తున్నారు. దీనిలో అధికార యంత్రాంగాన్ని కూడా ఎంఎల్‌ఎ త్రిమూర్తులు వాడుకుంటూ కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు బాధితులు ఆక్రోశిస్తున్నారు బాధితులు ఎస్‌సి కాదని, వారు క్రైస్తవులని సృష్టించేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. 1996లోనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుగా నమోదు చేసి తోట త్రిమూర్తులుకు రిమాండ్ విధించారు. కానీ ఆయన తన అధికార బలాన్ని వినియోగించుకుని కేసు విచారణ సజావుగా సాగకుండా అడ్డుకుంటూ వచ్చారు. చివరికి ప్రస్తుతం కేసు చివరి దశకు వచ్చిన తర్వాత బాధితులు ఎస్‌సి కాదని, హిందూ మతానికి చెందారనే కొత్త వివాదాన్ని తెరమీదకు తెస్తున్నారు.

తప్పుడు సాక్ష్యాలు, వాంగ్మూలాలు

బాధితులను ఇరుకున పెట్టి వీరు ఎస్‌సి కాదని, హిందువులని నిరూపించేందుకు దొంగ సాక్ష్యాలను, తప్పుడు వాంగ్మూలాలను సృష్టించారు. వెంకటాయపాలెంలో లేని ఒక చర్చిని, ఒక పాస్టర్‌ను సృష్టించి అధికారులకు తప్పుడు సాక్ష్యాలను అందించి కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏసు ప్రేమాలయం అనే చర్చితోపాటు పాస్టర్ సాల్మన్ రాజు అనే పాస్టర్ లేకున్నా అధికారులకు తప్పుడు ఫిర్యాదులు పెట్టించారు. స్థానిక రెవెన్యూ అధికారులతోపాటు జాయింట్ కలెక్టర్‌కు కూడా దీనిపై ఎస్‌సిలతోనే బాధితులపై ఫిర్యాదులు చేయించి కేసును తాత్సారం చేయిస్తున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే రెండు నెలలుగా జాయింట్ కలెక్టర్ వద్ద ఈ కేసు విచారణలో ఉంది. ఇప్పటికే ఐదుసార్లు వాయిదాలు వేయించి కాలయాపన చేస్తున్నారు. మరోవైపు బాధితులే ఈ ఫిర్యాదులపై నిరూపణ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ మల్లికార్జున బాధితులకు చెప్పడం చూస్తుంటే అధికార పార్టీకి అధికారులు దాసోహమైనట్లు నిరూపితమౌతోందని దళిత సంఘాల నాయకులు అంటున్నారు. వాస్తవానికి బాధితులు హిందూ మతానికి చెందిన వారుగా, ఎస్‌సిలుగా సంబంధిత అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందుతూనే ఉన్నా తప్పుడు ఫిర్యాదులతో స్థానిక రెవెన్యూ అధికారులు కూడా నిందితుడికి అనుకూలంగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం పట్ల వ్యతిరేకత వ్యక్తమౌతోంది.

దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

దళితులను శిరోముండనం చేసిన కేసులో ఎంఎల్‌ఎ తోట త్రిమూర్తులుకు శిక్ష పడాల్సిందే. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం. బాధితులను భయభ్రాంతులను చేస్తూ కేసులో విచారణ పూర్తి కాకుండా అడ్డుకుంటున్న నిందితుడిని అరెస్ట్ చేయాలి. అప్పుడే ఈ కేసు విచారణ ముందుకు సాగుతుంది. బాధితుల కులమతాల వివాదాన్ని అధికారులు వెంటనే పరిష్కరించకపోతే తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది.

- కెఎస్ శ్రీనివాస్, సిపిఎం తూర్పు గోదావరి జిల్లా (కాకినాడ) కమిటీ కార్యదర్శి



ఢిల్లీ మెడలు వంచైనా హోదా సాధించుకోవాలి

మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్ (విశాఖ)

ఢిల్లీ మెడలు వంచైనా ప్రత్యేక హోదా సాధించుకోవాల్సిన అవరసం ఎంతైనా ఉందని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ అన్నారు. విశాఖ జిల్లా నర్సీపట్నం కెఎన్‌ఆర్ లాడ్జి ప్రాంగణంలో గురువారం విద్యార్థులతో నిర్వహించిన జనఘోష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విభజన చేసి కట్టుబట్టలతో రాష్ట్రాన్ని బయటకు పంపించారని, ఇందుకు సిపిఎం తప్ప అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాయని చెప్పారు. విభజన సమయంలో పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాట మరిచిందని విమర్శించారు. ప్రస్తుతం పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రత్యేక హోదా కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధి చెందడంతోపాటు పరిశ్రమలు భారీ ఎత్తున వస్తాయని చెప్పారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. మోడీ ప్రత్యేక హోదా విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. విద్యార్థులు, కార్మిక సంఘాలు, వ్యాపార సంఘాలు ప్రత్యేక హోదా కోసం ఉద్యమించాలన్నారు. వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్సీ డివి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా ఇవ్వకుంటే

23న దళితుల ఆత్మగౌరవ సభకు మద్దతుగా ధర్నాలు

సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో పలుచోట్ల ధర్నాలు, సమావేశాలు

ప్రజాశక్తి - తెనాలి/నరసరావుపేట (గుంటూరు)

పెదగొట్టిపాడు దళితులపై దాడులకు నిరసనగా ఈ నెల 23న గుంటూరులో దళితుల ఆత్మగౌరవ సభ జరగనున్న నేపథ్యంలో మద్దతుగా గుంటూరు జిల్లాలో పలుచోట్ల పెదగొట్టిపాడు దళిత బాధితుల సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. తెనాలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళనలో సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సంఘీభావ కమిటీ కన్వీనర్ శాంతకుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజి ప్రసంగించారు. దళితులపై దాడికి పాల్పడిన నిందితులు ఆలపాటి పాండు, చంటి, ఉపేంద్ర, మారెళ్ళ భాస్కరరావును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాములు గ్రామాన్ని సందర్శించి, వాస్తవాలు తెలుసుకుని, దాడులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని, బాధితులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని చెప్పినా నేటికీ అధికారుల్లో స్పందనలేదన్నారు. ఘటన జరిగి 45 రోజులైనా పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోవటం దారుణమన్నారు. నరసరావుపేట ఏంజెల్ టాకీస్ వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్య పాల్గొన్నారు. దాడిచేసిన వారికి అండగా మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎస్పీ, కలెక్టర్ నిలవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దళితుల కోసం ఎన్ని చట్టాలు చేసినా వాటిని నీరు కార్చేందుకు ప్రభుత్వ ప్రతినిధులే నిలబడటం శోచనీయమన్నారు. బాపట్ల సుందరయ్య భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు చేగూడి బాబురావు మాట్లాడారు.



తెనాలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ప్రజాసంఘాలు నిరసన

దళిత, గిరిజనులపై పెరుగుతున్న దాడులు

కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేశ వ్యాప్తంగా గిరిజనులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. దాడులపై పాలక ప్రభుత్వాలు మాత్రం ప్రేక్షకపాత్ర వహించడం తగదన్నారు. దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆయా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డిహెచ్‌పిఎస్ నాయకులు మహేశ్ అధ్యక్షత జరిగిన ధర్నాలో వైసిపి ఎస్‌సిసెల్ నాయకులు మద్దయ్య, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ నాయకులు నాగర్జున, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు, పిఒపి, ఆర్టీఐ, వ్యకాసం, పిఎస్‌ఎం ప్రజాసంఘాల నాయకులు ఇమ్మానుయేల్, జయన్న, వెంకటరాముడు, గోవిందు, నాగరాజు, ఐద్వా నాయకులు ఉమా, సుజాత, మహిళ సమాఖ్య నాయకులు ధనలక్ష్మి, ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షులు సురేంద్రలు పాల్గొన్నారు. సిపిఎం, సిపిఐ రాష్ట్ర నాయకులు టి. షడ్రక్, కె. రామాంజనేయులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈనెల 23న గుంటూరులో సంఘీబావ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రకాశ్ అంబేద్కర్‌తోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఫిబ్రవరి 14న సూరత్‌ఘర్ (రాజస్తాన్)
2. న్యూఢిల్లీ (ఫిబ్రవరి 17- ఏప్రిల్ 8)
3. చంద్రశేఖర కంబార్
4. రచన, జర్నలిజం (మధ్యప్రదేశ్)
5. రేడియో ఉమాంగ్

సమ సమాజ స్థాపనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని శాసనసభ స్పీకర్ కోడెల పేర్కొన్నారు. అనంతపురం ఆర్కియాలజీ మ్యూజియం ప్రారంభంలో మాట్లాడారు.

సెమిస్టర్ ఫీజులు తగ్గించాలని విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - టెక్కలి (శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలో గల డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ పరీక్షల ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు గురువారం రోడ్డెక్కారు. టెక్కలి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆ కళాశాల నుంచి పాత జాతీయ రహదారి, అంబేద్కర్ కూడలి మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీలో ఫీజుల భారంతో చదువులు కష్టతరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో చదువు భారమని ప్రభుత్వ కళాశాలల్లో చేరితే, ఇక్కడా పరీక్ష ఫీజులు పెంచుతుండడం అన్యాయమన్నారు. కళాశాలలో తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. వీటిపై పలుమార్లు కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో సిఐటియు, మిత్రపక్షాలు విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన విజయోత్సవ సభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత వేగంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని చూస్తోందని విమర్శించారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా కార్మికవర్గం కదిలి ఐక్య ఉద్యమాలను నిర్మిస్తూ ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా ఉద్యమాలుగా మలచి వారి రాజకీయ మనుగడను ప్రశ్నించాలన్నారు. ఎన్నికల్లో ఉక్కు ఉద్యోగులు ఇచ్చిన తీర్పు మేరకు సంస్థ ప్రయివేటీకరణ కాకుండా సిఐటియు, మిత్రపక్షాలు కాపాడుకోవటంతోపాటు ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. ముఖ్యఅతిథి, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌డబ్ల్యుఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి పికె.దాస్ మాట్లాడుతూ.. నూతన వేతన ఒప్పందాలు చేయాల్సిందిపోయి కేంద్రం సతీష్‌చంద్ర కమిటీ సిఫార్సులకు అనుగుణంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతం పేరుతో ఉద్యోగుల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ వారి ఐక్యతను భంగం చేయాలని చూస్తోందని విమర్శించారు. ఉక్కు గుర్తింపు ఎన్నికల్లో ఉద్యోగుల తీర్పు ఐక్య ఉద్యమాలకు మరింత బలాన్ని ఇచ్చిందని అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తితో మెరుగైన వేతన ఒప్పందానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిఐటియు జాతీయ నాయకులు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖర్చును బట్టే నిధులు

మంత్రి యనమల స్పష్టీకరణ

ప్రారంభమైన బడ్జెట్ కసరత్తు సమావేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చేసిన ఖర్చును బట్టే కొత్త బడ్జెట్‌లో నిధులు కోరాలని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు. వివిధ శాఖలకు బడ్జెట్ అవసరాలపై ఆయన గురువారం నుంచి సమీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజే వ్యవసాయం, సంక్షేమ శాఖలపై ఆయా శాఖల మంత్రులు, అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అన్ని శాఖలకూ స్పష్టమైన సూచనలు చేశారు. 2017-18 బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో ఎంత ఖర్చు చేయగలిగారన్న దానికి అనుగుణంగానే కొత్త బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదించాలని తేల్చి చెప్పారు. భారీగా నిధులు కోరడం, తరువాత వాటిని ఖర్చు చేయలేకపోవడం అన్నది సరికాదన్నారు. అన్ని శాఖలు తప్పనిసరిగా వాస్తవ పరిస్థితులు, గత బడ్జెట్ ఖర్చుల ఆధారంగానే ప్రతిపాదనలు చేయాలని నిర్దేశించారు. అయితే అనేక మంది మంత్రులు తమకు ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేయడం, అంత ఇవ్వలేమంటూ ఆర్థికశాఖ అధికారులు చేతులెత్తేయడం జరిగింది.

వ్యవసాయం, అనుబంధ రంగాలపై జరిగిన చర్చలో గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఆదాయం పెరిగేలా బడ్జెట్ ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్ని పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయాలని సూచించారు. అనేక శాఖలు వారికి ఇచ్చిన నిధుల్ని ఖర్చు చేయకుండానే అదనపు నిధులు అడుగుతున్నారని, ఇది బడ్జెట్ నిర్వహణ ప్రక్రియకు విరుద్ధమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక విధానాల్ని అవలంబిస్తున్నామని, అందుకే ఎక్కువ నిధులు ఇవ్వాలని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి కోరారు. తమ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్ని కూడా భర్తీ చేయాలని కోరారు. అలాగే మెట్రో రైల్ పథకాలు, రాజధాని నిర్మాణం, పట్టణ గృహ నిర్మాణాల కోసం గతేడాది కన్నా ఎక్కువ నిధులు కేటాయించాలని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీలు, భూగర్భ డ్రైనేజీ విధానం, అన్న కాంటీన్లు వంటి వాటికి కూడా నిధులు కేటాయించాలని ఆ శాఖ అధికారులు కోరారు.

ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం

భోపాల్ గ్యాస్ బాధితుల నిర్ణయం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో త్వరలో జరిగే రెండు అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ, వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని భోపాల్ గ్యాస్ దుర్ఘటన బాధితులు ప్రకటించారు. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన పారిశ్రామిక ప్రమాదంలో బాధితులైన తమను ఆదుకోవడంలో అధికార పార్టీ తీవ్రంగా విఫలమైందని వారు విమర్శించారు. బాధితులు తరపున ఐదు సంస్థలు పోరాటం చేస్తున్నాయి. ఈ సంస్థల ఆధ్వర్యంలో గురువారం బాధితులు విలేకరులుతో మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని, వైద్య సహాయం చేస్తామని, పరిహారం చెల్లిస్తామని బిజెపి వాగ్దానం చేసిందని, దాన్ని నిలబెట్టుకోలేదని విమర్శించారు. దీనికి నిరసనగా ఉప ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ ఏడాదిలో మధ్యప్రదేశ్‌లోని ముంగోలి, కోలారస్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగున్నాయి.

దేవీప్రియకు అభినందన



కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత దేవీప్రియను అభినందిస్తున్న కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రముఖ కవి కె శివారెడ్డి, వాసిరెడ్డి నవీన్ ప్రభృతులు. న్యూఢిల్లీలోని ఆంధ్రా, తెలంగాణ భవన్‌లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది.

ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిన యుపిఎ

ప్రధాని మోడీ ఆరోపణ

ఇటానగర్ : ఈశాన్య ప్రాంతాన్ని యుపిఎ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. కానీ తమ ప్రభుత్వం ఆ ప్రాంతానికి చాలా ప్రాధాన్యత ఇచ్చిందని, మంత్రులు, సీనియర్ అధికారులు క్రమం తప్పకుండా ఆ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారని చెప్పారు. టోమో రిబా ఆరోగ్య, వైద్య విజ్ఞాన సంస్థకు శంకుస్థాపన చేసిన అనంతరం ఇక్కడ ఇందిరా గాంధీ పార్క్‌లో మోడీ ప్రసంగించారు. ఇప్పటివరకు వారానికోసారి నడుస్తున్న అరుణాచల్ నహర్లాగూన్-న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ఇకపై వారానికి రెండుసార్లు నడుస్తుందని, పైగా దాన్ని అరుణాచల్ ప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలుస్తారని మోడీ ప్రకటించారు. ఈ ప్రాంత ప్రాధాన్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ముఖ్యమైన సమావేశాలన్నీ కూడా కేవలం దేశ రాజధానిలో జరగరాదని అన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ జరగాలని పేర్కొన్నారు. అందుకే ఈశాన్య మండలి సమావేశానికి తాము షిల్లాంగ్‌కు వచ్చామని చెప్పారు. వ్యవసాయానికి సంబంధించిన సమావేశం సిక్కింలో జరిగిందన్నారు. పనిభారం వుందనే సాకుతో మాజీ ప్రధాని ఈ రాష్ట్రాన్ని సందర్శించలేదని పరోక్షంగా మన్మోహన్ సింగ్‌ను ప్రస్తావిస్తూ అన్నారు. కానీ 'మిమ్మల్ని కలవకుండా వుండలేనటువంటి ప్రధానిని నేను' అని ఆయన వ్యాఖ్యానించారు. మూడేళ్ళ వ్యవధిలో అరుణాచల్‌లో మోడీ రెండవ పర్యటన ఇది. అరుణాచల్ ప్రజల దేశభక్తిని ప్రధాని అభినందించారు.

దేశంలోనే సీనియర్ ఎమ్మెల్యే.. ఆస్తి మాత్రం రూ.1218

- మాణిక్ సర్కార్ కన్నా నిరుపేద నిరజయ్
- త్రిపుర బరిలో సిపిఎం నుంచి మరో ఆదర్శ నేత



అగర్తలా : జీవించివున్న ప్రజాప్రతినిధుల్లో దేశంలోనే ఆయన అత్యధిక వయస్సున్న ప్రజాప్రతినిధి. 90వ పడిలోనూ ప్రజాసంక్షేమమే ఆయన పరమావధి. త్రిపుర ఎన్నికలలో ధలాయ్ జిల్లా చవమను నియోజక వర్గం నుంచి పోటీ చేస్తున్న సిపిఐ(ఎం) అభ్యర్థి నిరజయ్ త్రిపుర ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కన్నా తక్కువ నగదు కలిగి ఉన్నారు. ఆయన బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తం కేవలం రూ.1,218 మాత్రమే. ఇది మాణిక్ సర్కార్ ఖాతాలో ఉన్న దానికన్నా రూ.302 తక్కువ. ఈ విషయాన్ని ఆయన తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అంతేగాకుండా ఆయన దేశంలోనే అత్యంత వయోధికుడైన శాసన సభ్యుడు కావడం విశేషం. ఈ ఎన్నికల్లో తన నియోజక వర్గం నుంచి మూడోసారి విజయం సాధించాలనుకుంటున్నాడు. "నేను నా నియోజక వర్గ ప్రజల కోసం జీవిస్తున్నాను. నేను వారి కోసం మరణిస్తాను. దానికి ముందే నేను పాన్ కార్డు పొందాలనుకుంటున్నాను. అత్యంత వయోధికుడైన శాసన సభ్యుడిగా రికార్డు బ్రేక్ చేయాలనుకుంటున్నాను." అని త్రిపుర చెప్పారు. ప్రస్తుతం ఈ రికార్డును మణిపూర్‌కు చెందిన రిషాంగ్ కేషింగ్ అనే రాజ్యసభ సభ్యుడు సొంతం చేసుకు న్నారు. ఆయన వయస్సు 94 ఏళ్ళ సంవత్సరాలు. అయితే కేషింగ్ గత ఏడాది ఆగస్టులో మరణించారు. ఎమ్మెల్యేగా త్రిపుర రూ.55,170లు అలవెన్సులు అందుకుంటున్నారు. అవి మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. అందుకుగాను త్రిపురకు పాన్ కార్డు అవసరం ఏర్పడింది. "నాకు అలవెన్సులుగా వచ్చేదంతా అవసరం లేదు. నా నెలవారి వేతనం రూ.14 వేలు నాకు సరిపోతుంది. నా నియోజక వర్గంలో అవసరమైన వారు చాలా మంది ఉన్నారు. అలవెన్సుల మొత్తం వారికి ఉపయోగపడుతుంది." అని ఆయన చెప్పారు. త్రిపుర ఒక పూరింటిలో నివసిస్తున్నారు. ఆయనకు టెలివిజన్ కూడా లేదు. ఆయన భార్య కొన్నేళ్ళ క్రితం మరణించారు. త్రిపురకు కుమార్తె ఉన్నారు. నాలుగు కుర్చీలు, ఒక మంచం, ఒక టేబుల్, కొన్ని వాయిద్య పరికరాలు మాత్రమే ఆయన తన ఆస్తులు.

నాలుగేళ్లలో 22,743 కోట్ల నష్టం

అక్రమ లావాదేవీలతో పిఎస్‌బిలకు భారీ నష్టం

న్యూఢిల్లీ : 2012 నుంచి 2016 వరకు లావాదేవీల్లో జరిగిన మోసాల వల్ల ప్రభుత్వరంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) రూ.22,743 కోట్లమేర మోసపోయినట్టు బెంగళూరులోని ఐఐఎం నిర్వహించిన అధ్యయనంలో తేలింది. 2016 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ప్రభుత్వ, ప్రయివేట్ బ్యాంకులకు సంబంధించి 3,879 మోసం కేసులు నమోదు కాగా, రూ.17,750 కోట్ల నష్టం జరిగినట్టు (450మంది బ్యాంక్ ఉద్యోగులు ఇచ్చిన సమాచారంతో) మరో అధ్యనంలో తేలింది. బ్యాంకులను మోసగించిన కేసుల వివరాలను గతేడాది మార్చిలో ఆర్‌బీఐ కూడా వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం 2016-17 ఆర్థిక ఏడాదిలో మొదటి తొమ్మిది నెలల్లో రూ.లక్ష అంతకన్నా ఎక్కువ మొత్తంలో మోసపు లావాదేవీలకు సంబంధించి ఐసీఐసీఐ బ్యాంకులో 455 కేసులు, ఎస్‌బీఐలో 429 కేసులు, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌లో 244 కేసులు, హెచ్‌డీఎఫ్‌సీలో 237 కేసులు నమోదయ్యాయి. ఈ అక్రమ లావాదేవీలకు ఎస్‌బీఐకి చెందిన 64మంది, హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన 49మంది,యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన 35మంది ఉద్యోగులు సహకరించినట్టుగా గుర్తించారు. 2017లో డిసెంబర్ 21 వరకు ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా మోసాలకు సంబంధించి 25,800 కేసులు నమోదైనట్టు సమాచార సాంకేతికశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ రాజ్యసభకు రాతపూర్వకంగా తెలిపారు. గతేడాది ఈ కేసులకు సంబంధించి బ్యాంకులకు రూ.179 కోట్ల నష్టం జరిగినట్టు ఆయన తెలిపారు.

మహిళల రక్షణ పట్ల ప్రభుత్వాలకున్న శ్రద్ధ ఏపాటి..?

- నిర్భయ నిధిపై మధ్యప్రదేశ్ అఫిడవిట్ చూసి నివ్వెరపోయిన సుప్రీంకోర్టు
- అత్యాచారానికి రూ.6500 చొప్పున విలువ కట్టారా అంటూ ఆగ్రహం
- వివరాలివ్వని రాష్ట్రాలపై ధర్మాసనం మండిపాటు



న్యూఢిల్లీ: అత్యాచారానికి రూ.6500 చొప్పున విలువ కట్టారా..? అంటూ మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. అత్యాచారానికి గురైన బాధితుల సహాయార్థం ఏర్పాటైన నిర్భయ పథకం అమలుకు సంబంధించి జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాతో కూడిన సుప్రీం ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. 2012, డిసెంబర్ 16న ఢిల్లీలో నిర్భయ ఘటన తర్వాత కేంద్రంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం 2013లో నిర్భయ నిధిని ఏర్పాటు చేసింది. దేశంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను నివారించేందుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదని తెలుపుతూ నిర్భయ సంఘటన తర్వాత ఆరు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు ఎప్పటికపుడు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలపై సమీక్షిస్తోంది.

నిర్భయ నిధి ద్వారా లైంగిక దాడులకు గురైన బాధితుల కోసం కేంద్రం నుంచి తీసుకున్నది, ఖర్చు చేసింది ఎంతో వివరాలు ఇవ్వాలంటూ ఈ ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మధ్యప్రదేశ్ తరపున సమర్పించిన అఫిడవిట్‌లో బాధితుల సంఖ్యను 1951గా, వారి కోసం ఖర్చు చేసింది రూ.కోటి మాత్రమేనని తెలపగా సుప్రీం ధర్మాసనం ఘాటుగా స్పందించింది. బాధితులకు రూ.6000, రూ.6500 చొప్పున ఇవ్వడానికి మీరేమైనా ధార్మిక సంస్థగా భావించుకుంటున్నారా అంటూ మధ్యప్రదేశ్ ప్రభుత్వ తీరు పట్ల ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇంకా అఫిడవిట్ దాఖలు చేయకపోవడంపై హర్యానా ప్రభుత్వంపైనా సుప్రీంకోర్టు మండిపడింది. మీరు వివరాలు ఇవ్వకపోతే మహిళల రక్షణ పట్ల మీ ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ ఏపాటిదో అర్థం కాగలదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మీకు కావాల్సినంత సమయం తీసుకోండి, మీ రక్షణ పట్ల మాకు బాధ్యత లేదని మీ రాష్ట్రంలోని మహిళలకు చెప్పండి అంటూ ధర్మాసనం దుయ్యబట్టింది. మేఘాలయ ప్రభుత్వం తమ రాష్ట్రంలో 48మంది బాధితులుండగా వారి కోసం రూ 30 లక్షల 55 వేలు ఖర్చు చేసినట్టు తెలిపింది. సుప్రీంకోర్టుకు ఇప్పటి వరకూ 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అఫిడవిట్లు దాఖలు చేయలేదు. దాంతో, మహిళల భద్రత పట్ల మీకు శ్రద్ధ ఉంటే మరో నాలుగు వారాల్లో అఫిడవిట్లు దాఖలు చేయాలంటూ రాష్ట్రాలకు సుప్రీంకోర్టు చురకలంటించింది.

భారత పర్యటనలో ఇరాన్ అధ్యక్షులు

నేడు మక్కా మసీదులో ప్రార్థనలు



ఇరాన్ అధ్యక్షులు హస్సాన్ రౌహాని స్వాగతం పలుకుతున్న గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్

హైదరాబాద్ : మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా ఇరాన్ అధ్యక్షులు హస్సాన్ రౌహాని గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇక్కడ బేగంపేట్ విమానాశ్రయంలో రౌహానికి కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి ఆర్‌కె సింగ్, తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ స్వాగతం పలికారు. నగరంలో ఆయన రెండు రోజులు పర్యటిస్తారు. శుక్రవారం మక్కా మసీద్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న తరువాత రౌహాని చారిత్రక కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 6:30 గంటలకు ముస్లిం మేధావులు, పండితులతో సమావేశంలో రౌహానీ పాల్గొంటారు. తరువాత న్యూఢిల్లీకి బయలుదేరి వెళతారు. శనివారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడితో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొంటారు. రౌహానీతో పాటు 21 మందితో కూడిన బృందం ఇరాన్ నుంచి భారత్‌కు వచ్చింది. కాగా, హైదరాబాద్‌ను సందర్శించడం రౌహానికి ఇది రెండోసారి. అయితే 2103లో అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత ఇక్కడకు రౌహానికి ఇదే మొదటిసారి. గత ఏడాది ఆయన రెండోసారి ఇరాన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రౌహానీ పర్యటన భారత్‌కు కీలకమైనదిగా భావిస్తున్నారు. భారత్‌కు ఆర్థికంగానూ, వ్యూహాత్మకంగానూ ప్రాముఖ్యత కలిగిన చబహార్ నౌకాశ్రయం తొలి దశను డిసెంబరులో ఇరాన్ ప్రారంభించింది. పాకిస్తాన్ ప్రమేయం లేకుండా ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియా దేశాలకు భారత నౌకలు పయనించడానికి చబహార్ నౌకాశ్రయం ఉపయోగపడుతుంది. దీంతో మధ్య ఆసియా దేశాలకు మన ఎగుమతులు సులభతరమవుతాయి. చబహార్ నౌకాశ్రయం ప్రారంభోత్సవంలోనూ రౌహానీ ఇదే విషయాన్ని తెలిపారు. అలాగే డిసెంబర్‌లో రష్యా పర్యటన నుంచి తిరిగి వస్తూ విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఇరాన్‌లో విరామం తీసుకున్నారు. ఆ దేశ మంత్రి జావద్ జారిఫ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనూ చబహార్ నౌకాశ్రయం గురించి చర్చించారు. గత నవంబర్‌లోనే చబహార్ రేవు ద్వారా మొదటిసారిగా ఆఫ్ఘనిస్తాన్‌కు గోధుమలను భారత్ సరఫరా చేసింది. భారత్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ దేశాల మధ్య రవాణాకు చబహార్ నౌకాశ్రయం కీలకంగా మారనుంది.

రాజకీయ ముసాయిదా.. ఎన్నికల పొత్తులు వేర్వేరు

- ఆయా రాష్ట్రాల్లో పరిస్థితుల బట్టి ఎన్నికల పొత్తులు
- దేశవ్యాప్త ఎన్నికల ఎత్తుగడలు సాధ్యం కాదు
- జాతీయ స్థాయిలో విస్తృత ప్రతిఘటనోద్యమం
- బిజెపి సర్కార్‌ను కూలదోయడమే ప్రధాన లక్ష్యం
- సిపిఐ రాజకీయ ముసాయిదా తీర్మానం విడుదల



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ ముసాయిదాకు, ఎన్నికల పొత్తులకు సంబంధం లేదని, ఆ రెండు వేర్వేరు అంశాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల్లో పరిస్థితుల బట్టి ఎన్నికల పొత్తులుం టాయని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఆరెస్సెస్ నేతృత్వం లోని బిజెపి ప్రభుత్వాన్ని కూలదోయడమే తమ లక్ష్యమని, అందుకు అనుగుణంగా తమ పార్టీ ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో వామపక్ష ఐక్యత, వామపక్ష ప్రత్యామ్నాయం అవసరమని తమ పార్టీ భావి స్తోందని ఆయన తెలిపారు. గురువారం నాడిక్కడ సిపిఐ కేంద్ర కార్యాలయం(అజయ్ భవన్)లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆ పార్టీ నేతలు గురుదాస్ గుప్తా, అతుల్ కుమార్ అంజాన్, డి.రాజా, కె.నారాయణ, అమర్ జిత్ కౌర్ లతో కలిసి సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఐ 23వ అఖిల భారత మహాసభల్లో ప్రవేశ పెట్టబోయే రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని విడు దల చేశారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ "హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ముసాయిదాను విడుదల చేశాం. ఈ ముసాయిదా తీర్మానం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ భాషల్లో కూడా అందుబాటులో ఉంటుంది. ముసాయిదా తీర్మానంపై పార్టీ సభ్యులు, సానుభూతి పరులు సూచనలు, సలహాలు ఇవ్వొచ్చు. రాజకీయ ముసాయిదాపై వచ్చిన సవరణలపై చర్చించి మహాసభల్లో ప్రవేశపెడతాం. పార్టీ అఖిల భారత మహాసభలు కేరళలోని కొల్లంలో ఏప్రిల్ 25 నుంచి 29 వరకు జరుగుతాయి" అని వెల్లడించారు.

'ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ పెత్తనం కోసం ఆర్థిక పెట్టుబడి చేసే వెంపర్లాటలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభానికి గురైంది. 2008లో ప్రారంభమైన సంక్షోభం ప్రస్తుతం కూడా అనేక దేశాల్లో కొనసాగుతోంది. ఆర్థిక సంక్షోభం ఫలితంగా వివిధ దేశాల్లో ఉత్పత్తి రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఇప్పటికి కూడా అనేక దేశాలు ఆర్థిక స్తబ్దత నుంచి బయట పడలేకపోయాయి. చాలా దేశాల్లో నిరుద్యోగ సమస్య కొనసాగుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్పొరేట్ల మాత్రం తమ లాభాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులను అనేక చోట్ల మితవాదులు అవకాశంగా తీసుకుంటున్నారు. ప్రపంచంలో వివిధ దేశాల్లో మితవాద శక్తులు, ఫాసిస్టు అనుకూల శక్తులు గతం కంటే ఎక్కువ ప్రభావం చూపడం పట్ల సిపిఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దానికి వ్యతిరేకంగా ప్రతిఘటన ఉద్యమాలు కూడా లాటిన్ అమెరికా, యూరోపియన్ దేశాల్లో పెరుగుతున్న విషయం వాస్తవం. మితవాద, ఫాసిస్టు అనుకూల శక్తుల ప్రాబల్యాన్ని గుర్తించి ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు.

'గత ఎన్నికల్లో ఒక బూర్జువా పార్టీ నుంచి మరొక బూర్జువా పార్టీకి రాజ్యాధికారం బదిలీ అయింది. అంతేకాకుండా దేశంలో అత్యంత మితవాద, ఫాసిస్టు అనుకూల, కార్పొరేట్, మతోన్మాద ప్రభుత్వం ఏర్పడిందని గత పాండిచ్చేరి మహాసభలో తమ పార్టీ నొక్కిచెప్పింది. గడిచి మూడున్నర ఏళ్లలో దేశ వ్యాప్తంగా జరిగిన పరిణామాలు తమ నిర్ణయం సరైందేనని తెలుపుతున్నాయి. ఆర్థిక రంగంలో నయా ఉదారవాద విధానాలను సంపూర్ణంగా కొనసాగించేందుకు మోడీ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోంది. మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు, దేశాన్ని, ప్రజల్ని విడగొట్టేందుకు మోడీ సర్కార్ ప్రయత్నం చేస్తోంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం వంటివి తీవ్రమైన ప్రమాదంలో పడ్డాయి" అని పేర్కొన్నారు.

"దేశంలో తీవ్ర నియంతృత్వ పద్ధతుల్లో పరిపాలన సాగుతోంది. వీటికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ప్రతిఘటన పోరాటం చేసేందుకు లౌకిక, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు, ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు, మేధావులతో కూడిన విస్తృతమైన వేదిక అవసరమని సిపిఐ భావిస్తోంది. దీన్ని ఎన్నికల ఎత్తుగడల్లో ఒక భాగంగా, లేక ఎన్నికలకు సంబంధించినదిగా భావించకూడదు. ఇది ప్రతిఘటన పోరాటంగా, ప్రజా ఉద్యమంగా సాగాలి. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చినప్పుడు ఎన్నికల ఎత్తుగడలను నిర్ణయిస్తాం. తమ పార్టీ ఈ రెండు అంశాల్ని వేర్వేరుగా చూస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల రీత్యా వామపక్షాల ఐక్యత, వామపక్షాల ప్రత్యామ్నాయం అవసరమని భావిస్తున్నాం.

దాన్ని కొనసాగించాలని, అదే సమయంలో ప్రతిఘటన ఉద్యమాన్ని, వామపక్ష ఐక్యత పోరాటాన్ని పరస్పర విరుద్ధంగా భావించకూడదని సిపిఐ భావిస్తోంది. దేశ వ్యాప్తంగా ఆరెస్సెస్ నాయకత్వంలో నాడుస్తోన్న బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించడం ప్రధాన లక్ష్యంగా తమ పార్టీ భావిస్తోంది. ఈ అంశాలన్నింటినీ రాబోయే పార్టీ మహాసభల్లో చర్చిస్తాం. దేశవ్యాప్తంగా ఎన్నికల ఎత్తుగడలు సాధ్యం కాదని తమ పార్టీ భావిస్తోంది. ఆయా రాష్ట్రాల్లో పరిస్థితులను బట్టి ఎన్నికల ఎత్తుగడలతో ముందుకు వెళ్తాం" అని సురవరం పేర్కొన్నారు.

వామపక్షాలతో పొత్తుపై చర్చిస్తాం : దేవగౌడ



బెంగళూరు : కర్నాటక ఎన్నికల కోసం బిఎస్‌పితో పొత్తు పెట్టుకున్న మాజీ ప్రధాని హెచ్.డి.దేవగౌడ వామపక్షాలతో పొత్తు పెట్టుకునే విషయాన్ని పరిశీలిస్తున్నారు. వామపక్షాలతో జనతాదళ్ సెక్యులర్ (జెడిఎస్) పొత్తు పెట్టుకోవడంపై త్వరలో చర్చలు జరుపుతామని, వారికి కొన్ని సీట్లు ఇస్తామని గౌడ తెలిపారు. గత కొన్నేళ్ళుగా వామపక్షాలతో జెడిఎస్‌కు సత్సంబంధాలే వున్నాయి. పొత్తుపై దేవగౌడతో ఉమ్మడిగా చర్చించాలని సిపిఐ, సిపిఎం నిర్ణయించినట్లు గత వారం సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి చెప్పారు. రైతు అనుకూల విధానాలు తీసుకువస్తామంటూ జెడిఎస్ ప్రచారం చేస్తోంది. రైతు రుణాలను రద్దు చేస్తామని హామీలిస్తోంది.

ఎన్‌సిపి పొత్తు?

కాగా జెడిఎస్‌తో ఎన్‌సిపి పొత్తు కుదుర్చుకునే అవకాశాలు వున్నాయని ఎన్‌సిపి అధ్యక్షులు శరద్ పవార్ వెల్లడించారు. ఇక్కడ జరిగిన ఎన్‌సిపి కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరులతో శరద్ పవార్ మాట్లాడుతూ 'నేను దేవగౌడ, హెచ్‌డి కుమారస్వామిలతో మాట్లాడతా, కలిసి పనిచేసే అవకాశాలపై మేం చర్చిస్తాం' అని తెలిపారు. కర్నాటకలో తమ ఉనికి పరిమితంగానే ఉందని అంగీకరించిన ఆయన, బిజెపిని ఎదుర్కొవడానికి జెడిఎస్‌తో కలిసిపోటీ చేస్తామని తెలిపారు.

అయోధ్య స్థల వివాదంలో సుప్రీం తీర్పే శిరోధార్యం

యుపి డిప్యూటీ సిఎం మౌర్య

లక్నో : అయోధ్య వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకునే విషయంలో యుపి ప్రభుత్వం జోక్యం చేసుకోబోదని, ఈ వివాదంపై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పునే అంగీరిస్తామని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య తేల్చి చెప్పారు. అయోధ్యలోని వివాదాస్పదం 2.77 ఎకరాల భూమి వివాదంలో అలహాబాద్ హైకోర్టు తీర్పుపై అప్పీళ్లు సుప్రీం విచారణలో ఉన్న విషయం విదితమే. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు ఈనెల 8న విచారించి మార్చి 14కి వాయిదా వేసింది.

అసోంలో కూలిన ఐఎఎఫ్ విమానం

గువహతి: అసోంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్(ఐఎఎఫ్)కు చెందిన తేలిక పాటి విమానం కూలిపోయిన ఘటనలో ఇద్దరు సిబ్బంది మృతి చెందారు. ప్రమాదంలో వారు సజీవ దహనమవడంతో పాటు ఎయిర్‌క్రాఫ్ట్ కూడా పూర్తిగా దగ్ధమైంది. పోలీసుల వివరాల ప్రకారం... రోజువారీ విధుల్లో భాగంగా రాష్ట్రంలోని జోర్హాట్ ఎయిర్‌పోర్టు నుంచి సైనిక విమానం గురువారం మధ్యాహ్నం బయలుదేరింది. కాగా..20 కిలోమీటర్లు ప్రయాణించిన విమానంలో.. మజూలీ దీవి ప్రాంతంలో ఒక్కసారిగా కూలిపోవడంతో వెంటనే మంటలు లేచాయి. దానిలో వింగ్ కమాండర్లు జైపాల్ జేమ్స్, డీవత్స్ మృతి చెందారని లెఫ్టినెంట్ కల్నల్ హర్షవర్ధన్ పాండే వెల్లడించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఐఎఎఫ్ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు.

ప్రత్యేకం

అమెరికాలో విస్తరిస్తోన్న 'గన్ కల్చర్'

- 45 రోజుల్లో 18 కాల్పుల ఘటనలు
- గతేడాది 12 వేల మంది మృతి

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి విషవలయంలా క్రమక్రమంగా వ్యాపిస్తోంది. కాల్పుల ఘటనల కారణంగా అమాయక ప్రజలు బలవుతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం చేసిన అనంతరం కాల్పుల ఘటనలు పెరిగిపోయాయి. అమెరికాలో భద్రతా ప్రమాణాలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. కాల్పుల ఘటనలు పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు, ఏ ప్రదేశంలో, ఏ క్షణంలో తుపాకీ మోత మోగుతుందో అర్థంకాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. రెస్టారెంట్లు, రద్దీ ప్రదేశాలు, రైల్వే స్టేషన్లతో పాటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకూ రక్షణ కరువైంది. భయం నీడలో జీవించాల్సిన పరిస్థితులు అమెరికన్లు చవిచూస్తున్నారు. అమెరికా దగ్గర అత్యంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ కాల్పుల ఘటనలను నివారించ లేకపోవడం శోచనీయం. అమెరికాలో జరిగిన కాల్పుల ఘటనలపై పీవ్ రిసెర్చ్ అనే సంస్థ సమగ్ర దర్యాప్తు చేపట్టి ఓ నివేదిక ప్రచురించింది. దానిలోని వివరాల ప్రకారం... ఈ ఏడాది జనవరి1 నుంచి ఫిబ్రవరి15 వరకు 18 పాఠశాలల్లో కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నాయి. గతేడాది అక్టోబర్3న లాస్ వేగస్‌లో జరిగిన కాల్పుల ఘటనలో 58 మంది మృతి చెందగా, 500 మంది గాయపడ్డారు. గతేడాది జరిగిన కాల్పుల ఘటనల్లో 12వేల మంది అమెరికన్లు చనిపోయారు. తుపాకీ సంస్కృతి బారిన పడి రోజుకు 90 మంది అమెరికన్లు మృతిచెందుతున్నారు. 48 శాతం మంది అమెరికన్ పౌరుల వద్ద వ్యక్తిగత లైసెన్స్‌తో కూడిన తుపాకులు ఉన్నాయి. అమెరికన్లలో ప్రతీ 100 మందిలో 89 మంది వద్ద తుపాకులు ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ అలబామా పరిశోధకులు తెలిపిన వివరాల ప్రకారం...అమెరికాలో 31 శాతం మంది మాస్ షూటర్స్ ఉన్నారు. డబ్ల్యుహెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం...తుపాకుల పేలుళ్లలో మృతి చెందుతున్న దేశాల్లో అమెరికా పౌరుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఎఫ్‌బీఐ 2016లో విడుదల చేసిన నివేదిక ప్రకారం...అమెరికాలో జరిగిన హత్యల్లో 70 శాతం మంది నిందితులు తుపాకులు ఉపయోగించారు.



సంక్షిప్తం

ఎన్‌కౌంటర్లు ఆగవు : యోగి అధిత్యనాథ్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో పోలీస్ ఎన్‌కౌంటర్లు ఆగవని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ గురువారం స్పష్టం చేశారు. రాష్ట్ర శాసన మండలిలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతిపక్షాలు నేరస్తులపై సానుభూతి చూపిస్తున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. 1200 ఎన్‌కౌంటర్లలో 40 మంది నేరస్తులు కాల్చిచంపబడ్డారని, ఇది కొనసాగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

బెంగళూరులో భవనం కూలి ముగ్గురు మృతి

బెంగళూరు : నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు చనిపోయారు. ఈ దుర్ఘటన కర్నాటక రాజధాని బెంగళూరులో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. బెంగళూరులోని కాసావనాహల్లి ప్రాంతంలో ఐదంతస్థుల భవనాన్ని ఆరేండ్లుగా నిర్మిస్తున్నారు. అయితే.. గురువారం మధ్యాహ్నం ఆ భవనం ఒక్కసారిగా కూలిపోయింది. ప్రమాదంలో ముగ్గురు చనిపోగా.. మరో ఏడుగురిని కాపాడినట్టు డీసీపీ వెల్లడించారు.

మోడీ వ్యాఖ్యలపై నిరసన తెలిపిన విద్యార్థులకు జరిమానా

న్యూఢిల్లీ యువతకు ఉపాధి కల్పనపైనా, పకోడీల అమ్మకంపైనా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలకు నిరసనలు తెలియజేసిన నేరానికి జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ అధికారులు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్‌కు చెందిన నలుగురు విద్యార్థులపై జరిమానా విధించారు.పకోడీలు అమ్ముకోవడం కూడా ఉపాధి మార్గమేనని మోడీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే దీనిపై నిరసన తెలిపినందుకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున జరమానా విధించినట్టు అధికారులు ప్రకటించారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఒక విద్యార్థికి రెండు సెమిస్టర్ కాలపరిమితిలో హాస్టల్ వసతిని ఉపసంహరించారు.మరో ముగ్గురిని వేరే హాస్టళ్లకు బదిలీ చేశారు.

అంతర్యుద్ధాలతో చిన్నారులు సతమతం : సేవ్ ద చిల్డ్రన్

డమాస్కస్ : అంతర్యుద్ధాలతో చిన్నారులు సతమతమవుతున్నారని సేవ్ ద చిల్డ్రెన్ స్వచ్ఛంధ సంస్థ వెల్లడించింది. అర్ధాకలితో అలమటిస్తూ పిల్లలు మృతి చెందడం పట్ల ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఓ నివేదికను ప్రచురించింది. దానిలోని వివరాల ప్రకారం...అంతర్యుద్ధాలు చెలరేగిన ప్రాంతాల్లో నివసిస్తున్న చిన్నారుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. 1995లో అంతర్యుద్ధాలు చెలరేగిన ప్రాంతాల్లో నివసిస్తున్నవారి సంఖ్య 200 మిలియన్లు ఉండగా, ఆ సంఖ్య ప్రస్తుతం 357 మిలియన్లకు చేరుకోవడం విచారకరం అన్నారు. ప్రాథమిక అవసరాల కొరతతో లక్షలాది మంది చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిరియా, సోమాలియా, అఫ్ఘనిస్థాన్ ప్రాంతాల్లో నివసిస్తున్న పిల్లల పరిస్థితి దారుణంగా ఉన్నదన్నారు.

కొత్త అధినేత

దక్షిణాఫ్రికా కొత్త అధ్యక్షునిగా ఎన్నికైన అనంతరం విజయ సంకేతం చూపిస్తున్న సిరిల్ రమ్‌ఫోసా



దక్షిణాఫ్రికా అధ్యక్ష పదవికి జుమా రాజీనామా

కొత్త అధ్యక్షునిగా సిరిల్ రమ్‌ఫోసా ఎన్నిక

జోహాన్నెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా తన పదవికి రాజీనామా చేశారు. పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ చర్య తీసుకున్నారు. గతంలో రాజీనామా చేసేది లేదంటూ ప్రకటించినప్పటికీ, మరో గంటలో పార్టీ విధించిన గడువు ముగుస్తుందనగా రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. 'నా కారణంగా ఎఎన్‌సిలోచీలికలు రాకూడదు. ఏ ఒక్కరూ మరణించకూడదు. పార్టీ ఆదేశాలు, నిర్ణయంతో తాను విభేదిస్తున్నప్పటికీ క్రమశిక్షణ కలిగిన సభ్యునిగా ఈ నిర్ణయం తీసుకున్నా.' అని జుమా వ్యాఖ్యానించారు. రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఆయన దేశ ప్రజలనుద్దేశించి దాదాపు అరగంట పాటు ప్రసంగించారు. తన హయాంలో జరిగిన తప్పులకు ఆయన క్షమాపణలు చెప్పారు. దేశ ప్రజలు తనకు అప్పగించిన కర్తవ్యాన్ని నిర్వహించాననే అనుకుంటున్నానని, ఒకవేళ తప్పు చేస్తే తనను క్షమించాలని కోరారు. ఈ పదవి నుండి వైదొలగినా దేశానికి, పార్టీకి సేవలు చేయాలని భావిస్తున్నానని అన్నారు. దీంతో గత రెండు వారాల నుండి పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం సమసిపోయినట్లైంది. జుమాపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన పదవి నుండి వైదొలగాలని ఎఎన్‌సి కోరింది. ప్రస్తుతం డిప్యూటీ అధ్యక్షుడుగా ఉన్న సిరిల్ రమఫోసా ఎన్నికయ్యారు శుక్రవారం ఆయన ప్రమాణ స్వీకారం చేసే అవకాశం వుంది.


ఉత్తర ఐర్లాండ్ చర్చలు విఫలం

లండన్ : ఉత్తర ఐర్లాండ్ ప్రభుత్వ అధికారాల పంపిణీని పునరుద్ధరించేందుకు జరుగుతున్న చర్చలు బుధవారం మళ్ళీ విఫలమయ్యాయని ప్రధాన పార్టీలు తెలిపాయి. చర్చల వైఫల్యానికి కారణమంటూ పరస్పరం నిందించుకున్నాయి. అయితే ఇంకా పరిష్కారం కుదిరే అవకాశాలు వున్నాయంటూ బ్రిటన్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. బ్రిటీష్ ప్రావిన్స్ అయిన ఉత్తర ఐర్లాండ్‌లో గత ఏడాది కాలంగా సరైన ప్రభుత్వం లేదు. ఏ బిల్లును ఆమోదించాలన్నా డెమోక్రటిక్ యూనియనిస్ట్ పార్టీ (డియుపి) ఇచ్చే మద్దతుపై ప్రధాని థెరిస్సా మే మైనారిటీ ప్రభుత్వం ఆధారపడి వున్నందున దీర్ఘకాలం నుండి సాగుతున్న చర్చలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రధానంగా కేథలిక్కులకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ, ప్రొటెస్టంట్లకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు ఇప్పటివరకు విధించిన అనేక గడువులను ఉల్లంఘించాయి. ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇంకా ఒకే ఒక్క అవకాశం వుందని గత నెల్లో బ్రిటీష్, ఐరిష్ ప్రభుత్వాలు ఆ పార్టీలకు స్పష్టం చేశాయి. ఈసారి చర్చల్లో పురోగతి కనిపిస్తుండడంతో చర్చలు జయప్రదమవుతాయని భావించామని బ్రిటన్‌లోని ఉత్తర ఐర్లాండ్ మంత్రి కరేన్ బ్రాడ్లే విలేకర్లకు తెలిపారు. ప్రజా ప్రయోజనాల రీత్యా అధికార వికేంద్రీకరణ ప్రభుత్వం మంచిదని బ్రిటన్ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలకు, అవి ఫలప్రదం కావడానికి ఇంకా అవకాశం వుందని తాము భావిస్తున్నట్లు థెరిస్సా మే తెలిపారు. ఈ చర్చలతో ప్రతిష్టంభన పరిష్కారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని రెండు రోజుల క్రితమే ఇరువురు ప్రధానులు పేర్కొన్నారు. అయితే ఒప్పందం కుదిరే పరిస్థితి కనిపించడం లేదని డియుపి నేత అర్లీన్ ఫోస్టర్ బుధవారం ఒక ప్రకటన జారీ చేయడంతో మొత్తంగా చర్చలు విఫలమయ్యాయి.

నేపాల్ కొత్త ప్రధాని ఓలి

రాజీనామా చేసిన షేర్ బహదూర్ దేబా

రెండు కమ్యూనిస్టు పార్టీల విలీనం ప్రారంభం



ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలి

ఖాట్మండు : నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేబా గురువారం తన పదవికి రాజీనామా చేశారు. దీంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి వామపక్ష సంఘటన కూటమికి మార్గం సుగమమైంది. తదుపరి ప్రధానిగా సిపిఎన్-యుఎంఎల్ చైర్మన్ ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలిని పార్టీ ఎంపిక చేసింది. ప్రభుత్వానికి మెజారిటీ కావాలంటే ఓలికి మావోయిస్టుల మద్దతు అవసరం. లలిత్‌పూర్‌లో జరిగిన సిపిఎన్-యుఎంఎల్ స్థాయీ సంఘ సమావేశంలో పార్లమెంటరీ పార్టీ నేత ఓలిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సిపిఎన్-యుఎంఎల్, సిపిఎన్ మావోయిస్టు సెంటర్‌ల మధ్య లాంఛనపూర్వకమైన విలీనానికి స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. మాజీ ప్రధాని పుష్ప కమల్ దహాల్ (ప్రచండ) నేతృత్వంలోని సిపిఎన్ మావోయిస్టు సెంటర్ మద్దతుతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని అధికారికంగా ప్రకటించాలని కమిటీ కొన్ని నెలల క్రితమే నిర్ణయించింది. రెండు నెలల క్రితం జరిగిన పార్లమెంటరీ, ప్రావిన్షియల్ ఎన్నికల్లో సంయుక్తంగా పోటీ చేయాలని రెండు కమ్యూనిస్టు పార్టీలు నిర్ణయించాయి. ఓలి, ప్రచండలు ఇరువురూ కొత్త కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహిస్తారని సిపిఎన్-యుఎంఎల్ పార్టీ నేత సురేంద్ర పాండే తెలిపారు. ప్రధాని పదవిని కూడా వంతులవారీగా నిర్వహిస్తారని చెప్పారు.

రెండు పార్టీలకు చెందిన వారితో ఏర్పాటు చేసే టాస్క్ ఫోర్స్ పార్టీల విలీనాన్ని, కొత్త పార్టీ నిర్మాణాన్ని, రాజకీయ సిద్ధాంతాన్ని నిర్ణయిస్తాయి. వంతుల వారీగా ప్రధాని పదవి నిర్వహించడానికి అనుసరించాల్సిన పద్ధతులు కూడా రూపొందిస్తుంది. ఒకవైపు ప్రభుత్వ ఏర్పాటు, మరోవైపు పార్టీల విలీనం జోడుగా సాగుతాయని పాండే తెలిపారు. గత డిసెంబరులో జరిగిన చారిత్రక ప్రావిన్షియల్, పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎన్-యుఎంఎల్, సిపిఎన్-మావోయిస్టు సెంటర్‌ల కూటమి 174 సీట్లు గెలుపొందింది.



స్నేహపూర్వక పోటీ అవశ్యం

- ఘర్షణ, శతృత్వం ప్రమాదకరం
- అమెరికాలో చైనా రాయబారి

వాషింగ్టన్ : ఇరు దేశాల మధ్య ఘర్షణలను ప్రోత్సహించడం ఉభయులకూ ప్రమాదకరం కాగలదని అమెరికాలో చైనా రాయబారి కుయి తియాన్‌కై వ్యాఖ్యానించారు. అందుకు బదులుగా ఉమ్మడి ప్రయోజనాలు, చర్చలు అనేవి ఇరు దేశాల మధ్య మరింత విశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. చైనా తనదైన సొంత అభివృద్ధి పంథాను అనుసరించడం అమెరికాకు ఎదురు దెబ్బ కాగలదని ఆందోళన చెందడం సరైన పని కాదని అన్నారు. చైనాకు వ్యతిరేకంగా ఘర్షణ పడేందుకు వ్యూహాన్ని రచించడం చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. చైనా ఎంబసీలో వసంతోత్సవాల సందర్భంగా జరిగిన విందు సమావేశంలో ఆయన ప్రసంగించారు. చైనా-అమెరికా మధ్య సంబంధాలు సర్వతోముఖ సహకారాభివృద్ధిగా వుండాలని ఆయన ఆకాంక్షించారు. స్నేహపూర్వకమైన పోటీ వుండాలి కానీ ఘర్షణ, శతృత్వం వుండరాదని ఆయన సూచించారు. మన మధ్య విభేదాలు కొనసాగుతూ వుండవచ్చు, కానీ, మన మధ్య పెరుగుతున్న ఉమ్మడి ప్రయోజనాలు వాటికన్నా మరింత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. సహకారం నెలకొనాల్సిన అవశ్యకత అన్నింటికన్నా ప్రాధాన్యత కలదని అన్నారు. చర్చలొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన పశ్చిమ వర్జీనియా సెనేటర్ షెల్లీ కేపిటో మాట్లాడుతూ, చైనా పెట్టుబడుల గురించి తాము చాలా ఆశ్చర్యపోతున్నామని, ప్రస్తుతమున్న పరిస్థితులను పూర్తిగా మార్చగల ఒక ధోరణిగా తాము దీన్ని భావిస్తున్నామని పేర్కొన్నారు.

జెనీవా చర్చల క్రమాన్ని ముందుకు తీసుకెళతాం

ఐరాసలో సిరియా రాయబారి స్పష్టీకరణ

ఐక్యరాజ్య సమితి : సిరియా సంక్షోభానికి రాజకీయ పరిష్కారాన్ని కనుగొనేందుకు ఉద్దేశించిన జెనీవా చర్చలు ముందుకు సాగేందుకు తమ వంతు కృషి చేస్తామని ఐక్యరాజ్య సమితిలో సిరియా ప్రత్యేక రాయబారి తెలిపారు. జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో సిరియా పక్షాల మధ్య చర్చలు జరగనున్నాయి. సిరియాలో నెలకొన్న పరిస్థితిని భద్రతా మండలిలో వివరిస్తూ ఐరాస మధ్యవర్తి స్టాఫన్ డీ మిత్సురా, కొత్త రాజ్యాంగం రూపకల్పనకు రాజ్యాంగ కమిటీని ఏర్పాటు చేయడంపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నామని తెలిపారు. జనవరి నెల చివరిలో రష్యాలోని శోచిలో సిరియా పక్షాల మధ్య చర్చలు జరిగాయి. ఈ కమిటీ ఏర్పాటుపై ఆ సమావేశంలో అంగీకారం కుదిరింది. శోచి చర్చలకు టర్కీ, ఇరాన్‌లతో కలిసి రష్యా మధ్యవర్తిత్వం వహించింది. ఈ చర్చల్లో సాధించిన పురోగతి జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరిగే చర్చల క్రమానికి ఎంతగానో దోహదపడగలదని రష్యా పేర్కొంది. సిరియా ప్రభుత్వ, ప్రతిపక్ష ప్రతినిధులతో తాను చర్చలు జరిపానని మిత్సురా తెలిపారు. సిరియా ప్రతినిధులందరితో తన బృందం సంబంధాలు కొనసాగిస్తోందని చెప్పారు. ఈ చర్చల క్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు ఇంకా కృషి చేస్తామని మిత్సురా ప్రతిన చేశారు. గతంలో కన్నా మరింత ఎక్కువగా దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం వుందని తమకు తెలుసునని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన క్రమమేదైనా సరే ప్రారంభం కావాలన్నా, అలాగే ఐక్యరాజ్య సమితి ఆమోదించిన 2254 తీర్మానానికి అనుగుణంగా ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికలు జరగాలన్నా ముందుగా అందుకు అనువైన ప్రశాంతమైన, తటస్థ వాతావరణం నెలకొనాలని అన్నారు.

ఇరాన్ అణ్వస్త్ర పరీక్షలపై నిఘా పెట్టాలి : ఫ్రాన్స్

టెహ్రాన్: ఇరాన్ అణ్వస్త్ర పరీక్షలపై ప్రపంచ దేశాలన్నీ నిఘా పెట్టాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మాక్రన్ కోరారు. తమ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు ఏ దేశమైనా ప్రయత్నిస్తే ఆ దేశంపై ఖండాతర క్షిపణులు ప్రయోగిస్తామని ఇరాన్ గతనెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్ ప్రకటన ఆందోళన కల్గిస్తోందని మాక్రన్ అన్నారు. ఇరాన్‌తో 2015లో కుదుర్చుకున్న అణు ఒప్పందాన్ని కొనసాగించాలా ? వద్దా ? అనే అంశంపై తాము కూడా తర్జనభర్జన పడుతున్నామని అన్నారు. ఈ ఒప్పందం నుంచి వైదొలగనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయాన్ని మాక్రన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. యెమెన్, సిరియా నగరాల్లో ఇరాన్ బలగాలు వైమానిక దాడులకు పాల్పడుతున్నాయని మాక్రన్ తెలిపారు. సిరియా, యెమెన్ దేశాల్లో అంతర్యుద్ధ నిర్మూలనకు ప్రపంచ దేశాలన్నీ కృషి చేయాలని ఆయన కోరారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో తామెన్నడూ తలదూర్చలేదన్నారు. మాక్రన్ వ్యాఖ్యలను ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఖండించారు. ఇరాన్ అణు ఒప్పందానికి సభ్య దేశాలన్నీ కట్టుబడి ఉంటాయని తాము ఆశిస్తున్నామని అన్నారు.

కేడీ నీరవ్ పరార్

(మొదటిపేజీ తరువాయి)

పిఎన్‌బి సస్పెండ్ చేసింది.

ఇడి, ఆర్‌బిఐ చర్యలు..

2018 మార్చి నాటికి రూ.11వేల కోట్లు పిఎన్‌బినే చెల్లించాలని రిజర్వు బ్యాంకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. పిఎన్‌బి మధ్యవర్తిగా ఉండి ఇప్పించిన రుణాలను కూడా ఆ బ్యాంకే చెల్లించాలని పేర్కొంది. నీరవ్ కుటుంబానికి చెందిన 17 కార్యాలయాల్లో గురువారం ఇడి సోదాలు నిర్వహించింది. ఇంత జరిగిన ముంబయిలోని నీరవ్ ఇంట్లో మాత్రం ఎలాంటి తనిఖీలు జరుగలేదని తెలుస్తోంది. ఆయన ఫ్లాట్‌కు పోలీసులు కానీ, బ్యాంకు అధికారులు కానీ, సిబిఐ అధికారులు ఎవరూ రాలేదని సమాచారం. ఇడి సోదాల్లో నీరవ్‌కు చెందిన రూ. 5100 కోట్ల వజ్రాలు, బంగారు ఆభరణాలను సీజ్ చేసినట్లు ప్రకటించింది. అలాగే 3.9 కోట్ల బ్యాంకు నిల్వలతో పాటు ఇతర డిపాజిట్లను కూడా సీజ్ చేసినట్టు వెల్లడించింది. అదే విధంగా నీరవ్, ఆయన భార్య, మెహుల్ చోక్సీ పాస్‌పోర్టులు రద్దు చేయాల్సిందిగా ఇడి కేంద్రానికి లేఖ రాసింది. పిఎన్‌బి ఇచ్చిన హామీలతో వీళ్ళు ఆరు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గుర్తించింది. రూ.5 వేల కోట్లను తిరిగి బ్యాంకులకు చెల్లించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఇందుకు 6 నెలల గడువు కావాలని నీరవ్ కోరినట్టు సమాచారం.

ఎవరినీ ఉపేక్షించం : సిఇఒ వెల్లడి

ఈ కుంభకోణంలో పాత్ర ఉన్నవారిని ఎవరినీ ఉపేక్షించబోమని పిఎన్‌బి సిఇఒ సునీల్ మెహతా అన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. తమది స్వచ్ఛ బ్యాంకింగ్ అని పేర్కొన్నారు. తాజా పరిణామంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ అంశంపై ఇప్పటికే రెగ్యులేటరీ సంస్థలతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు సమాచారం అందించామన్నారు. ఈ మోసాన్ని తాము జనవరి 25న గుర్తించామని తెలిపారు. జనవరి 29న సిబిఐతో పాటు ఇతర పరిశోధన ఏజెన్సీలకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ మోసం ఒక్క ముంబయి శాఖలోనే జరిగిందని, మరే శాఖతోనూ సంబంధం లేదన్నారు. అయినా అన్ని శాఖలను పరిశీలించామని, అయితే అవి బాగానే పని చేస్తున్నాయన్నారు.

మరో మాల్యా కష్టాలే..

నీరవ్ ద్వంద పౌరసత్వాలు కలిగి ఉన్నారని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఆయన్ను భారత్ తీసుకురావడం చాలా కష్టమని నిపుణులు పేర్కొంటున్నారు. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధిపతి విజయ మాల్యా భారత బ్యాంకులకు రూ.9వేల కోట్లపైగా ఎగనామం పెట్టి బ్రిటన్ పారిపోయిన విషయం తెలిసిందే.

దావోస్‌లో ప్రధానీతో మోడీ..

గత నెలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య సదస్సు (డబ్ల్యుఇఎఫ్)లో ప్రధానీ నరేంద్ర మోడీతో నీరవ్ మోడీ భేటీ అయ్యారని వార్తలు వచ్చాయి. అక్కడ భారత సిఇఒలు ప్రధానీతో కలిసి జనవరి 23న గ్రూపు ఫోటో దిగారు. ఇందులో నీరవ్ కూడా ఉండటంతో ఇదీ మరింత చర్చనీయాంశం అయ్యింది. నీరవ్ రాజకీయ బలంతోనే ఇంత పెద్ద అక్రమ లావాదేవీలకు పాల్పడి ఉండొచ్చనే విమర్శలు పెరుగుతున్నాయి. కాగా ప్రధానీతో కేటు మోడీకి సంబంధాలున్నాయని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలకు దిగాయి. దీనిపై ప్రధాన మంత్రి కార్యాలయం ప్రకటన ఇచ్చింది. ప్రధానీ దావోస్ డెలిగేషన్‌లో నీరవ్ భాగం కాదని పేర్కొంది. సిఐఐతో భాగస్వామ్యంమై ఆయన వచ్చారని తెలిపింది. నీరవ్‌తో ప్రధానీ భేటీ జరగలేదని మంత్రి రవి శంకర్ ప్రసాద్ వివరణ ఇచ్చారు.

షెడ్యూల్ ప్రకారమే టెట్

(మొదటిపేజీ తరువాయి)

పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్షపై అభ్యర్థుల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలపై ఆయన సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని సచివాలయంలో నిర్వహించారు. ప్రధానంగా ఐదు జిల్లాల్లో తక్కువ పరీక్షా కేంద్రాలు, మౌలిక వసతులు లేకపోవడంతో ఎక్కువ మందికి అవకాశం కల్పించలేకపోవడం వల్లే ఈ సమస్యలు తలెత్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,46,833 మంది అభ్యర్థులు పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 15,605 (3.5 శాతం) మందికి ఇతర రాష్ట్రాల్లోని సమీపంలో ఉన్న పరీక్షా కేంద్రాల్ని కేటాయించామన్నారు. మొత్తం 183 పరీక్షా కేంద్రాలు ఎంపిక చేయగా, మన రాష్ట్రంలో 159, హైదరాబాదు, బెంగళూరు. చెన్నైలలో మరో 24 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 805 మందికి వారు కోరుకున్న జిల్లా సాధ్యం కాకపోవడంతో వేరే జిల్లాలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించామన్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు ముందే ట్రయల్‌రన్ నిర్వహించాలని అధికారులను ఆదేశించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో బ్యాకప్, స్టాండ్ బై కంప్యూటర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 3,83,204 మంది అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటిల్లో రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ కోసం చట్టంలో సవరణ తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ పరీక్షా కేంద్రాలన్నింటిలోనూ సిసి కెమెరాల్ని ఏర్పాటు చేశామన్నారు.

పోలవరంపై విచారణ ఏప్రిల్ 17కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జస్టిస్ ఆర్‌ఎస్ బచావత్ నేతృత్వంలోని గోదావరి నదీ జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్ 1980లో ఇచ్చిన అవార్డుకు కట్టుబడి ఉన్నారా? లేదా? అన్న విషయమై ఈ వివాదానికి సంబంధించిన ఆరు రాష్ట్రాలు అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డులో ఉన్న ఒప్పందాల ఉల్లంఘన జరుగుతోందని ఒరిస్సా ప్రభుత్వం సుప్రీం కోర్టులో 2007లో ఒరిజనల్ సూట్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తొలుత ఒరిస్సా తరపున సీనియర్ న్యాయవాది గోపాల సుబ్రమణ్యం వాదానలు వినిపిస్తూ "బచావత్ అవార్డులో భాగంగా కుదిరిన ఒప్పందం మేరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగడం లేదు. 36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహ సామర్థ్యానికి మించి ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. దీని కారణంగా ముంపు ప్రాంతం పెరుగుతుంది. మల్కాన్ గిరి తదితర ప్రాంతాలు ముంపు బారిన పడతాయి. పోలవరం ప్రాజెక్టుకు ఎగువన ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం ద్వారా వరద ప్రవాహ ఒత్తిడిని తగ్గించవచ్చని అవార్డు పేర్కొంది. కానీ వీటన్నింటి



ఉల్లంఘన జరుగుతోంది. అన్ని ఒప్పందాలు అమలవ్వాలి" అని వాదించారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ స్పందిస్తూ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశ ప్రతిపాదన ఏమైందని ప్రశ్నించారు. ఇది ఇంకా సాధ్యపడలేదని కేంద్రం తరపున న్యాయవాది ఖాద్రీ తెలిపారు. గోపాల సుబ్రమణ్యం స్పందిస్తూ "మేం ఇప్పటికీ అడుగుతూనే ఉన్నాం. కేంద్రం ఈ విషయంలో స్పందించి సమావేశం ఏర్పాటు చేయాలి. మా అభ్యంతరం అంతా గిరిజనులు ముంపునకు గురవుతారన్నదే" అని పేర్కొన్నారను. "వివాదంతో సంబంధం ఉన్న ఏపి, ఒరిస్సా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై పరిష్కరించుకునేందుకు వీలుంది కదా..అసాధ్యమైతే కాదు కదా.." అని న్యాయమూర్తి జస్టిస్ లోకూర్ పేర్కొన్నారు. గోపాల సుబ్రమణ్యం స్పందిస్తూ "అసాధ్యమేమీ కాదు. అవార్డులో ప్రస్తావించిన డిజైన్, విధి విధానాలు అమలవ్వాలన్నదే మా అభ్యర్థన. 36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహానికే పరిమితం కావాలని అవార్డు పేర్కొంది" అని తెలిపారు. ఈ నేపథ్యంలో అవార్డుకు అందరూ కట్టుబడి ఉన్నారా? అంటూ న్యాయమూర్తి లోకూర్ ప్రశ్నించగా అందరూ కట్టుబడి ఉన్నామని తెలిపారు. అయితే దీనిపై రాతపూర్వకంగా మార్చి 31లోగా అఫిడవిట్ సమర్పించాలని ఆదేశించారు. పోలవరానికి జాతీయ ప్రాజెక్టు హోదాను కట్టబెట్టడంపై కూడా ఒరిస్సా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసింది. దీనిపై తమ వైఖరిని తెలిపేందుకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ కోరగా అందుకు ధర్మాసనం సమ్మతించింది. ఇక ప్రాజెక్టుకు తొలిదశ పర్యావరణ అనుమతులు నిబంధనలకు అనుగుణంగా లేవని, దీనిపై స్టే ఇవ్వాలని మరొక అభ్యర్థనను ఒరిస్సా ప్రభుత్వం దాఖలు చేయగా, ప్రధాన పిటిషన్‌తో కలిపి వింటామన్న ధర్మాసనం విచారణను ఏప్రిల్ 17కు వాయిది వేసింది. విచారణకు ఏపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ఏకె గంగూలీ, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాసరావు, తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కృష్ణమూర్తి స్వామి, అదనపు అడ్వొకేట్ జనరల రామచంద్రరావు హాజరయ్యారు.

వ్యూహామా... తడబాటా!

(మొదటిపేజీ తరువాయి)

నెల్లూరు జిల్లా పాదయాత్రలో ఉన్న వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి రాజీనామాల్లో తమతో కలిసి రావాలని చంద్రబాబుకు సవాల్ విసిరారు. వైసిపి ఎంపిలతో కలిసి టిడిపి ఎంపిలు కూడా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన ఎంపిలందరూ రాజీనామా చేస్తే కేంద్రం ఎందుకు దిగిరాదని ఆయన ప్రశ్నించారు. ఇదే అంశాన్ని ఆయన ట్విట్టర్ వేదికగా కూడా ప్రస్తావించారు. దీనిపై టిడిపి నేతల్లో చర్చలు సాగుతుండగానే రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మార్చి 5వ తేదిలోగా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే బిజెపితో తెగతెంపులు చేసుకుంటామని, అదే రోజు తమ పార్టీ కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తారని, చంద్రబాబునాయుడు ఇదే నిర్ణయాన్ని తీసుకున్నారని ప్రకటించారు. దీంతో మీడియాలోనూ, రాజకీయ వర్గాల్లోనూ కలకలం బయలుదేరింది. టిడిపి కౌంటర్‌తో జగన్ చిక్కుల్లో పడ్డారని మీడియాలో కథనాలు ప్రసారమయ్యాయి. ఆదినారాయణరెడ్డి ప్రకటనపై పలువురు కేంద్రమంత్రులు, టిడిపి ఎంపిలు ఆరా తీసినట్లు సమాచారం. ఈ హడావిడి సాగుతుండగానే రంగంలోకి దిగిన టిడిపి ఎంఎల్‌సి వైవిబి రాజేంద్రప్రసాద్ ఆదినారాయణరెడ్డి ఆవేశంలో మాట్లాడారని, అటువంటి నిర్ణయమేమి తీసుకోలేదని తేల్చివేశారు. ఆ తరువాత కాసేపటికే మళ్లీ మీడియా ముందుకు వచ్చిన ఆదినారాయణరెడ్డి ఐదవ తేది తెలుగుదేశం పార్టీ కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తారన్నది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని అన్నారు. తన ప్రకటనకు తెలుగుదేశం పార్టీకి ఎటువంటి సంబంధం లేదని వివరించారు. మొత్తంమీద టిడిపిలో చోటుచేసుకున్న ఈపరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.

ఫ్లోరిడా స్కూల్లో కాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మొట్టమొదటిసారిగా కాల్పులు జరిగినపుడు తాను మొదటి అంతస్తులో వున్నానని, ఆరేడుసార్లు కాల్పులు శబ్దాలు వినిపించాయని, అప్పటికి మా తరగతి గది తలుపు తెరిచి వుందని, వెంటనే వెళ్ళి తలుపు మూసేశానని విద్యార్థి జాసన్ తెలిపారు. అందరం గది మూలకు వెళ్ళి భయంతో దాక్కున్నామని చెప్పారు. నిందితుడు క్రజ్ ఒక్కడే కాల్పులు జరిపాడని, అతని వెనక అనుచరులు ఎవరూ లేరని ఫెడరల్, స్థానిక అధికారులు తెలిపారు. ఫ్లోరిడా రాష్ట్రానికి ఇదిచాలా దుర్దినమని ఇజ్రాయిల్ వ్యాఖ్యానించారు. జరిగిన దారుణం చూసిన తర్వాత మాటలు కూడా రావడం లేదని అన్నారు. తొలుత ఆస్పత్రికి తీసుకెళ్ళి నిందితుడి మానసిక స్థితి గురించి తెలుసుకున్న తర్వాత అధికారులు అతడిని పోలీసు కస్టడీకి అప్పగించారు. తనతో పాటు అనేక తూటాలను తెచ్చుకున్న క్రజ్ స్కూల్లోకి వెళ్ళగానే మొదట ఫైర్ అలారం మోగించాడని, దాంతో విద్యార్థులందరూ ఒక్కసారిగా బయటకు పరుగులెత్తితే కాల్పులు జరపడానికి సిద్ధంగా నిలబడ్డాడని పోలీసులు తెలిపారు. కాల్పులు జరిపిన తర్వాత విద్యార్థులు పారిపోతుంటే వారితో కలిసి పారిపోవడానికి క్రజ్ ప్రయత్నించాడని, కానీ పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. ఈ కాల్పుల వెనక గల కారణమేంటనేది ఇంకా తెలియరాలేదు. గతంలో కూడా ఈ విద్యార్థి వ్యవహార శైలి సరిగా లేదని పోలీసులు చెప్పారు.

ఖండించిన ట్రంప్

ఫ్లోరిడా కాల్పుల ఘటనను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియచేశారు. పిల్లలు, పెద్దలు, ఎవరూ కూడా అమెరికా స్కూళ్ళలో సురక్షితం కాదని భయపడరాదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితిని సమీక్షిస్తున్నారని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి సారా శాండర్స్ తెలిపారు.

ఇది దుష్ట తలంపుతో చేపట్టిన చర్య ఫ్లోరిడా గవర్నర్ రిక్ స్కాట్ వ్యాఖ్యానించారు. తప్పుడు వ్యక్తుల చేతులకు దూరంగా తుపాకులు వుండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దేనని సెనెటర్ జెన్నీ షహీన్ పేర్కొన్నారు.

కొత్త సంవత్సరంలోని 43 రోజుల్లో అమెరికాలో 18చోట్ల స్కూళ్ళలో కాల్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో దేశంలో తుపాకీ సంస్కృతి గురించి కాంగ్రెస్ పున:పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా వుందని, అమాయకుల ప్రాణాలను కాపాడాలని సెనెటర్ బెర్నీ శాండర్స్ పేర్కొన్నారు.

మార్చి 6న దేశవ్యాప్త ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

వెహికల్స్, వస్తువుల రవాణా, డ్రైవింగ్ స్కూల్స్, స్పేర్ పార్ట్సు షాప్స్, ఆటోమొబైల్ వర్క్‌షాప్స్, వెహికల్ ఓనర్స్ అసోసియేషన్లు ఎం.వి చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాయని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ కె.కె దివాకరన్ పేర్కొన్నారు.శ్యామల్ చక్రవర్తి (ఎఐఆర్టీడబ్ల్యుఎఫ్), ఎం.ఎల్ యాదవ్ (ఎన్‌ఎఫ్ఐఆర్టీడబ్ల్యు), కె.పి హరిదాస్ (ఐఎన్‌టిడబ్ల్యుఎఫ్), సందీప్ షిండే(ఆర్టీడబ్ల్యుఎఫ్ఐ), నటరాజన్(ఎల్‌పిఎఫ్), డి.వి పద్మనాభన్ (టిటిఎస్ఎఫ్), టి.సి.విజయన్(యుటియుసి) కన్వెన్షన్‌కు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యుడు, సెలక్టు కమిటీ సభ్యుడు కె.హరిప్రసాద్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ నేత ఆర్.లక్ష్మయ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.కె దివాకరన్ కన్వీనర్ డిక్లరేషన్‌ను సదస్సులో ప్రవేశపెట్టారు. నిర్మల్ సింగ్ (ఎన్‌ఎఫ్ఐఆర్టీడబ్ల్యు), ఉమేష్ శర్మ (ఐఎన్‌టిడబ్ల్యుఎఫ్), హనుమంత్ టాటీ(ఆర్టీడబ్ల్యుఎఫ్ఐ), షణ్ముగం (ఎల్‌పిఎఫ్), ఎస్.సంపత్ (టిటిఎస్ఎఫ్), చార్లస్ జార్జి (టియుసిఐ), సుకుమార్ ఘోష్ (యుటియుసి), వి.సజిత్ (మోటార్ వెహికల్ ఆఫీసర్స్ అసోసియేషన్), ఎం.కె విజయన్ (అసోసియేషన్ ఆఫ్ ఆటోమొబైల్ వర్క్‌షాప్స్), సుగుమారన్ (లారీ ఓనర్స్ అసోసియేషన్), అస్ఫాక్ అహ్మద్(ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్), మనోజ్ పెరుంపల్లి(జెటియుసి)లు డిక్లరేషన్‌కు మద్దతు తెలుపుతూ ఎం.వి చట్ట సవరణ బిల్లు ప్రమాదాన్ని వివరించారు.

ఏమీ తేలలేదు

(మొదటిపేజీ తరువాయి)

సాగర్ ప్రాజెక్టులకు సంబంధించి ఏపిలో ఉండే తూములు ఏపి ప్రభుత్వం, తెలంగాణలో ఉండే తూములు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తే సమస్యలుండవని ఏపి ప్రభుత్వం కోరింది. ప్రాజెక్టుల కుడి, ఎడమ కాలువల వద్ద రాష్ట్ర పోలీసులు కాకుండా సిఐఎస్ఎఫ్ ద్వారా నిర్వహణ ఉండాలని ఏపి కోరింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా నీటి యాజమాన్య బోర్డు పరిధిని నోటిఫై చేసి అమలు చేయాలని ఏపి ప్రభుత్వం కోరింది. అయితే ఏపి, టిఎస్ వాటాలపై లెక్కలు తేలలేదు. నీటి కేటాయింపులు కొలిక్కి రాకుండానే సమావేశం ముగిసింది. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో ఆశాఖ కార్యదర్శి యుపి సింగ్ గురువారం ఢిల్లీలో వివిధ రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లతో నిర్వహించిన ప్రధాన మంత్రి కషి సంచాయ్ యోజన (పిఎంకెఎస్) సమీక్ష సమావేశంలో మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, తెలంగాణ మంత్రి హరీష్ రావు, 16 రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పిఎంకెఎస్ కింద ఉన్న 99 ప్రాజెక్టులపై సమీక్షించారు.

బోర్డు పరిధిని నోటిఫై చేయాలి: దేవినేని ఉమా, మంత్రి

సమావేశానంతరం మంత్రి దేవినేని మీడియాతో మాట్లాడుతూ కష్ణా నదీ జలాల యాజమాన్య బోర్డు(కెఆర్ఎంబి), గోదావరి నదీ జలాల యాజమాన్య బోర్డులకు (జిఆర్ఎంఆర్) సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. బచావత్ ట్రిబ్యునల్ తరువాత బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో వచ్చిన తీర్పులపై సుప్రీం కోర్ట్‌లో నేటికి వాదనలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచిన విధంగా కెఆర్ఎంబి పరిధిని నిర్ణయించాలని, దీని వలన ఆయకట్టు చివరి భూములకు కూడా నీరును అందించే వెసలుబాటు కలుగుతుందని ఇరు రాష్ట్రాల అధికారులు దీనిపై చర్చిస్తున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి అపెక్స్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం వున్నట్లు అధికారుల సమావేశంలో వెల్లడైనట్లు ఆయన తెలిపారు. నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల కింద చివరి ఆయకట్టు భూములకు సాగు నీటి సరఫరాలో ఈ ఏడాది అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లినట్లు, విభజన చట్టంలో పేర్కొన్నట్లు అమలు చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, ఇంజనీరింగ్ అధికారులు కేంద్ర అధికారులను కోరినట్లు చెప్పారు. పట్టిసీమలో 45 టిఎంసిలు తెలంగాణ హక్కు అని ఆరాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ తుది తీర్పు తరువాతే కృష్ణా బోర్డు పరిధి ఖరారు చేయాలని అన్నారు. జలవనరుల సమావేశం అసంపూర్తిగానే ముగిసిందని ఆయన అన్నారు.

అతని వల్ల నరకం చూశా

- సందీప్ కిషన్



సందీప్ కిషన్ చేసిన నూతన చిత్రం 'మనసుకు నచ్చింది'. మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం శుక్రవారమే విడుదల కానుంది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ విలేకరులతో మాట్లాడారు.

మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

నా పేరు సూరజ్. వాస్తవంగా నేను మిడిల్ క్లాస్ అబ్బాయిని. కానీ సినిమాలో మాత్రం డబ్బున్న వాళ్ళ ఇంట్లో పుట్టిన కుర్రాడిలా కనిపిస్తాను. అంటే దేన్నీ పెద్దగా పట్టించుకోకుండా లైట్‌గా తీసుకుంటుంటాను.

సినిమా ఎలా ఉండబోతోంది?

కొన్ని సినిమాల్ని కథలు నడుపుతాయి. ఇంకొన్ని సినిమాల్ని మూమెంట్స్ నడుపుతుంటాయి. ఈ సినిమా కూడా అందమైన మూమెంట్స్‌తో నడిచే సినిమా.

ఇది మీకెలా ప్రత్యేకం అనొచ్చు?

ప్రతి సన్నివేశం చాలా నూతనంగా అనిపిస్తుంది. ఇలాంటి పాత్రను, కథను నేనింతవరకు చేయలేదు. అందుకే నాకీ సినిమా స్పెషల్. ప్రేక్షకులంతా నన్ను ఒక కొత్త కోణంలో చూస్తారు.

మంజులగారి దర్శకత్వం ఎలా ఉంది?

చాలా బాగా చేశారు. ఎవరైనా చెప్పిన కథను చెప్పినట్టే స్క్రీన్ మీకు తీసుకురావడం అరుదుగా జరిగే విషయం. కానీ మంజులగారు మాత్రం చెప్పింది చెప్పినట్టే తీశారు.

ప్రకృతి పట్ల మీ అభిప్రాయం మారిందా?

మారింది. ఇంతకు ముందుకంటే ఇప్పుడు ఎక్కువగా లైఫ్‌ను ఎంజాయ్ చేయగలుగుతున్నాను. ప్రతి మంచి సందర్భాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇదివరకు నా కారిడార్‌లో సూర్యోదయం అయితే చూసేవాడిని కాదు. కానీ సినిమా చేశాక... ఎంత మిస్ అయ్యానో అనిపించింది.

మీ గత ఫైల్యూర్స్‌కి కారణం ఏంటో కనుకున్నారా?

మొదట్లో ఫన్ ఉండే సినిమాలు చేశాను. అవి సక్సెస్ అయ్యాయి. కానీ మధ్యలో కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు చేశాను. వాటిలో ఫన్ ఎక్కువగా ఉండదు. అందుకే అందరికీ కనెక్ట్ కాలేక విఫలమయ్యాయి.

అయితే రేపు రాబోయే సినిమలో ఫన్ ఉంటుందా?

చాలా ఉంటుంది. ఇదొక రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. చిన్న పిల్లల దగ్గర్నుండి పెద్ద వాళ్ళ వరకు అందరూ కలిసి కూర్చుకుని చూసే సినిమా ఇది.

మహేష్ బాబు సినిమా చూశారా?

పూర్తిగా చూడలేదు. కొన్ని రషెస్ చూశారు. బాగుందన్నారు. మొదటిరోజు కుటుంబంతో కలిసి చూస్తానని అన్నారు.

ఆ మధ్య నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ఎస్.కె.బషీద్ మీపై విమర్శలు చేశాడు. వాటిపై మీరు పెద్దగా స్పందించలేదు?

అనవసరమైన వాళ్ళందరి విమర్శలకు స్పందించడం ఎందుకని వదిలేశాను. రూ. 3 కోట్లకి ప్రమోషన్స్ చేశానని చెప్పి ఒక్క హోర్డింగ్ కూడా పెట్టలేదు. జైలుకెళ్ళొచ్చాడు, నిర్మాతల కౌన్సిల్ నుండి సస్పెండ్ అయ్యాడు. నిర్మాతలకి డబ్బులు కట్టకుండానే సెన్సార్ కాపీని తీసుకొచ్చి రిలీజ్ చేశాడు. అది పెద్ద మోసం. కనీసం తెలుగు టైటిల్స్ కూడా వేయలేదు. ఆ సినిమాను బాగా ప్రమోట్ చేసి రిలీజ్ చేసి ఉంటే నాకో మంచి హిట్ దక్కేది. కానీ అతని వల్ల పోయింది. అతని మూలంగా నరకం చూశాను.

మీ తదుపరి సినిమాలేంటి?

కార్తిక్ ఘట్టమనేనితో ఒక సినిమా ఉంది. నందిని అనే లేడీ డైరెక్టర్‌తో ఒక సినిమా చేస్తాను. కునాల్ కోహ్లీ సినిమా పూర్తై పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇవి కాకుండా తమిళంలో కార్తీక్ నరేన్‌తో 'నరగసూరన్' అనే సినిమా చేస్తున్నాను.

ఇంకా అసిస్టెంట్ డైరెక్టర్‌గా
రిజైన్ చేయలేదు

- నాని



కథానాయకుడు నాని నిర్మాతగా 'అ!' అనే సినిమాను నిర్మించారు. ఇప్పటివరకు ఏ భాషలోనూ రాని కాన్సెప్ట్ ఇందులో వుందనీ, సినిమా చూశాక 'అ!' అంటూ ఆశ్చర్యపరిచేలా వుంటుందని పేర్కొన్నారు. ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారమే విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలను వెల్లడించారు.

- నిన్న కొంతమంది స్నేహితులకు సినిమా చూపించాను. 'అష్టా చెమ్మా' అప్పుడు కూడా అదే ల్యాబ్‌లో అంతే టెన్షన్‌కు గురయ్యాను. దీన్నిబట్టి నాకర్థమయింది ఏంటంటే, ఎన్ని సినిమాలు చేసిన మనకు రిలీజ్ అనేది ప్రతిసారి అదే టెన్షన్.
- తెలుగులో డిఫెరెంట్ సినిమాలు రావడం లేదు. ఎవరూ చేయడం లేదు అనుకోవడం కన్నా, మనమే ఎందుకు చేయకూడదు అనుకుని చేసిన సినిమా ఇది. ఇండస్ట్రీలో ఇలాంటి మార్పు అవసరం అనిపించే ఈ సినిమాని నిర్మించాను.
- అటు 'కష్ణార్జున యుద్ధం' మూవీ, ఇటు ఈ సినిమా.. రెండు బ్యాలెన్స్ చేయడం చాలా కష్టమైంది. ప్రస్తుతం గోవాలో షిప్‌లో, సముద్రం మధ్యలో షూటింగ్ జరుగుతుంది. అస్సలు సిగ్నల్ ఉండదు. సిగ్నల్ ఎక్కడ దొరుకుతుందా వెదుక్కుని మరీ టీమ్‌తో కమ్యూనికేట్ అవ్వాలి. ప్రొడ్యూసర్ అన్నాక ప్రతి డిపార్ట్ మెంట్‌తో కనెక్ట్ అవ్వాలి. ఏం చేసినా ఇష్టపడే చేస్తాం కాబట్టి కష్టపడ్డా అందులో కిక్ ఉంటుంది. నిద్ర సరిపోకపోయినా ఎగ్జైట్‌మెంట్‌తో పొద్దునే లేచి కూర్చుంటాం.
- ఒక సినిమా వెనక ప్రొడ్యూసర్ పడే కష్టాలేంటనేది ఈ సినిమా ద్వారా తెలిసొచ్చింది. ఇంతకు ముందు కూడా తెలుసు. కాకపోతే ఈ సినిమాతో నిర్మాణ బాధ్యతలపై పూర్తి అవగాహన వచ్చింది.
- సినిమా అనేది ఆర్ట్‌తో పాటు బిజినెస్ కూడా ఇన్వాల్వ్ అవుతుంది. ఎప్పుడైతే బిజినెస్‌ని మైండ్‌లో పెట్టుకుంటామో, ఆర్ట్ వాల్యూ పడిపోతుంది. ఎలాంటి సినిమా తీస్తే ఆడుతుంది అని తీయడం వేరు. బిజినెస్ గురించి ఏ మాత్రం ఆలోచన లేకుండా, ఏదో కొత్తదనం ఎక్స్‌పెక్ట్ చేస్తున్న ప్రేక్షకుడి కోసం తీసిన సినిమా ఇది. ప్రస్తుతం ఉన్న సినిమా ఫార్మాట్ మారి కొత్తదనం రావాలని చేసిన సినిమా ఇది.
- నాకు కొద్దో గొప్పో పేరుంది, నేను చేసిన సినిమాలు ఈ మధ్య సక్సెస్ అవుతున్నాయి. కాబట్టి అదే నమ్మకంతో చాలా మంది నిర్మాతలు ముందుకు వచ్చారు. కానీ ఇది నేను చేస్తున్న రిస్క్, 'అ!' లాంటి డిఫెరెంట్ సినిమా చేయాలనేది నేను తీసుకున్న నిర్ణయం. కాబట్టి ఎవరినో ఎందుకు రిస్క్‌లో పెట్టాలి. అందుకే సినిమాని నేనే రిలీజ్ చేస్తున్నా. ఇది సక్సెస్ అయితే రెగ్యులర్ సినిమా ఫార్మట్ మారిపోతుంది.
- ఒక కొత్త కథని ఇంత డిఫెరెంట్‌గా, వివరంగా రాసుకుని నా దగ్గరికి వచ్చి కథ చెప్పగలిగాడంటే డైరెక్టర్‌గా సగం సక్సెస్ అయినట్టే. అందుకే కొత్త డైరెక్టర్.. చేయగలుగుతాడా లేదా? అనే అనుమానమే రాలేదు.
- కాజల్, నిత్యా మీనన్.. రెజీనా వీళ్ళంతా నాకోసం ఈ సినిమా చేయలేదు. కథ విని సినిమా చేశారు. ప్రతిదీ సినిమా ప్రాసెసింగ్‌లోనే జరిగింది. కాకపోతే వాళ్ళు ఒక్కో సినిమాకి 40నుంచి 45 రోజులు షూటింగ్ చేస్తారు, ఈ సినిమాకి అన్ని రోజులు చేయరు కాబట్టి, ఒక రెమ్యూనరేషన్ అనుకున్నారు.. దాన్ని బట్టే జరిగింది. నేను ప్రొడ్యూసర్ లాగానే ఉన్నాను. వాళ్ళు యాక్టర్స్ లాగానే చేశారు. ఇక్కడ ఎవరూ ఎవరి కోసం చేయలేదు. కథను నమ్మే చేశారు.
- మంచి సినిమాలు చేశాను. సాధారణ నటుడి స్థాయి నుండి సినిమా ప్రొడ్యూస్ చేసే స్థాయిలో ఈ రోజు ఉన్నానంటే, దాని వెనకాల చాలా మంది డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ ఉన్నారు. ఇప్పుడు నేను నిర్మాతను అయ్యాను కదా అని నా సినిమాలు నేను చేసుకోను. నేనెప్పుడూ అందుబాటులో ఉంటా.
- వాల్ పోస్టర్ బ్యానర్‌పై జస్ట్ డబ్బుల కోసమే సినిమా అస్సలు చేయను. మళ్ళీ ఇలాగే ఒక మంచి కథ వినిపించి, చేసేద్దామనిపించిన రోజే సినిమా చేస్తాను. ఏమో ఈ సినిమా తరవాత ఇంకొన్ని రోజులు సినిమా ప్రొడ్యూస్ చేయకపోవచ్చు.
- మొన్న సత్యం సినిమాస్ వాళ్ళు వచ్చి సినిమా చూసి కాసేపు అసలేమీ మాట్లడలేకపోయారు. ఆ తరవాత ఈ సినిమాని తమిళం, మలయాళంలో రిలీజ్ చేస్తున్నాం. మీరు రీమేక్ గురించి కూడా ఆలోచించ వద్దన్నారు. జస్ట్ డబ్బింగ్ చేసి రిలీజ్ చేద్దాం. స్ట్రయిట్ సినిమా అంత ఇంపాక్ట్ ఇస్తుందని చెప్పారు. ప్రస్తుతం డబ్బింగ్ దశలో ఉన్నాం.. త్వరలో, మళయాళ, తమిళ భాషల్లో రిలీజవుతుంది.
- ఈ కథ విన్నాక కూడా నేనే ప్రొడ్యూస్ చేయాలన్న ఆలోచన లేదు. ఎవరైనా మంచి ప్రొడ్యూసర్‌ని చూసి పెట్టాలి ఈ కుర్రాడికి అనుకున్నా. నాకు తెలిసిన సర్కిల్‌లో ట్రై చేశా. కానీ ఈ కథని నమ్మి చేసే ప్రొడ్యూసర్ కావాలి. అప్పుడనిపించింది నేనే ఎందుకు చేయకూడదని. నేను నమ్ముతున్నాగా.. అప్పుడు డిసైడ్ అయ్యా.
- ఏమీ లేని నాకు ఈ స్థాయి ఇచ్చింది సినిమానే, అందుకే సినిమా నాకేం ఇచ్చిందో అదే సినిమాకు కూడా ఇచ్చేయాలి. కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేస్తా. ఈ రోజు నా దగ్గరున్న ప్రతి రూపాయి సినిమా ఇచ్చిందే. అలాంటప్పుడు సినిమాకు పెట్టడంలో తప్పేంటి.
- సినిమా ఇండస్ట్రీలో మార్పుకి చాలా ప్రయత్నాలు చేశారు. వాల్ పోస్టర్స్ సినిమా బ్యానర్ పై కూడా డిఫెరెంట్ సినిమాలు వచ్చేవి. ఈ రోజు ఉన్న ఈ మార్పులో వాల్ పోస్టర్ సినిమాస్ ప్రయత్నం కూడా ఉంది అని చెప్పుకుంటే చాలు.. అప్పుడే నా కెరియర్ కి అర్థం ఉంటుంది.
- నా ప్రతి సినిమా కథని ట్రైలర్‌లో రివీల్ చేస్తుంటాం. ఎందుకంటే కథ పాతదే కానీ మనకు తెలిసిన ఒక ఇమోషనల్ జర్నీని ట్రావెల్ చేస్తాం అది నచ్చితే సినిమా హిట్టు. కానీ ఈ సినిమా అలా కాదు. మీకు ఈ సినిమాలో ఆశ్చర్యం కలుగుతుంది, చిరాకు కలుగుతుంది. ఆసక్తి కలుగుతుంది.. ఇలా అన్ని రకాల ఫీలింగ్స్ ఫీల్ అయి బయటికి వస్తారు.
- సినిమా కొంతమంది ప్రేక్షకులకు మాత్రమే నచ్చుతుంది. అందరికీ నచ్చకపోవచ్చు. ఒక ప్లేట్‌లో పిస్తా, బిర్యాని, పప్పన్నం ఎలా సర్వ్ చేయలేమో, అందరికీ ఒకేసారి నచ్చేలా సినిమా చేయలేం. ఎవరినీ టార్గెట్ చేసి సినిమా చేయలేదు.
- మన సినిమాలు మహా అయితే నేషనల్ లెవెల్‌కి వెళ్తాయి. కానీ నాకు మన సినిమాలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌కి వెళ్ళాలి. క్వాలిఫై అవ్వాలి. అ! సినిమాకి అంత వాల్యూ ఉందని నేను నమ్ముతున్నాను.
- నేను సెట్స్‌లో కార్వ్యాన్‌లోకి వెళ్ళేది జస్ట్ డ్రెస్‌చేంజ్ చేసుకోవడానికే. నా షాట్స్ అయిపోయి అంటే డైరెక్టర్‌కి అసిస్ట్ చేస్తుంటా. ఏమైనా కావాలన్నా చూసుకుంటూ ఉంటా. ఇంకా నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా రిజైన్ చేయలేదు. సినిమాలో బిగినింగ్‌లో నా పేరు వేసినా వేయకపోయినా డైరెక్షన్ డిపార్ట్ మెంట్‌లో లాస్ట్ కైనా నా పేరు వేయండి అని చెప్తుంటా.. కానీ వేయరు.
- శ్రీరామ్ ఆదిత్యతో సినిమా ఈనెల 24న ప్రారంభం అవుతుంది. ఇంకా పలు స్క్రిప్టులు డిస్కషన్స్ జరుగుతున్నాయి.

సప్తగిరికోసం కథను రాస్తున్న దర్శకుడు



సప్తగిరి

'బాహుబలి, భజరంగీ భాయ్ జాన్' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలకు కథలందించి దేశవ్యాప్త గుర్తింపు సంపాదించుకున్న రచయిత విజయేంద్రప్రసాద్. రాజమౌళి చేసిన దాదాపు అన్ని సినిమాలకు ఈయనే కథల్ని అందించారు. ఈమధ్య పాపులర్ రచయిత రాజమౌళి చేసే సినిమాలకు మాత్రమే కాకుండా బయటి సినిమాలకు కూడ కథల్ని అందిస్తున్నారు. మంచు విష్ణు హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించబోయే సినిమాకు విజయేంద్ర ప్రసాదే కథ అందిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం మేరకు ఈ రైటర్ కమెడియన్ నుండి హీరోగా మారిన సప్తగిరి తర్వాత సినిమాకు స్టోరి అందిస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి స్వర్ణ సుబ్బారావ్ దర్శకత్వం వహించబోతున్నాడు. త్వరలో ఈ సినిమా ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ మూవీ కోసం నటీనటుల ఎంపిక జరుగుతోందని తెలుస్తోంది.

మరోసారి
రణ్‌వీర్, దీపికా జంటగా..



బాలీవుడ్‌లో భారీ సెట్టింగులతో చారిత్రక సినిమాలు తీసే దర్శకుడిగా సంజయ్ లీలా భన్సాలీకి గొప్ప పేరుంది. పీకల్లోతు ప్రేమలో మునిగిపోయి రేపోమాపో ఒక్కటవబోతున్నారనుకంటున్న ప్రేమ జంట రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకునే ఆయన దర్శకత్వంలో ఇదివరకే రామ్ లీలా, బాజీరావ్ మస్తానీ, పద్మావత్ చిత్రాలు చేశారు. బాలీవుడ్‌లో ఇపుడు మరో వార్త చక్కర్లు కొడుతోంది. వారిద్దరూ కలిసి ఆయన దర్శకత్వంలోనే మరో మూడు చిత్రాల్లో నటించనున్నారట. దీనికి సంబంధించి వారి మధ్య డీల్ కూడా కుదిరిందని బాలీవుడ్ ట్రేడ్ పత్రికయిన 'ఆసియన్ ఏజ్' ఉటంకించింది. వారిద్దరి నటన మాత్రమే కాక ప్రొఫెషన్ పట్ల వారి అంకితభావానికి ఆయన ఫిదా అయిపోయారని, అందుకే వారితో మళ్లీ కలిసి పనిచేయాలని ఆయన డిసైడ్ అయ్యారట. పద్మావత్ సినిమా షూటింగ్‌కు, ఆ చిత్రం విడుదలకు అడ్డంకులు ఎదురైనప్పుడు వారు ఎంతో సహనంతో సహకరించడం భన్సాలీకెంతో నచ్చిందట. అందువల్ల వారిద్దరితో ఆరేళ్ల పాటు మూడు సినిమాలకు ఆయన డీల్ కుదుర్చుకున్నారట.

ఆకాష్ 'కొత్తగా ఉన్నాడు'



కథానాయకుడు ఆకాష్ తాజాగా తెలుగులో నటించిన చిత్రం 'కొత్తగా ఉన్నాడు'. రాజా మీడియా వరల్డ్ సమర్పణలో జై బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై ఎం.కె.రాజా నిర్మిస్తున్నారు. ఆకాష్ సరసన ప్రియ, సోనియా హీరోయిన్లుగా నటించారు. ఎం.రాధా దర్శకత్వం వహించారు. యు.కె.మురళి సంగీతం సమకూర్చారు. ఈ చిత్రం ఆడియో వేడుక ప్రసాద్ ల్యాబ్ ప్రివ్యూ థియేటర్‌లో ఘనంగా జరిగింది. ఆడియోతోపాటు ట్రైలర్ కూడా విడుదల చేశారు.

సినిమా టైటిల్ లానే ఆకాష్ చాలా కొత్తగా ఉన్నాడని, ఈ సినిమాతో అతనికి మళ్ళీ పెద్ద హిట్ రావాలని వేడుకలో పాల్గొన్నవారంతా ఆకాంక్షించారు. లండన్ నేపథ్యంలో జరిగే ఈ కథలో ఆంధ్ర కుర్రాడిగా, తెలంగాణ కుర్రాడిగా రెండు షేడ్స్ కలిగిన పాత్రలో నటించానని, విక్రమ్ 'అపరిచితుడు' తరహాలో అందర్నీ అలరిస్తుందని' ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే కూడా సమకూర్చిన హీరో ఆకాష్ అన్నారు. చిత్రంతో తెలుగు సినిమా నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతుండడం ఆనందంగా ఉందని, ఈ చిత్రంతో తనకు మంచి బోణి లభిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత ఎం.కె.రాజా అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: షాన్, ఎడిటింగ్: ప్రేమ్.

క్లీన్ యు సర్టిఫికెట్‌తో 'గోలీసోడా'



కృష్ణభగవాన్, మానస్, నిత్యనరేష్, సత్యసింధుజ, హరిబాబు

ఎస్.బి క్రియేషన్స్ పతాకంపై చక్రసేద్ సమర్పించు చిత్రం 'సోడా గోలీ సోడా'. 'మొత్తం గ్యాస్' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న చిత్రానికి నిర్మాత భువనగిరి సత్య సింధూజ, దర్శకుడు మల్లూరి హరిబాబు. మానస్, నిత్య నరేష్, కారుణ్య హీరో హీరోయిన్స్‌గా నటించారు. శుక్రవారమే విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సత్య సింధూజ మాట్లాడుతూ.. పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా తెరకెక్కించడం జరిగింది. సీనియర్ నటీనటులందరూ మాకు సహకరించారు. మెసేజ్ ఒరియెంటెడ్ సినిమా కనుక తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నానన్నారు. దర్శకుడు హరిబాబు మాట్లాడుతూ.. కుటుంబం మొత్తం కలసి చూసే వినోదాత్మక చిత్రాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతోనే చేసిన సినిమా. 'క్లీన్ యూ' సర్టిఫికేట్ వచ్చిన ఈ సినిమా రెండు గంటలు ఆద్యంతం ప్రేక్షకులను నవ్విస్తుంది. ఇండస్ట్రీలోని కమెడియన్స్ అందరూ ఈ సినిమాలో ఉన్నారు. మానస్, నిత్య, కారుణ్య సినిమాను అంగీకరించి ఇష్టంతో కష్టపడి పనిచేశారని తెలిపారు. హీరో మానస్ మాట్లాడుతూ.. సినిమా పూర్తిస్థాయి వినోదాత్మకంగా ఉంటుంది. కుటుంబం మొత్తం హ్యాపీగా కలసి చూసే సినిమా ఇది. పాల కొల్లు అందాలు, హైదరాబాద్ బ్యూటీ ఫుల్ లొకేషన్స్ లలో షూటింగ్ జరుపుకున్నాం. భరత్ మ్యూజిక్ చక్కగా అందించారని అన్నారు. 'ఒక మంచి కథను ప్రేక్షకులకు అందిం చాలనే తపనతోనే దర్శక నిర్మాతలు తెరకెక్కించారని' కృష్ణభగవాన్ అన్నారు.

పైరసీ వచ్చిందని బాధపడ్డా : మోహన్‌బాబు

మోహన్ బాబు కీలక పాత్రలో నటించిన సినిమా 'గాయత్రి'. ఈ సినిమాలో ఆయన నట విశ్వరూపాన్ని చూడొచ్చు. ఆయనతో పాటు ఆయన తనయుడు మంచు విష్ణు కూడా తండ్రికి ఏమాత్రం తగ్గకుండా చేశాడు. దీంతో ఈ సినిమా మొదటి రోజు నుంచే మంచి సక్సెస్ టాక్‌తో నడుస్తోంది. ఈ సినిమా అభినందన సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడారు. రిలీజ్ చేసిన నాడే యూట్యూబ్‌లో సినిమా వచ్చేసింది. దీన్ని ఏమనాలి? ఇంట్లో పెద్దలనుబట్టే సంసారం నడుస్తుంది. వారిని బట్టే పిల్లలు పెరుగుతారు. ఇప్పటి యువత పైరసీతో నీచాతినీచంగా తమ మేథస్సును ఉపయోగించి వ్యాపారం చేయడం ఎంతో బాధేసింది. అటువంటి సినిమాను చూసిన వారూ ఎంకరేజ్ చేయవద్దు. దీనివల్ల దేశం ముందుకు పోదు. ఎన్నో కుటుంబాలు సినిమాను నమ్ముకుని బతుకుతున్నాయి. ఇది గ్రహించండి.. అని వేడుకున్నారు.



పృథ్వీ, రాజారవీంద్ర, మోహన్‌బాబు, మదన్ తదితరులు



అగ్రిప్లస్

సూపర్ నేపియర్ గడ్డి

థాయిలాండ్‌లో అభివృద్ధి చేసిన నేపియర్ ఫ్యామిలీకి చెందిన గడ్డి సూపర్ నేపియర్. ఈ గడ్డిని అభివృద్ధిపరిచింది డాక్టర్ కైలాష్ కియోధాంగ్. ఈ గడ్డి రకాన్ని మన రాష్ట్రంలోనూ సాగు చేస్తున్నారు. భారతదేశంలో అత్యంత అరుదుగా లభించే ఈ గడ్డి ఎకరాకు 150 నుంచి 200 టన్నులు ఉత్పత్తవుతుంది. దీనితో ఏడాది పొడవునా 10 నుంచి 12 పశువులకు సరిపడా గ్రాసం అందుతుంది. ఒకసారి సాగుచేస్తే ఎనిమిది కోతలు కోసుకోవచ్చు. శీతాకాలం, వేసవి, వర్షాకాలాల్లోనూ సాగుకు అనుకూలిస్తుంది. దీని ఎత్తు 15 నుంచి 20 అడుగుల వరకూ ఉంటుంది. కాండం చాలా తియ్యగా ఉంటుంది. పశువులు ఎంతో ఇష్టంగా తింటాయి. అధిక పాలను ఉత్పత్తి చేస్తాయి. బలవర్థకంగా ఉంటుంది. నేల విలువ పెరిగి, సాగు భూములు మాయమైపోతున్న ప్రస్తుత తరుణంలో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పోషకాలు కలిగిన సూపర్ నేపియర్‌ను సాగు చేసుకుంటే ప్రయోజనకరం అంటున్నారు వైద్యాధికారులు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం పదండి..

బహువార్షికపు పశుగ్రాసమైన సూపర్ నేపియర్ గడ్డి పాడి పోషణకు అత్యంత ప్రయోజనకరం. ఈ గడ్డి మొక్కలను వేర్లతో సహా తీసుకోవాలి. ఒక్కో మొక్కను 7-8 ముక్కలు చేసుకోవాలి. రెండు కణుపులు ఉండేలా చూసుకోవాలి. మూడడుగుల విస్తీర్ణంలో నాటుకోవాలి. ఒక్కో కణుపు 15 నుంచి 20 అడుగుల ఎత్తు వరకూ పెరుగుతుంది. నాటిన 70 రోజులకు తొలి కోత వస్తుంది. ఆ తర్వాత ప్రతి 45 రోజులకు గడ్డి కోసుకోవచ్చు.

మిన్నైన గడ్డి

సూపర్ నేపియర్ గడ్డి కో-4, కో-5 గడ్డిలకన్నా మంచి దిగుబడి ఇస్తుంది. దీనిలో మాంసకృత్తులు 13% శాతం పైన ఉన్నాయి. కో-4 తో (9% ప్రోటీన్) పోలిస్తే 4% ఎక్కువ మాంసకృత్తులు ఉన్నాయి. దీన్ని వ్యవసాయంగా చేపట్టి, బాగా సాగు చేస్తే ఎకరాకు సంవత్సరానికి 300 టన్నులపైన దిగుబడి ఇస్తుంది. సుమారుగా రోజుకు ఒక గేదెకు 1/2 లీటరు పాల దిగుబడి పెరుగుతుంది. ఎస్ ఎన్ ఎఫ్ శాతము పెరుగుతుంది. ఒక గంటలో ఒక మనిషి 250 kgల గడ్డి కోయగలడు. ఈ గడ్డి 10 పశువులకు సరిపోతుంది. ఈ విధంగా కూలీ ఖర్చు బాగా తగ్గుతుంది. పాల ఉత్పత్తి వ్యయమూ తగ్గుతుంది.

అనుకూలమైన నేలలు : నీటి ముంపుకు గురికాని నేలలు, చౌడు భూములు తప్ప అన్నిరకాల నేలలూ పనికొస్తాయి.





నీరు : చేనులో నీరు నిల్వ ఉండేలా నీరు పెట్టకూడదు. కేవలం ఆరుతడిగానే ఇవ్వాలి. వేసవి కాలములో తప్ప సాధారణంగా 10 రోజులకు ఒకసారి నీటి తడి సరిపోతుంది.

సాగు పద్ధతి

✧ మొదట భూమిని రెండు లేక మూడు పర్యాయాలు దుక్కి చేయాలి. ఎకరాకు 10 టన్నులు బాగా చివికిన పెంట (FYM) భూమిలో వేసి, బాగా కలియదున్నాలి.

✧ కణుపులని నాటే ముందు ఎకరాకు యూరియా 25 kg + N P K 15 : 15 : 15 కానీ యూరియా 50 kg డీఏపీ 25 kg పోటాష్ 25 kg వేయాలి. రెండు అడుగుల దూరంలో బోదెలు చేసుకోవాలి. బోదెలకి ఇరువైపులా కణుపులని నాటాలి. నీరు నిలవని నేలలైతే బోదెలు చేయకపోయినా ఫర్వాలేదు.

✧ కణుపులని 45 డిగ్రీలు ఉండేటట్లు, ఒక కణుపు భూమి లోపలకు రెండవ కణుపు భూమిపైకి (భూమికి తగిలేటట్లు) గుచ్చాలి. కణుపుకు కణుపుకు మధ్య రెండడుగుల దూరము ఉండేటట్లు నాటాలి.

✧ కణుపులను నాటేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలి. కణుపు కిందిభాగం మాత్రమే నేలలోకి గుచ్చాలి. కణుపు తిరగేసి గుచ్చితే మొక్క మొలవదు.

✧ నాటిన మూడోరోజున నీరుపెట్టాలి. చేలో నీరు నిల్వ చేయకూడదు. కేవలం ఆరుతడినే ఇయ్యాలి.

✧ నాటిన ఎనిమిది రోజులకు అవసరాన్నిబట్టి నీటి తడులు ఇవ్వాలి. నాటిన ఆరు రోజుల నుంచి మొలకెత్తడం మొదలవుతుంది. సుమారుగా 12 రోజులకు అన్ని కణుపులూ మొలకెత్తుతాయి. ఈ సమయంలో మొక్కలురాని మొక్కల స్థానములో కొత్త మొక్కలు (కణుపులు) నాటుకోవాలి. నేలలో తేమ ఆరిపోకుండా చూసుకోవాలి.

✧ నాటిన వారం తర్వాత నుంచి కలుపు తీయించాలి. నాటిన 30 రోజులకు ఎకరాకు 25 కేజీ యూరియా npk 15 : 15 : 15 50 kg మొక్కల మొదట్లో కొంచెం దూరంగా వేయాలి. నాటిన 45 రోజుల వరకూ కలుపు రాకుండా జాగ్రత్త వహించాలి. తర్వాత గడ్డి రెండడుగుల ఎత్తు దాటాక, ఇక కలుపు రానీయదు.

✧ నాటిన 80 రోజలకు మొదటికోత వస్తుంది. తర్వాత ప్రతి 38-45 రోజులకు ఒక కోత వస్తుంది. తదనంతరం ప్రతికోతకూ తడి ఇచ్చి, ఎకరానికి 2 1/2 బస్తాల (125 కేజీ) యూరియా వేయాలి. ప్రతి ఆరునెలలకు ఒకసారి ఎకరాకు ఐదు టన్నుల పెంట వేయాలి. ముఖ్యంగా సెప్టెంబర్ నెలలో పెంట వేయటం మానకూడదు. ఎందుకంటే, ఈ గడ్డి జాతులు (నేపియర్ జాతులు) శీతాకాలంలో బాగా పెరగవు. ఈ విధంగా పెంట వేయటం వలన గడ్డి బాగా పెరుగుతుంది.

✧ ప్రతి సంవత్సరం క్వార్టెనింగ్ చేయాలి. క్వార్టెనింగ్ అంటే మూడుభాగాలు తొలగించి, ఒక భాగం ఉంచడం. ఈ విధంగా చేస్తే గడ్డి బాగా ఎదుగుతుంది.



పోషక విలువలు ఎక్కువ ఉన్న ఈ సూపర్ నేపియర్ గడ్డిని చెన్నూరు మండలం ఉప్పరపల్లె గ్రామంలో నాగమల్లా రెడ్డి (9849495665) అనే ఔత్సాహిక రైతు దగ్గర ప్రస్తుతం అందుబాటులో ఉంది. రాజధాని ప్రాంతం గన్నవరం పశు వైద్యకళాశాల సమీపం కేసరపల్లిలోనూ సాగు చేస్తున్నారు. అంతేకాదు, రాష్ట్రంలోని అన్ని పశుగణ క్షేత్రాలకు ఇక్కడి నుంచే పంపుతున్నారు. ఊరూరా పశుగ్రాస క్షేత్రాలకు కావాల్సిన విత్తనం అందజేస్తున్నారు. ఆసక్తి ఉన్న స్థానిక రైతులకూ పంపిణీ చేస్తారు. పోషక విలువలున్న ఈ గడ్డిని సాగు చేసుకుంటూ, పాల దిగుబడి పెంచుకోవడం వల్ల ఎంతో లాభదాయకం.

సూపర్ నేపియర్	కో-4 , కో-5
సాలీనా ఎకరాకు 250 టన్నుల పచ్చిమేత లభిస్తుంది	సాలీనా ఎకరాకు180 టన్నుల పచ్చిమేత లభిస్తుంది
మాంసకృత్తుల శాతం - 13%	మాంసకృత్తుల శాతం - 9%
కో-4, కో-5 కంటే కాండము లావు ఎక్కువ	సూపర్ నేపియర్ కంటే కాండము లావు తక్కువ
ఒక దుబ్బుకు 4 kgల కన్నా ఎక్కువ గడ్డి లభిస్తుంది	ఒక దుబ్బుకు 2 kg ల గడ్డి లభిస్తుంది
TDN 58% - 60%	TDN 54% - 56%
కాండము తియ్యగా ఉంటుంది. కనుక పశువులు ఇష్టంగా తింటాయి	కాండము తీపి తక్కువ
కో-4 కంటే, రోజుకు 1/2 లీ. కంటే పాల దిగుబడి పెరుగుతుంది	పాల దిగుబడి సూపర్ నేపియర్ కన్నా తక్కువగా ఉంటుంది
45 రోజులకు ఒక కోత ఇస్తుంది	40 రోజులకు ఒక కోత ఇస్తుంది
15 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది.	10 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది.

డాక్టర్.జి.రాంబాబు,
డాక్టర్.శ్రీకాంత్ రెడ్డి,
పశువైద్యాధికారులు, కడప.



పాలుపోసుకునే దశలో

రాష్ట్రంలో సాగులో ఉన్న మొక్కజొన్న, నువ్వులు, సజ్జ పంటల్లో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు అందిస్తున్న వివరాలు



మొక్కజొన్న:

➢ నవంబరు మాసంలో వేసుకున్న రబీ మొక్కజొన్న గింజ పాలు పోసుకొనే దశలో ఉంటుంది. ఈ దశలో పక్షుల బెడద నుంచి పంటను కాపాడుకోవడానికి చర్యలు చేపట్టాలి.

➢ శబ్ద పరికరాలు ఉపయోగించి లేదా మెరిసే రిబ్బన్లను పైరుకు ఒక మీటరు ఎత్తులో ఉత్తర, దక్షిణ దిశల్లో కట్టాలి. లేదా పైరు చుట్టూ 2-3 వరుసలలో కంకి పక్కనున్న ఆకులతో కంకిని చుట్టడం చేయాలి.

నువ్వులు :

➢ మొక్కల సాంద్రత తగినంతగా ఉండేలా చూసుకోవాలి. మొక్కల మధ్య దూరం 15 సెం.మీ. ఉండేలా వత్తుగా ఉన్న మొక్కలను పలుచన చేయాలి.

➢ విత్తిన 30 రోజుల తర్వాత పూత దశలో ఎనిమిది కిలోల నత్రజని వేసి, నీరు పెట్టాలి.

➢ ఆకుముడత పురుగు ఆశించినట్లయితే మోనోక్రొటోఫాస్ లీటరు నీటికి 1.6 మి.లీ. చొప్పున కలిపి, చల్లాలి.

➢ బూడిద తెగులు ఆశించినట్లయితే నీటిలో కరిగే గంధకం లీటరు నీటికి 3-4 గ్రా. చొప్పున కలిపి, చల్లాలి.


సజ్జ :

➢ పంట విత్తిన / నాటిన మూడు వారాలకు దంతులతో ఎడసేద్యం చేయాలి. దంతులతో అంతరకృషి చేయడం ద్వారా కలుపు మొక్కలు చాలా వరకూ తొలగిపోతాయి. సాళ్ళలో తేమ ఆరకుండా మొక్కలకు అందుతుంది.

➢ కలుపు తీసిన తర్వాత 3-4 రోజులకు నీటి తడివ్వాలి. నీటి తడి ఇచ్చేటప్పుడు ఎకరాకు 16 కిలోల నత్రజని ఇచ్చే ఎరువులను పైపాటుగా వేయాలి.

➢ మొక్కలపై, ఆకుల మీద మచ్చలు ఎక్కువగా కనిపిస్తే లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 1 గ్రా. కార్బండైజిమ్ చొప్పున కలిపి, పైరుపై పిచికారీ చేయాలి.

మరిన్ని వివరాలకు మీ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ లేదా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్‌ను సంప్రదించగలరు. రైతులు మరిన్ని సలహాల కోసం ఈ ఉచిత నంబరుకూ కాల్ చేయవచ్చు-1800 425 0430



డా. కె. రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.



వేసవిలో మినుము, పెసర



వేసవిలో ఫిబ్రవరి నుంచి మార్చి 15 వరకు విత్తుకోవచ్చు. పైరు పూత సమయంలో అధిక ఉష్ణోగ్రతకు గురికాకుండా చూసుకోవాలి. వేసవిలో సాగుచేసే మినుము, పెసర రకాలు తక్కువ కాలంలో కాపుకు వచ్చి బెట్టను, వేడిని తట్టుకునేవిగా ఉండాలి. వేసవిలో రసంపీల్చే పురుగులు, వైరస్ తెగుళ్ళు ఎక్కువగా వస్తాయి. కాబట్టి వీటిని తట్టుకుని అధిక దిగుబడినిచ్చే రకాలను సాగుకు ఎంచుకోవాలి.

మినుము: ఎల్.బి.జి 752, ఎల్.బి.జి 20, పి.యు 31, ఎల్.బి.జి 787, టి.బి.జి 104 రకాలు అనువైనవి. మినుము వేసవిలో ఆరుతడి పంటగా సాగుచేస్తే 8-10 కిలోలు/ఎకరాకు, వరి మాగాణులలో అయితే 16-18 కిలోలు/ఎకరానికి విత్తుకోవలసి ఉంటుంది.

పెసర: ఎల్.జి.జి 460, ఎల్.జి.జి 407, ఐ.పి.యం 2-14, డబ్ల్యు.జి.జి 42, టి.యం 96-2. పెసర వేసవిలో ఆరుతడి పంటగా సాగుచేస్తే 6-7 కిలోలు/ఎకరాకు, వరిమాగాణులలో అయితే 12 కిలోలు/ఎకరాకు విత్తుకోవలసి ఉంటుంది.

విత్తనశుద్ధి: ఒక కిలో విత్తనానికి 5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ లేక 5 గ్రా థయోమిథాక్సామ్ 70 డబ్ల్యు.ఎస్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. ఈ పైరును కొత్తగా పండించేటప్పుడు, రైజోబియం కల్చరును విత్తనంతో కలిపి విత్తితే అధిక దిగుబడి పొందవచ్చు. ★





చిన్నారి

పొడుపు కథ

ముందు కాళ్ళు చిన్నన,
వెనక కాళ్ళు పెద్దన,
పొట్ట సంచిలో.. ఓ పిల్ల,
ఏమిటది?

జవాబు : కంగారు

జోక్ :

తండ్రి : ఏంట్రా.. రవీ! శీతాకాలమైన మన పెరట్లో మొక్కలు వాడిపోతున్నాయి?
రవి : మొక్కలు చలికి తట్టుకోలేవని నేనే వేడి నీళ్లు పోస్తున్నాను నాన్నా!

దారి చూపండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలో నుంచి బయటకు వెళ్ళడానికి దారిని చూపించండి!

అతిపెద్ద నౌకాదళ మ్యూజియం

పిల్లలూ! మనం ఇంత క్షేమంగా ఉన్నామంటే కారణం ఎవరో తెలుసా? వారి కుటుంబాలకు దూరంగా, దేశ రక్షణ కోసం ప్రాణాలనే ఫణంగా పెట్టి, శత్రువులతో పోరాడుతుంటారు. వారు రక్షణగా ఉండబట్టే మనం స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతుకుతున్నాం. వారే నౌకాదళం వారు. అసలు వారెలా మనల్ని ఎలా కాపాడుతున్నారో మీకు తెలుసుకోవాలని ఉంది కదూ?! కానీ భద్రతాకారణాల రీత్యా నౌకాదళానికి చెందిన వివరాలు నాలుగు గోడలూ దాటి బయటకు రావు. అందుకే వారు వినియోగించిన వస్తువులు, నమూనాలను, చరిత్రకు సంబంధించిన వివరాలను, ప్రజలకు తెలిసే విధంగా అందుబాటులో ఉంచాలనే సంకల్పంతో తూర్పు నౌకాదళం వీటిని భద్రంగా ఒకచోటకు చేర్చింది. దేశంలోనే అతిపెద్ద నౌకాదళ ప్రదర్శనశాలగా 'మారిటైమ్ మ్యూజియం'ను రూపొందించారు. ఇదెక్కడో లేదు.. మన రాష్ట్రంలోని విశాఖపట్టణంలోనే. నౌకాదళానికి సంబంధించిన అతిపెద్ద పురావస్తు ప్రదర్శనశాల ఇది.





మ్యూజియంలోకి అడుగుపెట్టగానే భారత నౌకాదళ తొలి ప్రధానాధికారి కటారి రామదాస్ విగ్రహం ఉంటుంది. ఈ విగ్రహానికి ఒకవైపు భారత జాతీయ పతాకం, మరోవైపు నౌకాదళ పతాకం రెపరెపలాడుతూ ఉంటాయి. ప్రాచీన భూగోళ చరిత్రకు సంబంధించిన పటాలు, రెండు శతాబ్దాల క్రితం తయారుచేసిన తుపాకులతో కూడిన ఓ యుద్ధనౌక, బ్రిటీష్ నుంచి భారత నౌకాదళ అమ్ముల పొదిలోకి చేరిన ఐ.ఎన్.ఎస్. ఢిల్లీనౌక ఈ ప్రదర్శనశాలలో దర్శనమిస్తాయి.



నౌకాదళం దేశ రక్షణే లక్ష్యంగా సముద్రంపై అహోరాత్రులు పడే కష్టాలను సైతం ఈ ప్రదర్శనశాలలో చూడొచ్చు. రెండు వందల సంవత్సరాల క్రితం ఉపయోగించిన మత్స్యయంత్రం, లైట్ హౌస్‌లు, బోటు దిక్సూచి, ఫిరంగి గుళ్ళు, క్షిపణులు, టార్పెడోలు వంటివి ఎన్నో ఈ ప్రదర్శనశాలలో ఉన్నాయి. ★

నేను గీసిన బొమ్మ





జి.అభిషేక్ నారాయణ రెడ్డి
ఏడవ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్
సీతారాంపురం

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

ఫిగర్ స్కేటింగ్‌లో స్వర్ణం గెలిచిన జర్మనీ జంట



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా) : దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో జర్మనీ జంట ఫిగర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించింది. గురువారం జరిగిన ఫిగర్‌స్కేటింగ్ జంపింగ్ విభాగంలో అల్జోనా సావ్చెంకో మరియు బ్రూనో మస్సోట్‌లు జర్మనీకి తొలి స్వర్ణం సాధించారు. చైనా జంట డబ్ల్యు.జె. సూయి, హన్‌సి జోడీకి రజితం, కెనడా జోడీకి కాంస్య పతకాలు లభించాయి. ఆల్‌ఫైన్ స్కీయింగ్ మహిళల విభాగంలో అమెరికాకు చెందిన షిఫ్రిన్‌కు బంగారు, నార్వేకు చెందిన మైనిక్వెల్‌కు రజిత, ఇటలీకి చెందిన బ్రిగ్‌నోన్‌కు కాంస్య పతకాలు లభించాయి. 10 కిలోమీటర్ల ఆల్ఫెన్సియా క్రాస్ కంట్రీ రేస్ మహిళల విభాగంలో నార్వేకు చెందిన హాగా 25.00.5 టైమింగ్‌తో బంగారు పతకం సాధించగా... స్వీడన్‌కు చెందిన కాకా (-20.3), నార్వేకు చెందిన బియోర్గిన్ (-31.3) సెకన్లు, ఫార్వకోస్కీ (ఫిన్లాండ్)లు రజిత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు.

వింటర్ ఒలింపిక్స్ పతకాల పట్టిక

	బం	ర	కాం	మొ
1. నార్వే	6	7	4	17
2 జర్మనీ	9	2	4	15
3 కెనడ	4	5	4	13
4 నెదర్లాండ్స్	5	5	2	12
5 అమెరికా	5	1	2	8
6 జపాన్	0	4	3	7
7 ఫ్రాన్స్	3	1	2	6
8 ఆస్ట్రియా	2	1	3	6
9 స్వీడన్	3	2	0	5
10 ఇటలీ	1	1	3	5
11 ఒలింపిక్ అథ్లెట్ ఫ్రం రష్యా	0	1	4	5
12 ఆస్ట్రేలియా	0	2	1	3
13 ఫిన్లాండ్	0	0	3	3
14 కొరియా	1	0	1	2
15 చైనా	0	2	0	2
15 స్లొవేకియా	0	2	0	2
17 చెక్ రిపబ్లిక్	0	1	1	2
17 స్విట్జర్లాండ్	0	1	1	2
19 స్లొవేనియా	0	1	0	1
20 కజకిస్తాన్	0	0	1	1

శ్రీలంక విజయం

ఢాకా : బంగ్లాదేశ్-శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న తొలి టీ20లో శ్రీలంక 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గురువారం టాస్‌గెలిచిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీస్కోర్ సాధించింది. రహీమ్, సర్కార్ అర్ధసెంచరీలతో రాణించారు. అనంతరం ఆ లక్ష్యాన్ని లంక జట్టు 16.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు పొందిన ఓపెనర్ కుషాల్ మెండిస్ 27 బంతుల్లో 53 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఇరుజట్ల మధ్య రెండవది, చివరి టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.

ఇషాంత్‌కు లక్కీఛాన్స్



లండన్ : టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ ఇషాంత్ శర్మకు లక్కీఛాన్స్ దక్కింది. ఇంగ్లండ్ కౌంటీల్లో జరిగే ససెక్స్ క్లబ్ తరఫున ఆడేందుకు గురువారం సంతకం చేశాడు. ఢిల్లీకి చెందిన ఇషాంత్ శర్మ ససెక్స్ జట్టు తరఫున తొలిసారి ఆడనున్నాడు. ఈ కౌంటీ మ్యాచ్‌లు ఏప్రిల్ 4 నుండి జూన్ 4 వరకు జరగనుండగా... ఇంతకుముందు ఈ క్లబ్ తరఫున పటౌడీ, పియూష్ చావ్లాలు ఆడారు. రాబోయే కౌంటీ సీజన్‌లో భారతదేశం తరఫున పాల్గొంటున్న రెండో క్రీడాకారుడు ఇషాంత్. ఇంతకుముందు పుజారా కూడా కౌంటీల్లో ఆడేందుకు సంతకం చేసి ఉన్నాడు. వీరిద్దరినీ ఐపిఎల్-11లో ఏ ఫ్రాంచేజీ కొనుగోలు చేయని కారణంగా క్లబ్‌లలో ఆడేందుకు అంగీకరించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు వీరపనేనిగూడెం బాలికలు ఎంపిక

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా)

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు కృష్ణాజిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టు శిక్షకులు గండికోట అశోక్ తెలిపారు. గన్నవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి సీనియర్ బాలబాలికల ఛాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టు బయలుదేరినట్లు చెప్పారు. జట్టులో వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన బి.మౌనిక, ఎస్‌కె.రేష్మా, ఎస్.రెజియా ఉన్నారని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో వీరు చక్కటి క్రీడా నైపుణ్యం ప్రదర్శించడంతో జైపూర్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

రిజర్వ్ బెంచ్‌కు ఛాన్స్



కోహ్లి



మార్క్రమ్

దక్షిణాఫ్రికా గడ్డపై తొలిసారి సిరీస్ విజయం దక్కించుకొని చరిత్ర సృష్టించిన టీమిండియా చివరి మ్యాచ్‌లో రిజర్వ్ బెంచ్ బలాన్ని పరీక్షించుకోనుంది. నేడు జరిగే ఆరో వన్డేలో తుది జట్టులో కొన్ని మార్పులు చేస్తామని టీమిండియా సారథి విరాట్ కోహ్లి తెలిపాడు. సఫారీతో వన్డే సిరీస్‌కు 17 మంది సభ్యులు ఎంపికైనా... భారతజట్టు ఇప్పటికి 12 మంది సభ్యుల సేవల్నే వినియోగించుకుంది. దాంతో రిజర్వ్ బెంచ్ క్రీడాకారులకు నేడు జరిగే ఆఖరి వన్డేలో అవకాశం దక్కనుంది.

నేడు దక్షిణాఫ్రికాతో చివరి వన్డే

సాయంత్రం 4.30 గం॥ల నుంచి

సెంచూరియన్: ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు దక్షిణాఫ్రికాతో జరగనున్న ఆరో వన్డేలో భారత్ జట్టు భారీ మార్పులతో బరిలోకి దిగనుంది. సఫారీ గడ్డపై తొలిసారి సిరీస్ విజయాన్ని సొంతం చేసుకున్న ఆనందంలో ఉన్న కోహ్లి సేన చివరి వన్డేను కూడా గెలిచి 5-1తో గ్రాండ్‌గా ముగించాలని చూస్తోంది. కాగా... చివరి వన్డేను గెలిచి భారత్ ఆధిక్యాన్ని తగ్గించాలని సఫారీ జట్టు కూడా యోచిస్తోంది. భారత జట్టుకు ఈ మ్యాచ్ నామమాత్రం కావడంతో భారీ మార్పులు చోటు చేసుకొనే అవకాశం లేకపోలేదు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు రిజర్వు బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లను నేటిమ్యాచ్‌లో బరిలోకి దింపాలని సారథి, కోచ్‌లు భావిస్తున్నారు.

తొలి ఐదు వన్డేల్లో మనీష్ పాండే, దినేశ్ కార్తీక్, మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్, అక్షర్ పటేల్‌లు రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యారు. అయితే, సిరీస్ ఫలితం ఇప్పటికే తేలినా తమ పంథా మారబోదని... ఈ సిరీస్ పూర్తయ్యాక మేం ఏయే అంశాల్లో మెరుగవ్వాలో కూర్చొని చర్చిస్తామని... మేం సిరీస్‌ను 5-1తో ముగించాలని కోరుకుంటున్నామని కోహ్లి తెలిపారు.

వన్డే సిరీస్ ముగిశాక టీ20 సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో దానిని దృష్టిలో పెట్టుకుని కీలక ఆటగాళ్లకు విశ్రాంతి ఇవ్వాలని కోహ్లి నిర్ణయించాడు. అయితే తుది జట్టులో ఎవరికి స్థానం దక్కుతుందన్నది చర్చనీయాంశమైంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆదివారం జోహాన్స్‌బర్గ్‌లో జరగనుంది.

వరల్డ్‌కప్‌పై కోహ్లి గురి

సఫారీ గడ్డపై తొలిసారి సిరీస్ గెలుచుకోవడంతో 2019 వరల్డ్‌కప్ నెగ్గేందుకు గట్టి పునాది పడిందని సారథి కోహ్లి అభిప్రాయపడ్డాడు. 'ఇక్కడ చరిత్ర సృష్టించడం గొప్పగా అనిపిస్తోంది. మా ఆటగాళ్లు బ్యాటు, బంతితో పాటు ఫీల్డింగ్‌లోనూ రాణించారు. ఎల్లప్పుడు మెరుగుదల కోరుకునే జట్టు మాది. ఈ పర్యటన తర్వాత 2019 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని మేం మరింత పటిష్టంగా తయారవడంపై దృష్టి పెడతామ'ని కోహ్లి చెప్పుకొచ్చాడు. జట్టు సభ్యుల సమష్టి కృషివల్లే చారిత్రక సిరీస్ విజయం సాధ్యమైందని విరాట్ అభిప్రాయపడ్డాడు.

మళ్లీ వన్డేల్లో అగ్రస్థానం...

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ గెలుచుకున్న టీమిండియా వన్డేల్లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. ఆరు నెలల కాలంలో భారత్ అగ్రపీఠం అధిరోహించడం ఇది మూడోసారి. ఐదో వన్డేలో విజయంతో కోహ్లిసేన సఫారీ జట్టును వెనక్కునెట్టి నెంబర్ వన్ ర్యాంక్ అందుకుంది. ఇప్పటికే నాలుగు వన్డేలు నెగ్గిన కోహ్లిసేన ప్రస్తుతం 122 పాయింట్లతో నెంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకుంది. సఫారీలు 118 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చివరి వన్డేలోనూ నెగ్గితే భారత్ 123 పాయింట్లకు చేరుతుంది. సఫారీలు ఒక పాయింట్ కోల్పోతారు.

భారత హాకీజట్టు స్పాన్సర్‌గా ఒడిస్సా



న్యూఢిల్లీ : భారత పురుషుల, మహిళల హాకీ జట్లకు స్పాన్సర్‌గా ఒడిస్సా ప్రభుత్వం ముందుకొచ్చింది. గురువారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. తమ ప్రభుత్వం రాబోయే ఐదేళ్ల పాటు ఇరుజట్లకు స్పాన్సర్‌షిప్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఒడిశాలో హాకీ ఒక క్రీడాంశం కంటే ఎక్కువని...గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు సైతం హాకీ స్టిక్‌లతో ప్రాక్టీస్ చేస్తుంటారన్నారు. అంతేగాక రాష్ట్రంనుండి భారత హాకీజట్టుకు దిలీప్ టిర్కె, ఇగ్నేష్ టిర్కె లాజరస్ బార్లా ప్రాతినిధ్యం వహించారని... ప్రస్తుత జట్టులో నలుగురు ఆటగాళ్ళు బీరేంద్ర లక్ర, అమిత్ రోహిదాస్, డీప్సన్ టిర్కే మరియు నామితా టాప్పోలు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ఇది తమ రాష్ట్రానికి లభించిన ఒక బహుమతిగా భావిస్తామన్నారు. ఐదేళ్ళపాటు కొనసాగే ఒప్పందపు వివరాలను వెల్లడిస్తూ... రెండు జట్ల క్రీడాకారులు ధరించిన జెర్సీలలో ఉన్న ఒక లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పురుషుల, మహిళల జట్టు సభ్యులతోపాటు, భారత హాకీ ఫెడరేషన్ అధ్యక్షులు నారిందర్ భాత్రా, జనరల్ సెక్రటరీ రాజీవ్ మెహతా తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్

ఎంపిలందరి చేత రాజీనామా

చంద్రబాబుకు జగన్ సవాల్

ప్రజాశక్తి-కొండాపురం (నెల్లూరు)

ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్న తమ పార్టీపై విమర్శలు మాని రాష్ట్ర ప్రయోజనాల కోసం మీరూ మాతో కలిసి వస్తారా..! అని వైసిపి నేత జగన్ సిఎం చంద్రబాబుకు సవాల్ విసిరారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా గురువారం నెల్లూరు జిల్లా కొండాపురం మండలం రేణమాలలో మహిళా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా కోసం తాము పోరాటం చేస్తుంటే టిడిపి తమపై విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తమ ఎంపిలతోపాటు అందరి చేత రాజీనామా చేయించి పోరాటానికి సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. కుప్పంలో మహిళలను బట్టలూడదీసి కొట్టించడమే కాకుండా సోషల్ మీడియాలో పెట్టి టిడిపి నాయకులు రాక్షసంగా ప్రవర్తించారని తెలిపారు. ఇసుక మాఫియాకు అడ్డం తిరిగినందుకు తహశీల్దారు వనజాక్షిని టిడిపి ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మీడియా సాక్షిగా ఈడ్చుకుంటూ కొడుతున్నా ముఖ్యమంత్రి పట్టించుకోలేదన్నారు. ఇలాంటి వారిని ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో మద్యం బెల్టుషాపులు తొలగిస్తానని చెప్పి ప్రతి గ్రామంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విభజన సమయంలో ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఏపికి పది సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. చంద్రబాబు 15 సంవత్సరాలు ఇవ్వాలని చెప్పి, ప్యాకేజీల మత్తులో పడి రాష్ట్రాన్ని మోసం చేశారన్నారు. ఇంజినీరింగ్, డాక్టర్లు చదివే విద్యార్థులకు 35 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చిందని, మిగతా 65 శాతం అప్పులు చేసి తల్లిదండ్రులు కడుతున్నారన్నారు. పేదరికం పోవాలంటే ఇంజినీర్లు, డాక్టర్లు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు మేకపాటి గౌతమ్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఎన్. ప్రసన్నకుమార్‌రెడ్డి, వాసిరెడ్డి పద్మ, రోజా పాల్గొన్నారు.

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో

29 మంది పోలీసులపై కేసు

ఆదిలాబాద్ జిల్లా కోర్టు తీర్పు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో 29 మంది పోలీసులపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టాలని ఆదిలాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి భరతలక్ష్మి గురువారం తీర్పునిచ్చారు. 2010 జులై 1న జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆజాద్ అలియాస్ చెరుకూరి రాజ్‌కుమార్, జర్నలిస్టు హేమచంద్రపాండే మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై ఆజాద్ సతీమణి పద్మ, జర్నలిస్టు సతీమణి భగత్ చంద్రన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2013 నుంచి ఈ కేసుపై సుదీర్ఘమైన న్యాయ పోరాటం జరిగింది. తర్వాత ఈ కేసును సిబిఐకి అప్పగించారు. దీంతో పోలీసుల్ని విచారించే అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. పిటిషన్‌దారులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఆ జిల్లా కోర్టులో కేసు వేయాలని తెలిపింది. దీంతో పిటిషన్‌దారులు 2013లో జిల్లా కోర్టులో కేసు వేశారు. మూడేళ్ల పాటు సుదీర్ఘ న్యాయ పోరాటం కొనసాగింది. ఆజాద్ కేసు తరఫున న్యాయవాది సురేష్ వాదించారు. ఈ మేరకు గురువారం జరిగిన మూడో వాయిదాలో ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు జడ్జి భరతలక్ష్మి ఆజాద్ తరపు న్యాయవాదుల పిటిషన్‌ను ఆమోదిస్తూ సెక్షన్ 204 ప్రకారం 29 మంది పోలీసులపై కేసు నమోదు చేయాలని, వారిని కోర్టులో హాజరుపర్చాలని తీర్పునిచ్చారు. సుదీర్ఘమైన న్యాయపోరాటంలో మూడు వాయిదాల్లోనే సానుకూలమైన తీర్పు వచ్చిందని న్యాయవాది సురేష్, ఆజాద్ భార్య పద్మ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బాదుడు వల్లే కొరత

- పది రకాల ఛార్జీలతో జనం బెంబేలు
- నగదు విడుదల చేయని రిజర్వ్‌బ్యాంకు
- నోట్ల రద్దు తరువాత వచ్చింది రూ.61 వేల కోట్లే
- బ్యాంకులకు తిరిగి జమవుతున్నది అందులో సగమే
- పే గవర్నమెంట్ అమలుపై కేంద్రం ఒత్తిడి
- ఏడు రకాల ఆన్‌లైన్‌ల వాడకంపై రాష్ట్రాలకు లేఖలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎక్కడ చూసినా నగదు బాధలే. నగదు లేక మూతపడుతున్న ఎటిఎంలు. తెరిచి ఉన్నా నో క్యాష్ అంటూ వేలాడుతున్న బోర్డులు. రోజువారీ ఖర్చులకు కూడా నగదు లేక అల్లాడిపో తున్నామని. బ్యాంకు లావాదేవీలతో సర్ ఛార్జీల బాదుడు భరించలేకపోతు న్నామంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. అందుకే దొరికినప్పుడల్లా పెద్ద మొత్తాన్ని ఒకేసారి తీసుకుని ఇంట్లోనే దాచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక రిజర్వ్‌బ్యాంకు కూడా అసరమైనన స్థాయిలో నగదును విడుదల చేయడం లేదని అధికారుల వివరణ. ఇవీ తాజాగా కనిపిస్తున్న పరిస్థితి. నగదు కొరతకు కూడా ఇవే కారణాలుగా ఆర్థిక నిపుణులు విశ్లేషి స్తున్నారు. ఈ సమస్యల్ని పరిష్కరించ లేని కేంద్రం కొత్తగా ఆన్‌లైన్ లావా దేవీలపై రాష్ట్రాలపై ఒత్తిడి పెంచు తోంది. దీనిపై అన్ని రాష్ట్రాలకూ లేఖలు రాసింది.

2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు తరువాత నెలకొన్న ఆర్థిక అస్తవ్యస్థ పరిస్థితులే తాజాగా కూడా కనిపిస్తున్నాయి. బ్యాంకుల వద్ద నగదు లేని పరిస్థితి రోజురోజుకూ పెరుగుతోంది. కొన్ని ప్రయివేటు బ్యాంకుల్లో నగదు నిల్వలు ఉండగా, స్టేట్‌బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు వంటి ప్రధాన బ్యాంకుల్లో సమస్యలు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. వీటికి కారణాలు విశ్లేషిస్తే బ్యాంకుల సర్‌ఛార్జీ బాదుడే కీలకంగా కనిపిస్తోంది. ఈ బాదుడు భరించలేక జనం బ్యాంకులకు వెళ్లడం లేదు. అందుకే బ్యాంకుల నుంచి జనానికి వెళ్తున్న నగదు తిరిగి బ్యాంకులకు చేరడం లేదు. బ్యాంకు ఖాతా ప్రారంభించిన సమయం నుంచి ప్రతి లావాదేవీకీ జనం అదనపు రుసుం ను చెల్లించాల్సి వస్తోంది. ఖాతాదారుడు ఎటిఎం కార్డు తీసుకుంటే అతని బ్యాంకు నిల్వ నుంచి ఏటా 200 రూపాయల్ని బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. అలాగే డెబిట్ కార్డుల్ని ఉపయోగించిన ప్రతిసారి 0.5 శాతం నుంచి ఒక శాతం వరకు వసూలు చేస్తున్నాయి. అదే క్రెడిట్ కార్డులు ఉపయోగిస్తే, లావాదేవీ విలువ నుంచి 1.5 శాతం నుంచి 2.5 శాతం వరకు వసూలు చేస్తున్నాయి. అలాగే పేటిఎం, ఫ్రీఛార్జ్, జియోమనీ, ఇతర ఈ-వాలెట్‌లను ఉపయోగిస్తే 2.5 శాతం నుంచి 3.5 శాతం వరకు బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ఇవి కాకుండా ఇతర సేవా పన్ను పేరిట కూడా వసూలు చేస్తున్నారు. ఖాతా ఉన్న బ్యాంకుల్లో కాకుండా వేరే బ్యాంకు ఎటిఎంల నుంచి నగదు లావాదేవీలు చేస్తే కూడా ఛార్జీల మోత మోగిపోతోంది.

పే గవర్నమెంట్ పేరుతో

తాజాగా ఆన్‌లైన్ వాడకాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పే గవర్నమెంట్ (పేగొ) పేరిట కార్యాచరణ ప్రకటించింది. ఏడు విభాగాల ద్వారా ప్రభుత్వ, ప్రయివేటు లావాదేవీలను అమలు చేయాలని నిర్దేశించింది. అయితే ఈ కొత్త విధానాలపైనా బాదుడు తప్పదని స్పష్టమవుతోంది. క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, ఐఎంపిఎస్ (ఇమ్మిడియేట్ పేమెంట్ సర్వీస్), క్యాష్‌కార్డు-ప్రీపెయిడ్- వాలెట్స్, ఎన్ఇఎఫ్‌టి, వివిఎల్ఇ, బిహెచ్ ఐఎం విధానాల్ని కేంద్రం ప్రోత్సహిస్తోంది. వీటిని వినియోగిస్తే నెట్ బ్యాంకింగ్‌లో 500 రూపాయల వరకు 5 రూపాయలు, దాటితే 10 రూపాయలు వసూలుచేస్తారు. డెబిట్ కార్డు వాడితే రెండు వేల కన్నా ఎక్కువ లావాదేవీలు ఉంటే సర్‌ఛార్జీ తప్పదు. క్రెడిట్ కార్డులో ప్రతీ లావాదేవీకీ ఒక శాతం, క్యాష్ కార్డు, ప్రీపెయిడ్ వాలెట్ల అమలులో పది రూపాయలు, లేదా 1.5 శాతాన్ని వసూలు చేస్తారు. ఐఎంపిఎస్ వినియోగిస్తే రూ.5000 వరకు 5 రూపాయలు, 25వేల లోపు అయితే 7 రూపాయలు, 50వేల రూపాయల వరకు 8 రూపాయలు, లక్ష వరకు 9 రూపాయలు వసూలు చేస్తారు. బిహెచ్ఎంఐ వినియోగంలో కూడా రూ.2వేల రూపాయల లావాదేవీ దాటితే 7.5 రూపాయల్ని అదనంగా వసూలు చేస్తారు. ఈ ఛార్జీలు సాధారణంగా ఉన్న పన్నులకు అదనంగానే ఉండడడం ప్రజలకు మరింత భారంగా మారనుంది. అందుకే ఈ విధానాన్ని ఎలా ప్రజల ముందుకు తీసుకువెళ్లాలన్న దానిపై ఆర్థికశాఖ అధికారులు మల్లగుల్లాలు పడతున్నారు.



ఎస్‌హెచ్‌జీలపైనా భారమే

స్వయం సహాయ సంఘాలకు ఇచ్చే రుణాలపై బ్యాంకులు 14.5 శాతం వడ్డీని వసూలు చేస్తున్నాయి. రుణాన్ని అందించేందుకు ప్రాసెసింగ్ రుసుముగా మొత్తం రుణంపై ఒక శాతం, లబ్ధిదారుల పథకాల్ని తనిఖీ చేసేందుకు మరో 0.25 శాతాన్ని, లెడ్జర్ పుస్తకాల నిర్వహణకు మరికొంత మొత్తాన్ని కూడా వసూలు చేస్తున్నారు. సంఘ నాయకురాలిని మార్చుకునేందుకు కూడా మరికొంత మొత్తాన్ని అదనపు రుసుముగా బ్యాంకులు వసూలు చేస్తున్నాయి.

సన్నగిల్లిన నగదు రాక

నోట్ల రద్దు తరువాత రాష్ట్రానికి వచ్చిన నోట్లు తక్కువగా ఉంటున్నాయన్న విమర్శలొస్తున్నాయి. అధికారులు సిద్ధం చేసిన గణాంకాల మేరకు గత నెల వరకు రూ.61 వేల కోట్లు మాత్రమే కరెన్సీ రాష్ట్రానికి వచ్చింది. ఇది రాష్ట్ర అవసరాలకు ఎంతమాత్రం సరిపడడం లేదని అధికారులు చెబుతున్నారు. మరింత ఎక్కువ నగదును పంపించాలని పలు దఫాలుగా రిజర్వ్‌బ్యాంకును కోరినప్పటికీ ఫలితం లేదని వారు అంటున్నారు. ఈ మొత్తంలో కూడా అత్యధికంగా కృష్ణా జిల్లాకు, తరువాత విశాఖ, చిత్తూరు జిల్లాలకు పంపించగా, సీమ జిల్లాలకు తక్కువ మొత్తం వెళ్లింది. అందుకే కొన్ని జిల్లాల్లో తీవ్ర అసంతృప్తి రేగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మరో రూ.5000 కోట్లు అత్యవసరంగా రాష్ట్రానికి పంపించాలని ఆర్‌బిఐని ప్రభుత్వం కోరుతోంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68